www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మార్చి మొదటి వారంలో గ్రూప్-1 ఫలితాలు!

ఆ వెంటనే గ్రూప్-2, 3 కూడా..

మొత్తం 2,734 పోస్టులకు 5,51,247 మంది పోటీ

గ్రూప్-1లో ఒక్కో పోస్టుకు 37 మంది పోటీ

గ్రూప్-2లో 1:329, గ్రూప్-3లో 1:196

ఉద్యోగ ఖాళీలు మిగలకుండా టీజీపీఎస్సీ వ్యూహాత్మక చర్యలు 12

మంగళవారం | 18-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 304 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి పూర్తి; నక్షత్రం: చిత్త ఉ.7.35 తదుపరి స్వాతి; వర్జ్యం: మ.1.54-3.42, దుర్ముహూర్తం: ఉ.9.01-9.47, రా.10.20-11.08, అమృతఘడియలు: రా.12.44-2.32, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.43, సూర్యాస్తమయం: 6.14 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కార్డులు ఇవ్వండి

కోడ్ లేని జిల్లాల్లో అర్హులకు వెంటనే రేషన్ కార్డులు జారీ చేయండి



హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పౌరసరఫరాల శాఖపై జరిపిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్

ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిశాక అన్ని జిల్లాల్లో..
అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
కొత్త కార్డుల డిజైన్లను పరిశీలించిన సీఎం
ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం
కలెక్టర్లు, ఎస్పీలకు ముఖ్యమంత్రి ఆదేశం

ఏపీ నీటి తరలింపును అడ్డుకోవాలి

కృష్ణా నీటిని వాటాకు మించి తరలిస్తోంది
కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదు చేయాలి
టెలిమెట్రీ యంత్రంతో నీటిని లెక్కగట్టాలి
రాబోయే 3 నెలలు అప్రమత్తంగా ఉండాలి
అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో అర్హులైన వారందరికీ వెంటనే రేషన్‌కార్డులు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మిగిలిన అన్ని జిల్లాల్లో కొత్త కార్డులు ఇవ్వాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. సోమవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పౌరసరఫరాల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన అర్జీలు, కులగణనతోపాటు గ్రామసభలు, మీ సేవల్లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించే ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలన్నారు. అర్హులైన వారందరికీ కొత్త కార్డులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల కోసం ఇప్పటికే పలుమార్లు అవకాశం ఇచ్చినా మీసేవ కేంద్రాల వద్ద రద్దీ ఎందుకు ఉంటోందని

మిగతా 13వ పేజీలో...

ఇసుక అక్రమాలకు పాల్పడితే
లైసెన్సుల రద్దు

కాంట్రాక్టు సంస్థలు బ్లాక్ లిస్ట్‌లో..
రీచ్‌ల్లో సీసీ కెమెరాలు, వే బ్రిడ్జిలు
వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్
రూ.570 కోట్ల పెండింగ్ బిల్లులను త్వరలో చెల్లిస్తాం
మైనింగ్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్
అక్రమాలపై ఫిర్యాదులకు 98480 94373, 70939 14343 13



రోడ్డుపై టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే
ఎయిర్ అంబులెన్స్

ఐసీఏటీటీతో ఈప్లేన్ కంపెనీ 8,700 కోట్ల డీల్
788 ఈవీటీవోఎల్‌ల సరఫరాకు ఒప్పందం
త్వరలో దేశంలోని అన్ని జిల్లాల్లో మోహరింపు
2026 చివరకు సేవలు ప్రారంభమయ్యే చాన్స్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: మనిషి ప్రాణం చాలా విలువైనది! ప్రమాదానికి గురైన సమయంలో లేదా తీవ్ర అనారోగ్యం బారిన పడినప్పుడు వారిని సకాలంలో ఆస్పత్రులకు చేరవేయడంలో అంబులెన్స్‌లది కీలక పాత్ర!! అయితే పట్టణాలు, నగరాల్లో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ కారణంగా కొన్నిసార్లు అంబులెన్స్‌లు ఆ రద్దీలో చిక్కుకొని, ముందుకు వెళ్లేందుకు దారిలేక.. పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. దేశంలో ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాల్లో వందలాది మంది మరణిస్తున్న నేపథ్యంలో ఆ ఆటంకాలను

మిగతా 2వ పేజీలో...

ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకుంటే
డబుల్ టోల్ బాదుడు

బ్లాక్ లిస్టులో ఉన్నా జరిమానా 2
60 నిమిషాల ముందే రీచార్జ్ చేసుకోవాలి
టోల్ దాటాక 10 నిమిషాల్లో రీచార్జ్ చేస్తే జరిమానా మొత్తం వెనక్కి: ఎన్‌పీసీఐ

అక్రమ క్రమబద్ధీకరణపై
కొరడా ఏదీ!?

అన్నీ సక్రమంగా ఉన్నవారికి మోక్షమేదీ!?
జీవో 59 కింద వచ్చిన దరఖాస్తులు ఎక్కడివక్కడే
అవకతవకలు పక్కాగా కనిపిస్తున్నా చర్యల్లేవు
మూడు జిల్లాల్లో అనుమతులు నిలిపివేస్తూ ఏడాది కిందట రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
మిగిలిన జిల్లాల్లోనూ ముందుకు సాగని వైనం
ఆదాయం వచ్చే అవకాశమున్నా పరిష్కారం లేదు




హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): *"జీవో 59 ముసుగులో బీఆర్ఎస్ పాలకులు రూ.వందల కోట్ల విలువైన భూములు మింగేశారు. ఒక్క రాయదుర్గంలోనే 8.29 ఎకరాలను తమ తొత్తుల పేరిట మార్చుకున్నారు. హైదరాబాద్‌లో మరోచోట ఎకరం రూ.100 కోట్లున్న భూమికి సంబంధించి 19 ఎకరాలను స్వాహా చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే సుమారు 2 వేల ఎకరాల ప్రభుత్వ భూములను బినామీల పేరుతో మార్చుకున్నారు. ఆ వివరాలన్నీ సేకరించాం"*

- గత ఏడాది డిసెంబరులో ప్రభుత్వ విజయోత్సవాల సందర్భంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్న మాటలివి. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. జీవో నంబరు 59 విషయంలో చోటు చేసుకున్న అక్రమాలను తేల్చలేదు. ఆధారాలతో సహా కొన్ని కేసులు కళ్ల ముందే కనిపిస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు సరికదా.. క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల్లో సక్రమంగా ఉన్న వాటికీ పరిష్కారం చూపడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వ తీరు ఒక అడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి

మిగతా 12వ పేజీలో...

ఆ దరఖాస్తులు
ఇక స్వీకరించం

'ప్రార్థనామందిరాల'పై వెల్లువలా పిటిషన్లు
అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు
చాలిక.. కొత్తవి తీసుకోం: చీఫ్ జస్టిస్ ఖన్నా
విచారణ ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ప్రార్థనా మందిరాల చట్టం-1991పై కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు వచ్చిపడుతుండడం పట్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. 'చాలు.. చాలు. వీటికి ఇక ముగింపు పలుకుదాం' అని స్పష్టం చేశారు. దేశంలోని పలు ప్రార్థనా మందిరాల స్థితినీ, ఆకృతినీ మార్చాలంటూ ఈ దరఖాస్తులు దాఖలవుతున్నాయి. అయితే, ఇకపై కొత్తగా ఈ అంశంపై వచ్చే దరఖాస్తులను తీసుకోబోమని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ద్విసభ్య బెంచ్ వెల్లడించింది. ఇప్పటికే దాఖలైన ఓ దరఖాస్తుకు సంబంధించి మధ్యవర్తిత్వ (రిట్) పిటిషన్‌ను మాత్రం అనుమతిస్తున్నామని తెలిపింది. రామ జన్మభూమి వివాదం నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో...



పాల్వంచ మండలం రాజాపురంలోని ఓ చేపల చెరువులో తేలియాడుతున్న చనిపోయిన కోళ్లు, చికెన్ వ్యర్థాలు

చచ్చిన కోళ్లు, చికెన్ వ్యర్థాలే చేపల మేత..!

భద్రాద్రి జిల్లా పాల్వంచ ప్రాంతంలోని చెరువుల్లో వినియోగం
చికెన్ సెంటర్ల నుంచి సేకరణ.. ఏపీకి కూడా తరలింపు 3
మహబూబాబాద్ జిల్లా పాకాల ఏరులో కోళ్ల కళేబరాలు
బర్డ్‌ఫ్లూ ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం!

ఎ.కొండూరులో 3 వేల కోళ్లు మృతి.. నమూనాలు ల్యాబ్‌కు
పశ్చిమగోదావరి జిల్లాలో 21 వేల కోళ్ల ఖననం 3

రాజేంద్రనగర్ కోర్టులో పందెం కోళ్ల వేలం..
ధర 'పుంజు'కొనె

9 కోళ్లకు కలిపి కనీస ధర రూ.14 వేలుగా నిర్ణయం
ఒక్కో పందెం పుంజుకూ సగటున రూ.20వేలు పలికిన వైనం
ఇలా 81 కోళ్లకు మొత్తంగా రూ.16.65 లక్షలు
ఇవన్నీ తొలుకట్ట ఫాంహౌస్ నుంచి స్వాధీనం చేసుకున్న కోళ్లు



రాజేంద్రనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా కోడిపుంజు కోసం వేలకు వేలు పెడతారా? ఒక్క పుంజు కోసం మరీ రూ.20వేలు వెచ్చించి కొంటారా? కొనేందుకు పోటీపడ్డారు.. కొన్నారు. ఇలా మొత్తంగా 81 కోళ్లకు వేలం పాట నిర్వహిస్తే ఏకంగా రూ.16.65 లక్షలొచ్చాయి. ఇవన్నీ కూడా పందెం నిర్వాహకుల నుంచి స్వాధీనం చేసుకున్న కోళ్లే! వేలం పాటలో ఈ కోళ్ల కోసం ఇంతలా ధర పెట్టాల్సిన అవసరం ఏముచ్చింది? అనే సందేహం రావొచ్చు. దీనికి కాస్త ఆలోచిస్తే ఆ మర్మం తెలిసిపోతుంది! మక్కల దాణా మొదలు.. బాదాం పప్పులు,

మిగతా 12వ పేజీలో...



మళ్లీ కేసీఆరే రావాలని
జనం కోరుకుంటున్నారు

ఆయన తెలంగాణ జాతికే హీరో 12
కేసీఆర్ జన్మదిన వేడుకల్లో కేటీఆర్
పాములపర్తిలో ప్రైవేట్ కార్యక్రమంలో దండలు మార్చుకున్న కేసీఆర్ జంట
రాష్ట్రవ్యాప్తంగా పుట్టినరోజు వేడుకలు



కొత్త సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్

మోదీ, రాహుల్, షాతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ ఎంపిక
రాష్ట్రపతికి సిఫారసు 2
సుప్రీం తీర్పొచ్చేదాకా నియామక ప్రక్రియను నిలిపివేయాలి: కాంగ్రెస్
జ్ఞానేశ్ స్థానంలో ఈసీగా హరియాణా సీఎస్ వివేక్ జోషి



బూతులే బంగారు బాతులు!

అసభ్య, బూతు వీడియోలతో భారీగా ఆదాయం
నెలకు రూ.లక్షల్లో యూట్యూబర్ల సంపాదన
చట్టాలను పట్టించుకోరు.. ప్రైవసీనీ లెక్కచేయరు
సోషల్ మీడియాలో పెరిగిపోతున్న విచ్చలవిడితనం
రాష్ట్ర సర్కారు అడ్డుకోవచ్చు.. ఐనా పట్టించుకోదు!



మనం మామూలుగా మాట్లాడే భాషలో పదాలు.. కొందరు యూట్యూబర్ల దృష్టిలో పచ్చిబూతులకు పర్యాయపదాలు! సభ్యత ఉన్నవారికి రోతగా అనిపించే మాటల్ని మంచినీళ్ల ప్రాయంగా వాడేస్తూ వారు రూపొందించే వీడియోలు.. కాసులు కురిపించే బంగారు బాతులు!! అశ్లీల సంభాషణలు వినడానికి అంగలార్చే అథమస్థాయి అభిరుచి ఉన్నవారే వారికి మహరాజపోషకులు. ద్వంద్వార్థాలు ధ్వనించే థంబ్‌నెయిల్స్‌తో తమ వీడియోలకు వ్యూస్ పెంచుకోవడం వారికి వెన్నతో పెట్టిన విద్య. అలాంటి వీడియోలతో నెలకు రూ.లక్షల్లో సంపాదిస్తున్న యూట్యూబర్లు తెలుగు రాష్ట్రాల్లో లెక్కకుమిక్కిలిగా ఉన్నారు! చెక్‌పెట్టే చట్టాలున్నా.. పట్టించుకునే వారు లేకపోవడంతో బూతు వీడియోల దందా వేలల్లో షేర్లు.. లక్షల్లో లైకులుగా విరాజిల్లుతోంది!

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి దగ్గరే ఉంటూ.. దోస్తులతో ఎంజాయ్ చేస్తూ.. అక్షరం ముక్క రాకపోయినా.. ఏ మాత్రం కష్టపడకుండా.. కొందరు ప్రతి నెలా రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. అదెలా అనుకుంటున్నారా? యూట్యూబ్ చానళ్ల ద్వారా!! అవును.. యూట్యూబ్ చానల్‌లో బూతు, అశ్లీల వీడియోలు పెట్టేసి.. సబ్‌స్క్రైబర్లను పెంచుకుంటున్నారు. రోజుకో బూతు వీడియో అప్‌లోడ్ చేసేస్తున్నారు. అశ్లీలత ఎంత ఎక్కువగా ఉంటే.. ఆదాయం అంతగా

మిగతా 14వ పేజీలో...

రాత్రికి రాత్రే హైదరాబాద్‌ను
మార్చలేరు!



'శనివారం విచారణ.. ఆదివారం కూల్చివేత'ను ఆపండి
అలా చేయడం తీర్పులకు విరుద్ధం: హైకోర్టు
హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ప్రత్యక్ష హాజరుకు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెల్లారేసరికి హైదరాబాద్ నగరాన్ని మార్చేస్తామన్న భ్రమలో హైడ్రా ఉన్నట్లుందని, 24 గంటల్లో ఏదీ మార్చలేరని హైకోర్టు వ్యాఖ్యానించింది. పౌరులకు 24 గంటల సమయం ఇచ్చి.. టైటిల్, ఇతర అన్ని పత్రాలు సమర్పించాలని ఆదేశించడం సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకమని పేర్కొంది. శనివారం రోజు విచారణ జరిపి.. ఆదివారం రోజు కూల్చివేతలు చేపట్టడం గర్హనీయమని ఆక్షేపించింది. ఓ కేసుపై విచారణ జరిపిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. వారాంతాల్లో కూల్చివేతలు చేపట్టరాదని సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు స్పష్టంగా ఉన్నప్పటికీ హైడ్రా అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని

మిగతా 12వ పేజీలో...

ఏసీబీ ఎదుటకు ఎఫ్ఈవో ప్రతినిధులు

ఫార్ములా ఈ-కారు రేసు కేసులో వర్చువల్ విచారణ
సంస్థ ప్రతినిధులను ప్రశ్నించిన ఏసీబీ అధికారులు
రేసు నిర్వహణకు కుదుర్చుకున్న ఒప్పందాలు, నగదు చెల్లింపులపై ఆరా తీసిన అధికారులు 14
విచారణ మొత్తం ఆడియో, వీడియో రికార్డింగ్
ప్రత్యక్ష విచారణకు రప్పించే యోచనలో ఏసీబీ!

రోడ్డుపై టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే

ఎయిర్ అంబులెన్స్

(మొదటి పేజీ తరువాయి)

అదిగమించేలా ఏ మారుమూల ప్రాంతం నుంచి ఎక్కడికైనా రోడ్డుపై (ఆన్-రోడ్) నిలువుగా టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే 'ఎయిర్ అంబులెన్స్'లు త్వరలో దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లాలో అందుబాటులోకి రానున్నాయి. తద్వారా ఈ తరహా అంబులెన్స్‌లను ప్రారంభించిన ప్రపంచంలోని కొద్ది దేశాల జాబితాలో భారత్ చేరనుంది. దీంతో రోగులను, ప్రమాద బాధితులను వాయు మార్గంలో అత్యంత వేగంగా ఆస్పత్రులకు చేరవేసేందుకు అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించి ఐఐటీ మద్రాస్ కేంద్రంగా పనిచేసే 'ఈప్లేన్ కంపెనీ' అనే ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్ స్టార్టప్ దేశంలో ప్రముఖ ఎయిర్ అంబులెన్స్ సంస్థ ఇంటర్నేషనల్ క్రిటికల్-కేర్ ఎయిర్ ట్రాన్స్‌ఫర్ టీమ్ (ఐసీఏటీటీ)తో 100 కోట్ల డాలర్ల మేర (సుమారు రూ.8,700 కోట్లు) ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం ఆ సంస్థ 788 ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అఫ్ ల్యాండింగ్ (ఈవీటీవోఎల్) ఎయిర్ అంబులెన్స్‌లను సరఫరా చేయనున్నది. వీటిని దేశంలోని ప్రతి జిల్లాలో మోహరించనున్నారు. నమోదిత గ్రహీతల్లో దాదాపు 95 శాతం మంది సకాలంలో అవయవాలు పొందక మరణిస్తున్న నేపథ్యంలో అతి తక్కువ సమయంలో అవయవాలు, ఔషధాలను తరలించేందుకు ఇవి ఉపయుక్తం కానున్నాయి.



2026 చివరకు అందుబాటులోకి!

2026 చివరి త్రైమాసికం నాటికి ఎయిర్ అంబులెన్స్‌ల కార్యకలాపాలు ప్రారంభించాలని ఈప్లేన్ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తమ సంస్థకు ఏడాదికి 100 యూనిట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని కంపెనీ వ్యవస్థాపకుడు సత్య చక్రవర్తి పేర్కొన్నారు. చక్రవర్తి ఐఐటీ మద్రాస్‌లో ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. ఎయిర్ అంబులెన్స్‌ల ఒప్పందం పూర్తయినప్పటికీ, ఇతర రకాల ఈవీటీవోఎల్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను తయారు చేసేందుకు, పరీక్షించేందుకు, అవసరమైన సర్టిఫికేషన్ పొందేందుకు మరో 10 కోట్ల డాలర్ల నిధులను ఆయన ఆశిస్తున్నారు. ఇప్పటి వరకు ఈప్లేన్ కంపెనీ 2 కోట్ల డాలర్ల మేర పెట్టుబడిదారుల నుంచి సేకరించింది. ఈప్లేన్ కంపెనీ ప్రస్తుతం వివిధ రకాల భౌగోళిక పరిస్థితులు, జనాభా సాంద్రతల అవసరాల ఆధారంగా మూడు రకాల ఎయిర్ అంబులెన్స్ నమూనాలపై పనిచేస్తోంది. ఈ అంబులెన్స్‌లో ఒక పైలట్, ఒక పారామెడిక్, స్ట్రెచ్చర్ ఉంటాయి. ఇంకా రోగికి అత్యవసర సమయంలో అవసరమైన వైద్య పరికరాలు, మెడికల్ కిట్లు ఇందులో ఉండేలా తయారు చేయనున్నారు. గరిష్ఠంగా గంటకు 200 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉంటుంది. ఒకసారి బ్యాటరీ రీచార్జ్ చేస్తే 100-200 కిలోమీటర్ల దూరంగా వరకు వెళ్లగలవు.

పేపర్ల లీకేజీ వార్తలు నిరాధారం: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: పరీక్షల పేపర్లు లీకయ్యాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై సీబీఎస్ఈ స్పష్టత ఇచ్చింది. ఆ ప్రచారం అంతా నిరాధారమని కొట్టిపారేసింది. అసత్య ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. 10, 12 తరగతుల పేపర్లు లీక్ అయ్యాయంటూ జరుగుతున్న ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీబీఎస్ఈ సూచించింది. వదంతులకు కారకులపై చర్యలు తీసుకుంటున్నామని బోర్డు అధికారులు వెల్లడించారు. "వదంతుల ప్రచారంలో విద్యార్థుల పాత్ర ఉంటే.. తదనంతర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది. వారిపై సీబీఎస్‌బీ నిబంధనలు, ఐపీసీ సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని బోర్డు సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. శనివారం ప్రారంభమైన 10, 12 తరగతుల బోర్డు పరీక్షలు ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి.

20 బడుల నిర్మాణానికి 2వేల కోట్లు: అదానీ గ్రూప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: దేశవ్యాప్తంగా 20 పాఠశాలలను నిర్మించేందుకు రూ.2వేల కోట్లు విరాళంగా ఇస్తున్నట్టు అదానీ గ్రూప్ సోమవారం ప్రకటించింది. ఇటీవల గౌతమ్ అదానీ చిన్న కుమారుడు జీత్ వివాహం సందర్భంగా అదానీ రూ.10వేల కోట్ల విరాళాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతరం వేటికోసం ఎంత మొత్తాన్ని విరాళం ఇస్తున్నదీ అదానీ గ్రూప్ వెల్లడిస్తూ వస్తోంది. ఆస్పత్రుల నిర్మాణం కోసం రూ.6వేల కోట్లు, నైపుణ్యాల అభివృద్ధికి మరో రూ.2వేల కోట్లను ఇప్పటికే ప్రకటించింది. తాజాగా పాఠశాలల ఏర్పాటుకు విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు అదానీ గ్రూప్ దాతృత్వ విభాగమైన అదానీ ఫౌండేషన్.. ప్రైవేటు కే-12 విద్యలో ప్రపంచ అగ్రగామి అయిన జెమ్స్ ఎడ్యుకేషన్‌తో చేతులు కలిపింది. ఈ సంస్థ పాఠశాలలను ఏర్పాటు చేస్తుంది. 2025-26 విద్యా సంవత్సరంలో మొదటి 'అదానీ జెమ్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' లఖ్‌నవూలో అందుబాటులోకి రానుంది.

ఐటీ బిల్లులో ఎన్నికల బాండ్లకు అవకాశం!

- సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం: నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: కొత్త ఆదాయ పన్ను బిల్లు-2025లో ఎన్నికల బాండ్లకు సంబంధించి నిబంధనలను చేర్చడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల బాండ్లను సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంది. ఈ మేరకు గత ఏడాది ఫిబ్రవరి 15న ఇచ్చిన ఉత్తర్వుల్లో కేంద్ర ఎలక్టోరల్ బాండ్ స్కీంను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే కొత్త ఐటీ బిల్లు షెడ్యూల్ 8లో ఎన్నికల బాండ్ల గుర్తించి ప్రస్తావన చేశారు. చట్టాల్లోని లోపాలను ఆసరాగా చేసుకొనో, లేదంటే వేరే వేరే రూపాల్లోనో ఎన్నికల బాండ్లను తిరిగి ప్రవేశపెట్టాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోందని నిపుణులు విశ్లేషించారు.

భారత పర్యటనకు ఖతార్ ఎమిర్

- ఎయిర్‌పోర్టుకు వెళ్లి స్వాగతం పలికిన మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ రెండు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ స్వయంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. "నా సోదరుడిని ఆహ్వానించేందుకు విమానాశ్రయానికి వెళ్లాను" అని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. కాగా, మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీతో ఖతార్ ఎమిర్ తమీమ్ బిన్ హమద్ భేటీ కానున్నారు.

చైనాను శత్రువుగా చూడొద్దు

- మొదటి నుంచీ భారత్‌ది ఘర్షణ వైఖరి: శామ్ పిట్రోడా
- ఆయన వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: చైనాతో ఆది నుంచీ భారత్ ఘర్షణ వైఖరి అనుసరిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఓవర్‌సీస్ కాంగ్రెస్ చైర్మన్ శామ్ పిట్రోడా వ్యాఖ్యానించారు. ఆ దేశాన్ని శత్రువుగా పరిగణించరాదని.. దానిని గుర్తించి గౌరవించాలని, కలిసి నడవాలని సూచించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్, ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆ దేశానికి, భారత వ్యతిరేక అమెరికన్ పారిశ్రామికవేత్త జార్జ్ సొరోస్‌కు ఏజెంట్లుగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తింది. దీంతో పిట్రోడా వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని ఆ పార్టీ ప్రకటించింది. భారత్-చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతల పరిష్కారంలో మధ్యవర్తిత్వానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఈ నెల 13న వైట్‌హౌస్‌లో ప్రధాని మోదీతో సంయుక్త విలేకరుల సమావేశం సందర్భంగా ప్రతిపాదించడం.. దీనిని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తిరస్కరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పిట్రోడా సోమవారం ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. చైనా పట్ల భారత్ తన వైఖరిని మార్చుకోవలసిన అవసరం ఉందన్నారు.

ఆలస్యమవుతోందని పారాగ్లైడింగ్ ద్వారా పరీక్ష కేంద్రానికి

- మహారాష్ట్రలో విద్యార్థి వినూత్న ఆలోచన

ముంబై, ఫిబ్రవరి 17: ఓవైపు పరీక్షకు సమయం మించిపోతోంది. మరోవైపు రోడ్డుపై ట్రాఫిక్. దాంతో పరీక్ష కేంద్రానికి సమయానికి చేరుకునేందుకు ఓ విద్యార్థి విన్నూత దారిని ఎంచుకున్నాడు. పారాగ్లైడింగ్ ద్వారా పరీక్షాకేంద్రానికి చేరుకున్నాడు. మహారాష్ట్రలో సతారా జిల్లా పసరణి గ్రామానికి చెందిన సమర్థ్ బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పంచగనిలో వారాంతాల్లో ఓ జ్యూస్ షాప్ నడుపుతున్నాడు. ఇటీవల ఓ రోజు సమర్థ్ ఆ షాపులో ఉన్న సమయంలో అతడి స్నేహితులు ఫోన్ చేసి పరీక్షకు సమయమవుతోంది ఎక్కడ ఉన్నావని అడిగారు. దాంతో సమర్థ్‌కు ఏమీ పాలుపోలేదు. వాయిదా పడిన ఓ పరీక్ష ఆ రోజు నిర్వహిస్తున్న సంగతి అతడికి తెలియదు. దాంతో కంగారుపడ్డాడు. తాను ఉన్న దగ్గరి నుంచి పరీక్షాకేంద్రానికి వెళ్లేందుకు పావుగంట సమయం మాత్రమే ఉంది. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో 15 కి.మీల దూరంలోని పరీక్షా కేంద్రానికి రోడ్డు మార్గంలో వెళ్తే సమయానికి చేరుకోలేనని సమర్థ్ గ్రహించాడు. దాంతో పంచగని జీపీ అడ్వెంచర్స్‌లో గోవింద్ యేవాలే అనే సాహస క్రీడల నిపుణుడిని తనను పారాగ్లైడింగ్ ద్వారా పరీక్ష కేంద్రానికి చేర్చాలని అభ్యర్థించాడు. గోవింద్ తన బృందం సహాయంతో పారాగ్లైడింగ్ ద్వారా సమర్థ్‌ను సమయానికి పరీక్ష కేంద్రానికి పంపారు.



కొత్త సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్

ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ, అమిత్‌షాతోకూడిన ఉన్నతస్థాయి కమిటీ ఎంపిక.. రాష్ట్రపతికి సిఫారసు

- నూతన చట్టం ప్రకారం తొలి సీఈసీ నియామకమిదే
- ఆ చట్టంపై సుప్రీం తీర్పు వచ్చేదాకా ప్రక్రియను నిలిపివేయాలన్న కాంగ్రెస్
- ఈ భేటీనే జరిపి ఉండకూడదన్న రాహుల్
- జ్ఞానేశ్ స్థానంలో ఈసీగా వివేక్ జోషి



జ్ఞానేశ్‌కుమార్



వివేక్ జోషి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎన్నికల కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జ్ఞానేశ్ కుమార్.. భారతదేశ 26వ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఎన్నికల కమిషనర్‌గా.. ప్రస్తుతం హరియాణా సీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న వివేక్ జోషి (1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి) నియమితులయ్యారు. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారం ముగియనున్న నేపథ్యంలో.. తదుపరి సీఈసీని ఎంపిక చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ సోమవారం భేటీ అయింది. ప్రధానమంత్రి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరయ్యారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ నేతృత్వంలోని సెర్చ్‌కమిటీ ప్రతిపాదించిన ఐదుగురు అభ్యర్థుల జాబితా నుంచి జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీగా వారు ఎంపిక చేసి తమ నిర్ణయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఫారసు చేసినట్టు కేంద్ర న్యాయశాఖ వెల్లడించింది. కేరళ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన జ్ఞానేశ్‌కుమార్ (61) గతంలో పలు కీలక శాఖల్లో సేవలందించారు. ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసే బిల్లు రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. అయోధ్యలో రామమందిరం కేసుకు సంబంధించిన పత్రాల వ్యవహారాన్ని.. హోం శాఖలో అదనపు కార్యదర్శిగా ఆయనే పర్యవేక్షించారు. 'శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, కేంద్ర సహకార శాఖల కార్యదర్శిగా పనిచేశారు. గత ఏడాది జనవరిలో ఆయన రిటైర్ అయ్యారు. సీఈసీ పదవిలో 2029 జనవరి 26 దాకా ఆయన కొనసాగనున్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి.. 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అప్పాయింట్‌మెంట్ కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్)చట్టం-2023' పేరుతో రూపొందించిన కొత్త చట్టం ప్రకారం సీఈసీ నియామకం ఇదే మొదటి సారి కావడం విశేషం.

కాంగ్రెస్ అభ్యంతరం..

పాత విధానం ప్రకారం.. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి కూడా సభ్యుడిగా ఉండేవారు. అయితే, 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టంలో.. భారత ప్రధాన న్యాయమూర్తికి బదులు కేంద్ర మంత్రివర్గం నామినేట్ చేసే మంత్రికి స్థానం కల్పించింది (దాని ప్రకారమే ఇప్పుడు కేంద్ర మంత్రివర్గం తరఫున కేంద్రమంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి కమిటీలో సభ్యుడిగా హాజరయ్యారు). దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై తీర్పు వచ్చే దాకా కొత్త చట్టం ప్రకారం నూతన సీఈసీ నియామకాన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. ఉన్నతస్థాయి కమిటీ సమావేశానికి హాజరైన రాహుల్‌గాంధీ సైతం.. అసలు ఈ భేటీనే జరిపి ఉండకూడదంటూ తన అసమ్మతిని లిఖిత పూర్వకంగా తెలిపారు. ఆ పిటిషన్లపై సుప్రీంలో బుధవారమే విచారణ జరగనున్న విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

రాజీవ్‌కుమార్‌కు వీడ్కోలు

ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారంతో ముగియనున్న నేపథ్యంలో.. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఆయనకు వీడ్కోలు పలికింది. రాజీవ్ కుమార్ 2020 సెప్టెంబరు 1 న కేంద్ర ఎన్నికల సంఘంలో ఎన్నికల కమిషనర్‌గా చేరారు. 2022 మే 15న దేశ 25వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కమిషన్‌లో 4.5 సంవత్సరాల పాటు సాగిన ఆయన పదవీ కాలంలో అనేక సంస్కరణలు జరిగాయి. కాగా.. ఎన్నికల ఫలితాలను అంగీకరించలేని పార్టీలు.. ఎన్నికల కమిషన్‌ను బలిపశువును చేస్తున్నాయని వీడ్కోలు కార్యక్రమంలో రాజీవ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా జరిగే ఎన్నికల ప్రక్రియలో ప్రతిదశలోనూ పాల్గొనే అభ్యర్థులు, పార్టీలు.. ఏ దశలోనూ అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా, అప్పీళ్లు దాఖలు చేయకుండా.. ఎన్నికలు ముగిశాక మాత్రం ప్రజల్లో ఆ ప్రక్రియపై అనుమానాలు రేకెత్తించే ప్రయత్నాలు చేయడం అవాంఛనీయం అని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.

లోకం తీరు

ఐఏఎస్‌లు ప్రజల వద్దకు వెళ్లితేనే సమస్యలు తెలుస్తాయి: బండి



ఢిల్లీలో భూకంపం

ఆ సమయంలో 'బూమ్' అని భారీ శబ్దం

5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: దేశ రాజధాని ఢిల్లీ, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో సోమవారం ఉదయం 5.36గంటలకు భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.0గా నమోదైంది. ఢిల్లీకి ఆనుకొని ఉన్న ధౌలా కౌన్ ప్రాంతంలోని జీల్ పార్కు కేంద్రంగా 5 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉన్న కారణంగా బలమైన భూ ప్రకంపనలు సంభవించాయి. దీంతో, ఢిల్లీ, నోయిడా, గాజియాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఢిల్లీలో ఈ స్థాయిలో బలమైన ప్రకంపనలు ఇంతకుముందు రాలేదని స్థానికులు తెలిపారు. భూకంపం సంభవించినప్పుడు బాంబు పేలినట్లు 'బూమ్' అని భారీ శబ్దం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. భూకంపం సంభవించిన వెంటనే ప్రధాని మోదీ స్పందించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారుల సూచనలను పాటించాలని, మరిన్ని భూ ప్రకంపనలు రావొచ్చని హెచ్చరించారు. జీల్ పార్కు ప్రాంతంలో రెండు మూడేళ్లకొకసారి స్వల్ప భూకంపాలు సంభవిస్తున్నాయి. మరోవైపు, ఢిల్లీలో సోమవారం సంభవించిన భూకంపం భూ అంతర్భాగంలోని పలకల కదలికల వల్ల వచ్చింది కాదని శాస్త్రవేత్తలు తెలిపారు. అక్కడి నేల స్వభావం వల్లే భూమి కంపించిందన్నారు. భూకంపం సంభవించినప్పుడు భారీ శబ్దానికి భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉండటమే కారణమని వివరించారు. భూకంప తరంగాలు అత్యంత వేగంగా వచ్చి భూ ఉపరితలాన్ని చేరినప్పుడు అవి గాలిలో కలిసి ధ్వని తరంగాలుగా మారి భారీ శబ్దం వస్తుందని తెలిపారు.

తొక్కిసలాటల నివారణకు.. 60 రైల్వేస్టేషన్లలో హోల్డింగ్ జోన్లు

- తమ రైలు వచ్చే దాకా ప్రయాణికులు అక్కడే
- ఢిల్లీ దుర్ఘటన నేపథ్యంలో చర్యలు: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది దుర్మరణం పాలైన నేపథ్యంలో.. మళ్లీ ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ దిశగా మూడు ముఖ్యమైన చర్యలు తీసుకోనున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోమవారం వెల్లడించారు. అవి..దేశంలో అత్యంత రద్దీగా ఉండే 60 ప్రధాన రైల్వే స్టేషన్లలో హోల్డింగ్ జోన్లను ఏర్పాటు చేయడం. రైల్వే స్టేషన్లలోని మెట్లమార్గాలను ఖాళీగా ఉంచాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన పెంచడం. రద్దీ నిర్వహణకు సంబంధించి స్పష్టమైన నిబంధనావళి రూపొందించి రైల్వే స్టేషన్ సిబ్బందికి పెద్ద ఎత్తున శిక్షణ ఇవ్వడం...ఈ మూడింటిలో ప్రధానమైనది హోల్డింగ్ జోన్ల ఏర్పాటు. అంటే.. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు తమ రైలు వచ్చేదాకా కూర్చోవడానికి చేసే ఏర్పాటు. సంబంధిత రైలు వచ్చాక ప్రయాణికులను ప్లాట్‌ఫామ్‌పైకి అనుమతిస్తారన్న మాట. దీనివల్ల ప్లాట్‌ఫామ్‌పై రద్దీ పెరిగిపోవడం, తొక్కిసలాటలు జరగడం వంటి సమస్యలు ఉండవు. ఇకపై న్యూఢిల్లీ, ఆనంద్‌విహార్, లఖ్‌నవూ, వారాణసీ, పట్నా, ముంబై, సూరత్, బెంగళూరు తదితర 60 ప్రధాన రైల్వే స్టేషన్లలో దీన్ని అమల్లోకి తేవాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఛాత్ పూజ సమయంలో ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో దీన్ని అమలు చేయగా అది విజయవంతమైందని.. మహాకుంభమేళా సందర్భంగా ప్రయాగరాజ్‌లో కూడా ఇలా హోల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేయడం సత్ఫలితాలను ఇచ్చిందని అశ్వినీవైష్ణవ్ తెలిపారు. అలాగే.. రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు మెట్లపై కూర్చోకుండా ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను రైల్వే శాఖ చేపట్టనుంది. ఇందు కోసం ఆర్నెల్లపాటు ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహించనుంది. ప్రయాణికులతోపాటు.. ప్లాట్‌ఫామ్‌పై ఉండే స్టేషన్ సిబ్బంది, దుకాణదారులకు కూడా అవగాహన కల్పించనుంది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో రద్దీ నిర్వహణకు సంబంధించి.. ఇప్పటికే ఉన్న నిబంధనలన్నింటినీ ఒక దగ్గరకు చేర్చి, సమగ్రమైన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని అభివృద్ధి చేయనున్నట్టు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

ఆ దరఖాస్తులు ఇక స్వీకరించం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం 1991లో ఒక ప్రత్యేక చట్టం తీసుకువచ్చింది. ఆగస్టు 15, 1947 నాటికి ఉనికిలో ఉన్న ప్రార్థనా మందిరాల మతపరమైన స్థితిని మార్చడానికి వీల్లేదని ఈ చట్టం స్పష్టం చేసింది. ఈ చట్టానికి ఉన్న చట్టబద్ధతను ప్రశ్నిస్తూ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ మొత్తంగా తేనెతుట్టెను కదిలించింది. దేశంలోని పది మసీదులపై హక్కును ప్రకటిస్తూ హిందూ సంస్థలు పలు కోర్టుల్లో 18 పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే, వీటిపై విచారణను గత ఏడాది సుప్రీంకోర్టు నిలిపివేసింది. వాటిలో షాహీ ఈద్గా - కృష్ణ జన్మభూమి, కాశీ విశ్వనాథ్- జ్ఞానవాపీ మసీదు, సంభాల్ మసీదు వివాదం ఇందులో కొన్ని. ఈ వివాదాల నివృత్తికి 1991నాటి చట్టాన్ని ప్రామాణికంగా చేసుకోవాలని పలు ప్రతిపక్ష పార్టీలు కోరుతుండగా, హిందూ సంస్థలు, మితవాద సంఘాలు ఈ చట్టాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ చట్టాన్ని గట్టిగా అమలు చేయాలంటూ ఏఐఎమ్ఐఎమ్ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. శాంతియుతంగా జీవించేందుకు ప్రతి పౌరుడికీ అవకాశం కల్పిస్తూ 1991 చట్టాన్ని మరోసారి ధ్రువీకరించాలంటూ సమాజ్‌వాదీ పార్టీ ఖైరానా ఎంపీ ఇక్రా చౌదురీ అభ్యర్థించారు. గతంలో తాను వేసిన పిటిషన్‌ను స్వీకరించినట్టు నోటీసు తనకు అందలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. కొత్త అంశాలను తాజాగా జోడించి రూపొందించిన మధ్యవర్తిత్వ (రిట్) పిటిషన్‌ను విచారణకు స్వీకరించాలని ఆయన కోరారు. దీనిపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందించారు. ఈ తరహా పిటిషన్లను గతంలో అనుమతించామని, ఇక ఇటువంటి వాటిని స్వీకరించబోమని స్పష్టం చేశారు. నోటీసులు పంపని పిటిషన్లను తిరస్కరిస్తున్నామన్న ఆయన.. కొత్త అంశాలతో దాఖలు చేసిన రిట్ పిటిషన్లను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ఇక్రా చౌధురి పిటిషన్‌ను విచారణకు స్వీకరించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. ఈ వివాదంపై కేంద్రం స్పందన తెలియాల్సి ఉన్నదన్నారు. ఈ వివరాలు నమోదుచేసుకున్న బెంచ్ తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఆ రోజున త్రిసభ్య బెంచ్ అన్ని పిటిషన్లపై విచారణ చేపడుతుందని వెల్లడించింది.



యూపీ అధికారులకు నోటీసులు

మసీదును కూల్చివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించినందుకు కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తరప్రదేశ్ అధికారులను ఆదేశించింది. కుశీనగర్‌లోని మసీదును కూల్చివేయకూడదంటూ గత ఏడాది నవంబరు 13న ఇచ్చిన ఆదేశాలను అధికారులు కావాలని ఉల్లంఘించారని పేర్కొంటూ సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలయింది. దీనిని పరిశీలించిన ధర్మాసనం..కూల్చివేత పనులను నిలిపివేయాలని ఆదేశించింది.

జడ్జిల నియామకం న్యాయబద్ధంగా లేదు

మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రు ఆరోపణ

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం న్యాయబద్ధంగా లేదని మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు ఆరోపించారు. చెన్నైలో సోమవారం రిటైర్డ్ జడ్జిలు చంద్రు, అరిపరంధామన్ సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ శాసనం ప్రకారం... సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో సామాజిక న్యాయాన్ని పాటించడం లేదని అన్నారు. దేశంలోనే అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో 34 శాతం మంది బ్రాహ్మణ వర్గానికి చెందిన వారే ఉన్నారని చెప్పారు. దేశ జనాభాలో 10% మాత్రమే ఉన్న ఓ వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, న్యాయమూర్తుల పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు సరైన న్యాయం జరగడం లేదన్నారు. 75 శాతం న్యాయమూర్తుల పోస్టుల్లో అగ్రవర్ణాలకే అవకాశం ఇవ్వడం విచారకరమన్నారు. కేరళ రాష్ట్రంలో 74 శాతం దిగువ కోర్టులలో మహిళలే ఉన్నారని, అయితే వారిలో ఒకరు కూడా సుప్రీంకోర్టుకు వెళ్లలేదని జస్టిస్ చంద్రు వ్యాఖ్యానించారు.

ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకుంటే..

డబుల్ టోల్ బాదుడు



- బ్లాక్ లిస్టులో ఉన్నా జరిమానా
- అమల్లోకి కొత్త నిబంధనలు: ఎన్‌పీసీఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఫాస్టాగ్ వినియోగదారులు ఇకపై బ్యాలెన్స్ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. టోల్ చార్జీకి తగిన బ్యాలెన్స్ లేకున్నా.. బ్లాక్‌లిస్టులో ఉన్న కార్డును వాడినా.. జరిమానాల బాదుడు తప్పదు. ఈ మేరకు భారత జాతీయ చెల్లింపుల సంస్థ(ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలను ప్రకటించింది. ఈ నిబంధనలు సోమవారం నుంచే అమల్లోకి వచ్చాయి. టోల్‌బూత్‌ల వద్ద వాహనాల రద్దీకి బ్లాక్‌లిస్ట్ ఫాస్టాగ్‌లు, లోబ్యాలెన్స్ వంటి అంశాలు కారణాలుగా ఉంటున్న నేపథ్యంలో.. తాజా నిబంధనలను అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఎన్‌పీసీఐ వెల్లడించింది. ఫాస్టాగ్ ఖాతాలో కనీస బ్యాలెన్స్ (రూ.100) లేకపోతే.. దాన్ని రీచార్జ్ చేయకుంటే బ్లాక్‌లిస్టులోకి వెళ్తుంది. ఫాస్టాగ్ అందించే బ్యాంకుకు సమయానికి కేవైసీ అందించకున్నా.. వాహన రిజిస్ట్రేషన్ వివరాల్లో తేడాలున్నా బ్లాక్‌లిస్ట్ లేదా హాట్‌లిస్టులో పెడతారు. ఒకవేళ బ్లాక్‌లిస్టులో ఫాస్టాగ్ ఉంటే.. టోల్ బూత్‌ను చేరుకోవడానికి 60 నిమిషాల ముందే రీచార్జ్ చేసుకుని, కేవైసీని సమర్పించి.. అన్‌బ్లాక్ చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలా కాకుండా.. బ్లాక్‌లిస్టులో ఉండగానే టోల్ దాటితే.. 'ఎర్రర్ కోడ్ 176'గా పరిగణిస్తారు. దీంతో.. టోల్ చార్జీకి సమానంగా జరిమానా పడుతుంది. అంటే.. టోల్ చార్జీకి రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఎర్రర్ కోడ్ 176 వచ్చినప్పుడు.. 10 నిమిషాల్లోపు రీచార్జ్/అన్‌బ్లాక్ చేసుకుంటే.. జరిమానా మొత్తం వెనక్కి వస్తుంది. ఈ నేపథ్యంలో సేవింగ్ అకౌంట్స్ ఉన్న బ్యాంకు నుంచే ఫాస్టాగ్ తీసుకుంటే.. యాప్‌లో 'ఆటో రీచార్జ్' విధానాన్ని అనుసరించడం మంచిది. అంటే.. బ్యాలెన్స్ మొత్తం రూ.200 లేదా రూ.300 కంటే తక్కువ ఉంటే.. నిర్ణీత మొత్తాన్ని ఖాతా నుంచి ఆటో రీచార్జ్ అయ్యేలా సెట్టింగ్స్‌లో ఆప్షన్లను ఎంచుకోవచ్చు.

ఉక్రెయిన్‌పై నేడు రష్యా-అమెరికా శాంతి చర్చలు

- రియాద్‌లో ఇరు దేశ బృందాల చర్చలు
- అబుధాబీలో జెలెన్‌స్కీ పర్యటన
- తాము లేకుండా చేసే ఒప్పందాల్ని ఒప్పుకోబోమన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు

అబుధాబీ, ఫిబ్రవరి17: ఉక్రెయిన్‌పై అమెరికా-రష్యా మధ్య సౌదీ అరేబియాలో మంగళవారం శాంతి చర్చలు జరగనున్నాయి. మూడేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు రష్యా-అమెరికా మంత్రులు, అధికారులు రియాద్‌లో చర్చలు జరుపుతారు. ఇప్పటికే అమెరికా మంత్రులు, అధికారుల బృందం సౌదీ అరేబియాకు చేరుకుంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో, పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్ట్ తదితరులు రియాద్‌కు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య చర్చల తేదీ, సమయం మంగళవారం చర్చల్లో ఖరారయ్యే అవకాశం ఉంది. మరోవైపు, అమెరికా-రష్యా మధ్య రియాద్‌లో జరగబోయే చర్చల గురించి తనకు తెలియదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. తాము లేకుండా తమపై చర్చలు జరిపి చేసే ఒప్పందాల్ని ఒప్పుకోబోమని తేల్చి చెప్పారు. ప్రస్తుతం ఆయన యూఏఈలో పర్యటిస్తున్నారు. ఓ సహాయ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను అబుధాబీకి వచ్చినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. అయితే, యుద్ధాన్ని ముగించే ఏ చర్చల్లోనైనా జెలెన్‌స్కీ భాగస్వామి అవుతారని ట్రంప్ చెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో చర్చల కోసం జెలెన్‌స్కీ అబూదాబీ నుంచి రియాద్ వెళ్లే అవకాశముందని భావిస్తున్నారు.

పారిస్ వేదికగా ఈయూ నేతల సమావేశం

ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై అమెరికా అవలంబిస్తున్న విధానాలపై చర్చించేందుకు పారిస్ వేదికగా ఈయూ దేశాధినేతలు సమావేశమవుతున్నారు. సమావేశానికి ముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్... ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అయితే చర్చల వివరాలు మాత్రం బయటకు రాలేదు. ఈ సందర్భంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ.. యూరప్ భద్రత కోసం బ్రిటన్ బలగాలను ఉక్రెయిన్‌కు పంపేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. ఉక్రెయిన్‌కు సహాయం చేయడం తమ బాధ్యతన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం!

» ఎ.కొండూరు మండలంలో 3 వేల కోళ్ల మృత్యువాత

» పశ్చిమగోదావరిలో కొనసాగుతున్న కోళ్ల ఖననం


పశ్చిమ గోదావరి జిల్లా పెదతాడేపల్లిలో ఖననం చేసేందుకు కోళ్లను తరలిస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

ఎ.కొండూరు, తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో బర్డ్‌ఫ్లూ లక్షణాలతో 3 వేల కోళ్లు మృత్యువాతపడటం కలకలం రేపింది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కృష్ణారావుపాలెం గ్రామ శివారు దీప్లానగర్ తండాలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో 3 వేల కోళ్లు మృతిచెందాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు సోమవారం ఆ పౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలించారు. చనిపోయిన కోళ్లను పాతిపెట్టించారు. బతికున్న కోళ్ల నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం భోపాల్‌కు పంపించారు. కాగా, బర్డ్‌ఫ్లూ వెలుగుచూసిన పశ్చిమ గోదావరి జిల్లాలో అధికారులు చర్యలు చేపట్టారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామంలోని ఒక పౌల్ట్రీ ఫామ్‌లో 21 వేల కోళ్లను సోమవారం ఖననం చేయించారు. పౌల్ట్రీ సమీపంలో పెద్ద గొయ్యి తీయించి అనుమానిత కోళ్లను అందులో వేసి పాతిపెట్టారు. గ్రామంలో సోడియం హైపోక్లోరైడ్ పిచికారి చేయించారు.

చచ్చిన కోళ్లు, చికెన్ వ్యర్థాలే చేపల మేత..!

» పాల్వంచ చెరువుల్లో వినియోగం

» పాకాల ఏరులో కోళ్ల కళేబరాలు

» బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన

కొత్తగూడెం, బయ్యారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రాంతంలోని చికెన్ సెంటర్ల నుంచి కోళ్ల వ్యర్థాలతో పాటు చనిపోయిన కోళ్లను ఆ ప్రాంతంలోని రాజాపురం, రెడ్డిగూడెం చెరువుల్లో చేపలకు మేతగా వినియోగిస్తున్నారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి చనిపోతున్న నేపథ్యంలో చేపల మేత కోసం కోళ్ల వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను చేపల చెరువుల్లో పడేస్తుండడం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏపీకి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లు పాల్వంచ ప్రాంతంలోని రాజాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లోని చెరువులను లీజుకు తీసుకుని చేపల పెంపకాన్ని చేపట్టారు. ఆ చేపల మేత కోసం రోజువారీగా పాల్వంచలోని చికెన్ సెంటర్ల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను ట్రాలీలపై తీసుకొచ్చి చెరువుల్లో పడేస్తున్నారు. దీనిపై ఇటీవల పాల్వంచలోని కొందరు మత్స్యశాఖ ఏడీ ఎండి ఇంతియాజ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఈ నెల 15న రాజాపురంలోని చెరువు వద్దకు వెళ్లి తనిఖీ చేయగా చనిపోయిన కోళ్లు, కోళ్ల వ్యర్థాలు కనిపించాయి. దీంతో రాజాపురంలోని రెండు చేపల చెరువుల్లో చేపలు పట్టడాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. పాల్వంచ ప్రాంతం నుంచి ఏపీకి కూడా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు సమాచారం ఉండడంతో వాటిపైనా చర్యలు తీసుకుంటామని ఏడీ హెచ్చరించారు. కాగా మహబూబాబాద్-ఇల్లందు ప్రధాన రహదారి మార్గం మధ్యలోని మహబూబాబాద్ జిల్లా బయ్యారం శివారు పాకాల ఏరులో సోమవారం బాయిలర్ కోళ్ల కళేబరాలు కనిపించడం కలకలం రేపింది. ఏటిలో మృతి చెందిన కోళ్లను చూసిన పలువురు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. ఈ కోళ్లు బర్డ్‌ఫ్లూతో చనిపోవడంతోనే వాటిని ఏటిలో పడేసి ఉంటారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బర్డ్ ఫ్లూ వైరస్ భయంతో పాకాల ఏటి నీటిని వ్యవసాయంలో ఉపయోగించడానికి పలువురు రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్

» ఈ నెల 20 నుంచి మార్చి 31 వరకు

» అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసిన కేంద్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రోజురోజుకు అసంక్రమిత వ్యాధులు(ఎన్‌సీడీ) పెరుగుతోన్న నేపథ్యంలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ఎన్‌సీడీ వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్రం తాజాగా లేఖలు రాసింది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల(బస్తీ దవాఖానాలు, సబ్‌సెంటర్లు)తో పాటు ఇతర ప్రభుత్వ ఆస్పత్రులన్నిటా ఈ నెల 20 నుంచి మార్చి 31 వరకు ఎన్‌సీడీ వైద్య పరీక్షలు చేపట్టాలని అందులో సూచించింది. 30 ఏళ్ల పైబడిన వారందరికీ ఈ పరీక్షలు చేయాలని కోరింది. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఇప్పటి దాకా ఆశా, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ తిరిగి ఎన్‌సీడీ పరీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈసారి మాత్రం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలతో పాటు అన్ని సర్కారీ దవాఖానాల్లోనూ ఈ ప్రత్యేక ఎన్‌సీడీ పరీక్షల డ్రైవ్ చేపట్టాలని కేంద్రం ఆదేశించింది. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహంతో పాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ల తనిఖీలు చేయాలని సూచించింది. జాతీయ అసంక్రమిత వ్యాధుల నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా దీన్ని చేపట్టినట్లు ఆ లేఖలో పేర్కొంది. అన్ని సర్కారీ దవాఖానాల్లో ఎన్‌సీడీ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఎప్పటికప్పుడు తనిఖీల వివరాలను ఎన్‌సీడీ పోర్టల్‌లో రోజువారీగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. రాష్ట్రస్థాయి ఎన్‌సీడీ నోడల్ అధికారులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎన్‌సీడీ కన్సల్టెంట్లతో పాటు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యే జిల్లా నోడల్ అధికారులంతా ఎప్పటికప్పుడు ఎన్‌సీడీ పరీక్షల ప్రగతిపై సమీక్ష నిర్వహించాలని కోరింది. ఈ ప్రత్యేక డ్రైవ్ ముగిసిన తర్వాత ఏప్రిల్ నెల నుంచి వారంలో రెండు రోజులపాటు (స్థిర రోజులు) క్షేత్రస్థాయికి వెళ్లి ఎన్‌సీడీ పరీక్షలు కొనసాగించాలని సూచించింది. తెలంగాణలో 30 ఏళ్లకు పైబడిన వారు 1,40,93,300 మంది ఉండగా.. వారిలో 96,11,587 మందికి (48శాతం) బీపీ పరీక్షలు, 1,00,63,007 మందికి (50 శాతం) మధుమేహ పరీక్షలు ఇప్పటి వరకు నిర్వహించినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఆ లేఖలో పేర్కొంది.

తెలంగాణకు బీసీ ముఖ్యమంత్రి ఖాయం

అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుంది.. ఈ ఐదేళ్లూ రేవంత్ రెడ్డే సీఎంగా ఉంటారు

» వచ్చే ఎన్నికలు బీసీల చుట్టూనే తిరుగుతాయి

» ఓబీసీ సెల్ కార్యవర్గ భేటీలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి భవిష్యత్తులో ఒక బీసీ వ్యక్తి.. బరాబర్ ముఖ్యమంత్రి అవుతాడని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. అయితే రాష్ట్రానికి బీసీని సీఎం చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్, బీజేపీల నుంచి బీసీ వ్యక్తి సీఎం అయ్యే అవకాశం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో చక్కటి పాలన, కార్యక్రమాలను అందిస్తున్న రేవంత్‌రెడ్డి.. ఈ ఐదేళ్లూ సీఎంగా కొనసాగుతారని స్పష్టం చేశారు. అలాగే వచ్చే క్యాబినెట్ విస్తరణలో బీసీలకు తప్పకుండా ప్రాతినిధ్యం ఉంటుందని చెప్పారు. వచ్చే ఎన్నికలు బీసీల చుట్టూనే తిరగనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని టీపీసీసీ ఓబీసీ సెల్ కార్యవర్గ సభ్యులకు పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో సోమవారం టీపీసీసీ ఓబీసీ సెల్ విస్తృత కార్యవర్గ సమావేశం సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ అజయ్‌సింగ్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఓబీసీ సెల్ కార్యవర్గ సమావేశంలోనూ, అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోనూ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఈ మేరకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కుల వృత్తులు క్రమంగా అంతరిస్తున్న పరిస్థితుల్లో బీసీలు ఎదగాలంటే పిల్లలను బాగా చదివించాలన్నారు. బీసీల పట్ల ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు ప్రత్యేక శ్రద్ధ ఉందని కితాబునిచ్చారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలంటూ ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కులగణన నిర్వహించినందుకు రాహుల్, రేవంత్‌రెడ్డిలకు బీసీల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకొంటున్నానన్నారు. ఎవరెంత జనాభా ఉంటే అంత ఫలాలు అందాలని పేర్కొన్నారు. మన నుంచి ఒకరికి అవకాశం ఇస్తే గెలిపించుకుందామన్న సోయి బీసీలకు ఉండట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీల్లో ఐక్యత మాయావతిని, బీసీల్లో ఐక్యత లాలూప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్‌లను సీఎంలను చేసిందని గుర్తు చేశారు. తెలంగాణలోనూ బీసీల్లో ఐక్యత చాలా అవసరమన్నారు. మన అదృష్టం బాగుండి.. రాహుల్ గాంధీ బీసీ నినాదాన్ని తీసుకున్నారని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును పెట్టనున్నామని మహేష్‌గౌడ్ అన్నారు. దాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ ప్రధాని మోదీని అడిగే ధైర్యం బండి సంజయ్‌కు ఉందా అని ప్రశ్నించారు. అలాగే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనే సత్తా ఆయనకు ఉందా అని నిలదీశారు. రాష్ట్రంలోనూ తమిళనాడు తరహా రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ సహా అన్ని పార్టీల నేతలనూ కలుస్తామని ఆయన చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపు తప్పనిసరి

అధికారంలో ఉన్నాం కాబట్టి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం తప్పనిసరి అని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వాయిదాలకు ప్రతి నెలా రూ. ఆరున్నర వేల కోట్లు చెల్లించాల్సి వస్తుందని, జీతభత్యాలు పోను నెలకు రూ. 5 వేల కోట్లతో సర్దుకోవాల్సి వస్తుందని చెప్పారు. అయినా ఈ ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. ఈ వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి కార్యకర్తా రోజుకు పది మందికి ఈ విషయం చేరవేయాలన్నారు. జిల్లా అధ్యక్షులుగానూ, రాష్ట్ర కార్యవర్గంలో ఉన్నామనుకుంటే స్థానిక ఎన్నికల్లో టికెట్లు రావని, ప్రజల్లో ఉండి గెలిచే సత్తా ఉన్నవాళ్లకే టికెట్లు వస్తాయని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వడే కాకుండా.. అన్ని హంగులతో గెలిపించుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి మాటగా చెబుతున్నానన్నారు.

కులగణన.. ఓ గేమ్ ఛేంజర్: అజయ్‌సింగ్

తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన.. దేశానికే మార్గదర్శిని అయిందని, ఇది గేమ్ ఛేంజర్ కాబోతోందని అజయ్‌సింగ్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో కులగణన నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుకొంటున్నామన్నారు. మహారాష్ట్ర, హరియాణాల్లో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు మధ్యలో ఓట్ల సంఖ్య భారీగా పెరిగిందని, ఈ నేపథ్యంలో బ్యాన్ ఈవీఎం అనే నినాదాన్ని కాంగ్రెస్ ఎత్తుకుందని చెప్పారు. బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరగాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌తో 50 శాతానికి రిజర్వేషన్లు మించకూడదన్న నిబంధనను కేంద్రం ఇప్పటికే మీరిందని అన్నారు. అన్ని కులాలు, మతాలను గౌరవించే కాంగ్రెస్‌పైన ముస్లిం పార్టీ అని ముద్ర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెహ్రూ నుంచి రాహుల్ వరకూ అందరూ హిందువులేనన్నారు.

అలసత్వం ప్రదర్శించే వాళ్లకు సంస్థలో చోటులేదు

» సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సంస్థ సుస్థిర భవిష్యత్తే ప్రతీ ఒక్క అధికారి, ఉద్యోగి ప్రథమ కర్తవ్యం కావాలని, ఇందుకోసం అందరూ తమ విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. అలసత్వం ప్రదర్శించే వాళ్లకు సంస్థలో చోటు లేదని స్పష్టం చేశారు. సంస్థ భవిష్యత్ కోసం రానున్న పదేళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు నిర్దేశించారు. సోమవారం జీఎం, 39 గనులకు చెందిన అధికారులతో బలరామ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న 43 రోజుల్లో రోజుకు 2.6 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరగాలని ఆదేశించారు. కార్మికుల్లో నైపుణ్యాల పెంపుదల, గనుల్లో మ్యాన్ రైడింగ్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అన్ని అంశాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.




త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరిస్తున్న లోకేశ్ కుటుంబం

మహా కుంభమేళాలో లోకేశ్ దంపతులు

» కుమారుడితో కలసి త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

న్యూఢిల్లీ/అమరావతి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ దంపతులు తమ కుమారుడితో కలిసి పాల్గొన్నారు. సోమవారం ఉదయం ప్రయాగ్‌రాజ్ చేరుకున్న లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్.. త్రివేణి సంగమం షాహి స్నానఘట్టంలో పుణ్యస్నానం ఆచరించారు. గంగాదేవికి పూజలు చేసి హారతులు ఇచ్చారు. లోకేశ్ దంపతులు వారాణసీలో కాశీ విశ్వేశ్వరుడు, కాలభైరవ, అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన కాశీ విశాలాక్షి ఆలయాలను కూడా దర్శించుకున్నారు. కాగా, కుంభమేళాలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, నరసరావుపేట ఎంపీ కృష్ణదేవరాయలు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దంపతులు పుణ్యస్నానాలు ఆచరించారు.

కుంభమేళా ఎఫెక్ట్..!

» శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా పెరిగిన రద్దీ

» ఆదివారం ఒక్క రోజే 94,641 మంది రాకపోకలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కుంభమేళా ప్రభావంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆదివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 94,641 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. 514 స్వదేశీ విమానాల్లో 79,227 మంది, 87 అంతర్జాతీయ విమానాల్లో 15,414 మంది ప్రయాణికులు ప్రయాణించారు. 2023తో పోలిస్తే 2024లో శంషాబాద్ విమానాశ్రయంలో రద్దీ 14.8 శాతం మేర పెరిగిందని విమానాశ్రయ వర్గాలు పేర్కొన్నాయి. దేశంలోని 5 ప్రధాన విమానాశ్రయాలు ఢిల్లీ 7 శాతం, ముంబై 6.3, బెంగళూరు 9.5, చెన్నై 5.3, కోల్‌కతా 9 శాతంతో పోలిస్తే శంషాబాద్ విమానాశ్రయంలో రద్దీ బాగా పెరిగిందని తెలిపాయి.

రాహుల్.. ఇల్లీగల్లీ కన్వర్టెడ్ 'గాంధీ': బూర

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఇల్లీగల్లీ కన్వర్టెడ్ 'గాంధీ' అని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. 'ఇందిర భర్త ఫిరోజ్‌ఖాన్.. వారి కుమారుడు రాజీవ్.. రాజీవ్ తన పేరును రాజీవ్ ఖాన్ అని పెట్టుకోవాలి.. కానీ 'గాంధీ' అనే తోక తగలించుకున్నరు.. రాహుల్ అసలు పేరు రాహుల్ ఖాన్.. కానీ గాంధీ పేరు వినియోగిస్తున్నరు' అని బూర విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ కులంపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల్లోని గాండ్ల కులమే ప్రధాని మోదీ 'తెలి' కులం అని తెలిపారు. తెలంగాణలో రెడ్డి కులస్థులు 'రెడ్డి గాండ్ల' అని బీసీ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని, ఇలాంటి ఘటనలు చూస్తే, మోదీ కులం, నా కులం ఒకటే అని భవిష్యత్తులో రేవంత్ ప్రకటించినా ఆశ్చర్యంలేదన్నారు. మోదీని విమర్శించిన అరవింద్ కేజ్రీవాల్, మణిశంకర్ అయ్యర్ వంటివారికి ఎలాంటి గతి పట్టిందో గుర్తు పెట్టుకోవాలని ఆయన రేవంత్‌కు హితవు పలికారు.

బ్రాహ్మణుడి లక్షణం ఒక్కటైనా రాహుల్‌కు ఉందా?: ఎన్వీ సుభాష్

బ్రాహ్మణుడికి ఉండే లక్షణాల్లో ఒక్కటైనా మీ పార్టీ నేత రాహుల్ గాంధీకి ఉందా? అని కాంగ్రెస్ నేతలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ ప్రశ్నించారు. సోమవారం సుభాష్ మీడియాతో మాట్లాడుతూ రాహుల్ అసలు హిందువే కాదని, ముస్లిం సంతతికి చెందిన వారు ముస్లిం కాకపోతే హిందువు అవుతారా? అని నిలదీశారు.

పెద్దగట్టుకు పోటెత్తిన భక్త జనం

» 6 లక్షల మందికిపైగా వచ్చారని అంచనా

» నైవేద్యం, జీవాల బలితో తల్లులకు మొక్కు

» స్వామివారిని దర్శించుకున్న మంత్రి ఉత్తమ్


పెద్దగట్టు పరిసరాల్లో భక్తులు ఏర్పాటుచేసుకున్న తాత్కాలిక టెంట్లు


పెద్దగట్టుపై భేరీ మోగిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

సూర్యాపేట/హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. సోమవారం జాతర పరిసర ప్రాంతాలన్నీ జనంతో కిటకిటలాడాయి. ఆదివారం అర్ధరాత్రి మాఘ పౌర్ణమి సందర్భంగా సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి దేవరపెట్టెను తీసుకుని పెద్దగట్టుకు చేర్చారు. ఆ ఘట్టంతో జాతర ప్రారంభమైంది. రెండో రోజు సోమవారం సౌడమ్మ, ఆకుమంచమ్మ, యలమంచమ్మ విగ్రహాలను పూజించారు. ప్రత్యేకంగా బోనాలు వండి నైవేద్యం సమర్పించి సౌడమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. పెద్దసంఖ్యలో జీవాలను దేవతలకు బలిచ్చారు. మహిళలు తలపై గంపలు పెట్టుకుని నృత్యాలు చేస్తూ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాదవులు గజ్జెల లాగులు ధరించి, కటారీ విన్యాసాలతో భేరీలు మోగిస్తూ ఓ లింగా అంటూ నామస్మరణ చేశారు. మహిళలు పూనకాలతో ఊగిపోయారు. గుట్టపై నుంచి ఎటు చూసినా ఐదు కి.మీ. వరకు భక్తుల టెంట్లు, గుడారాలే కనిపించాయి. 6 లక్షల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు.

నేడు పెద్దగట్టులో చంద్రపట్నం..

లింగమంతులస్వామి జాతర మూడో రోజైన మంగళవారం ఉదయం చంద్రపట్నం వేస్తారు. యాచకులతో కలిసి రాజులు, పూజారులు గుడి ప్రాంగణంలో చంద్రపట్నం వేసి భైరవునికి పోలు రాస్తారు. ఆదివారం అర్ధరాత్రి కేసారం గ్రామం నుంచి వచ్చిన ఎడ్ల బండ్లేకాక వివిధ వాహనాలు ప్రత్యేక పూజల అనంతరం కేసారానికి తిరుగు ప్రయాణమవుతాయి. భక్తులు చంద్రపట్నం వీక్షించడానికి భారీగా హాజరవుతారు.

సంప్రదాయాల పరిరక్షణకు కృషి: మంత్రి ఉత్తమ్

రాష్ట్రంలో సమ్మక్క-సారక్క జాతర తర్వాత దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు అంతటి ప్రాశస్త్యం ఉందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సంప్రదాయాల రక్షణ కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సోమవారం పెద్దగట్టు జాతరకు వెళ్లిన ఉత్తమ్.. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి భేరీ మోగించి.. లింగమంతుల స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 16వ శతాబ్దంలో మొదలైన ఈ జాతర పురాతన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని ఉత్తమ్ అన్నారు. జాతర ఏర్పాట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.5 కోట్లను కేటాయించారని చెప్పారు. ఈ జాతరకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి 30 లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని వెల్లడించారు. కాగా, లింగమంతులస్వామిని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు.

ఫార్మ్ ప్లాట్లు కొంటే ఇబ్బందులు తప్పవు!

» వాటికి అనుమతి ఉండదు.. నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వరు

» హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 'ఫార్మ్ (వ్యవసాయ) ప్లాట్లకు అధికారిక అనుమతులుండవు. వాటిలో నిర్మాణాలకూ పర్మిషన్లు ఇవ్వరు. ఆ ప్లాట్లు కొనుగోలు చేస్తే తర్వాత ఇబ్బందులు తప్పవన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. తెలంగాణ మునిసిపల్ యాక్ట్-2019, పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం ఫార్మ్ ప్లాట్లు అమ్మవద్దని స్పష్టమైన నిబంధనలున్నాయన్నారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పౌరుల నుంచి రంగనాథ్ ఫిర్యాదులు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం లక్ష్మిగూడ గ్రామ సర్వే న.50లో 1.02 ఎకరాల్లో ఫార్మ్ ప్లాట్ల పేరిట లేఅవుట్ చేసి అమ్మకాలు జరుపుతున్నారంటూ పలువురు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రంగనాథ్ స్పష్టతనిచ్చారు. 2 వేల చదరపు మీటర్లు లేదా 20 గుంటల స్థలం ఉంటేనే వ్యవసాయ భూమిగా పరిగణించాలంటూ గతంలో ప్రభుత్వం స్పష్టతనిచ్చిందన్నారు. అలాగే ఫార్మ్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయవద్దని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకూ ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. జీవో 131 ప్రకారం 2020 ఆగస్టు 31 తర్వాత అక్రమ లేవుట్లలోని ప్లాట్లలో అనుమతులు ఇచ్చేదిలేదని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. 10శాతం పార్కులు, 30 శాతం రహదారుల కోసం స్థలాలు కేటాయించి లే అవుట్‌లు అభివృద్ధి చేయాలన్న నిబంధనలు పాటించకుండా కొందరు ఫార్మ్ ప్లాట్లు, అక్రమ లేఅవుట్‌లు చేసి అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు. నిషేధం ఉన్నా ఫార్మ్ ప్లాట్ల అమ్మకాలపై ఫిర్యాదులు వచ్చినందున ఇక నుంచి ఆ అంశంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో 64 ఫిర్యాదులు వచ్చాయి.

తూంకుంట పురపాలక సంఘం

టెండరు ప్రకటన నం. E1/TMC/Tender Notice No.16/2024-25 తేదీ: 17.02.2025

తూంకుంట పురపాలక సంఘంలో వివిధ ప్రదేశాలు/వార్డులలో అభివృద్ధి పనులు మరియు నిర్వహణా పనులు అనగా రూ.300.00 లక్షల వ్యయం కలిగిన 30 నంబర్ల పనుల కొరకు టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ల దాఖలుకు ఆఖరి తేది 25.02.2025న ఉ.11.00 గం.లకు. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం అనగా http://tender.telangana.gov.in లో చూడవచ్చును లేదా కార్యాలయ వేళల్లో Dy.EE/మునిసిపల్ కమిషనర్ వారిని సంప్రదించవచ్చును.

సం/- కమిషనర్, TMC, పురపాలక కమిషనర్, తూంకుంట పురపాలక సంఘం.

DIPR R.O.NO.10340-PP/CL/ADVT/1/2024-25, Dt: 17.02.2025

GHMC హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నిర్వహణా పనులు

NIT No. 37/EE-7(4B)/CRZ/GHMC/2024-25, పని పేరు: క్ర.సం.1 నుండి 11, అంచనా వ్యయం (రూ. లక్షల్లో): రూ. 310.75 లక్షలు, బిడ్ల స్వీకరణ కొరకు ప్రారంభ తేదీ/ఆఖరి తేదీ మరియు సమయం:- డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 18.02.2025న మ.02.00 గం.లకు. బిడ్ల స్వీకరణకు ఆఖరి తేదీ: 21.02.2025న మ.02.15 గం.లకు. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నెం.: శ్రీ జి. ఏకాంబరం, EE (FAC), సంతోష్ నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, మస్కటి గ్రౌండ్, దారబ్ జంగ్ కాలనీ, సంతోష్‌నగర్, హైదరాబాద్, ఫోన్ నం.7673961166, తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in ను చూడగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

DIPR RO No.10354-PP/CL/ADVT/1/2024-25 తేది: 17.02.2025

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన (పత్రికా ప్రచురణ)

దిగువ వాటి కొరకు TGSPDCL ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లో టెండర్లు విడుదల చేయడానికి ఉద్దేశిస్తోంది: (a) 11KV 800A (Conv) DB AB స్విచ్చెస్, ఇన్సులేటర్స్‌తో, (b) 11KV 400 A (Conv) SB AB స్విచ్చెస్, పోస్ట్‌టైప్ ఇన్సులేటర్స్‌తో, (c) 25 CKM ఆఫ్ 11 KV, 99 Sq.mm కవర్డ్ కండక్టర్ సరఫరా స్థాపన మరియు పని చేయించుట. పైన తెలిపిన ప్రతీ ఐటం తదుపరి వివరాల కోసం దర్శించండి www.tgsouthernpower.org మరియు www.tender.telangana.gov.in

ఫోన్: 040-23431360, 1033, 1035, 1026 సం/- చీఫ్ ఇంజనీర్ (P&MM)

DIPR RO No.10344-PP/CL/ADVT/1/2024-25, తేది: 17.02.2025

తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (TGTS)

తెలంగాణ, పాఠశాల విద్యాశాఖ, 164 పాఠశాలల్లో AR & VR ల్యాబుల స్థాపన కొరకు TGTS వారు బిడ్లు కోరుతున్నారు. టెండరు రిఫరెన్స్ నం. TGTS/HWP1/SE/002/2025 తేది: 18.02.2025. బిడ్ కోరుతున్న తేది: 18.02.2025, ప్రీ బిడ్ సమావేశం తేది: 20.02.2025న ఉ.11.30 గం.లకు TGTS కార్యాలయం వద్ద, 2వ అంతస్తు, HACA భవన్, నాంపల్లి, హైదరాబాద్. బిడ్ ముగింపు తేది: 26.02.2025. సంప్రదించుటకు వివరాలు: జనరల్ మేనేజర్- Srinivasrao.T@gov.in, i/c జనరల్ మేనేజర్-bvrao-tgts-ts@telangana.gov.in. తదుపరి వివరాల కొరకు www.tgts.telangana.gov.in మరియు www.eprocurement.telangana.gov.in ను దర్శించండి. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు : 9963029392, 9963029403

సం/- i/c మేనేజింగ్ డైరెక్టర్

DIPR R.O.No.10334-PP/CL/ADVT/1/2024-25, Dt: 17.02.2025

ANDHRA PRADESH FOREST DEVELOPMENT CORPORATION LIMITED

Regd.office: 6th Floor, AranyaBhavan, Saifabad, Hyderabad-500004, HO: IIIrd Floor, PVSlandmark(IndustrialPark), AutoNagar,Mangalagiri,Guntur Dt., - 522503,AP., INDIA.
E-Mail : vcmd_apfdc@yahoo.co.in,vcmd.apfdcl@gmail.com

RED SANDERS WOOD SALE (PHASE XXI) 2025- NOTICE

Andhra Pradesh Forest Development Corporation Limited hereby notifies the sale of **905.671 Metric Tonnes of Red Sanders Wood** (RSW) through international competitive bidding by way of e-tender-cum-e-auction on **28th February 2025** in the First cycle. The unsold RSW lots in the first cycle, if any, would be put up for sale on **6th March 2025** and **13th March, 2025** in the Second cycle and third cycle respectively. The Government of Andhra Pradesh has all the necessary statutory approvals for the Sale and export of RSW. The details of the sale conditions and are available in following:**http://www.apfdcl.com, http://www.forests.ap.gov.in, http://www.mstcindia.co.in, http://www.mstcecommerce.com**

Sd/-
Dr. R.P.KHAJURIA, IFS.,
Date: 17.02.2025 PCCF / Vice Chairman and Managing Director

భారత ప్రభుత్వము, కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ
డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్
ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం
తెలంగాణ సర్కిల్, సిటీ సెంట్రల్ లైబ్రరీ ప్రక్కన, చిక్కడపల్లి, హైదరాబాద్ - 500 020
ఇమెయిల్ Id: aopen.ts-dot@gov.in

పత్రికా ప్రకటన

టెలికంశాఖ, తెలంగాణ సర్కిల్ వారి '4వ త్రైమాసిక పింఛను అదాలత్ 2024-25'

టెలికంశాఖ, తెలంగాణ సర్కిల్ వారి 4వ త్రైమాసిక పింఛను అదాలత్ 2024-25 ది. 20-03-2025 (గురువారం) ఉ.11.00 నుండి 13.00 O/o GM, BSNL ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం నందు నిర్వహించబడును. [illegible] ది. 13-03-2025 (గురువారం) లోపు [illegible] ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం, తెలంగాణ సర్కిల్, DoT, చిక్కడపల్లి, హైదరాబాద్ - 500020కు లేదా ఈ-మెయిల్ ద్వారా aopen.ts-dot@gov.in నకు పంపించవలెను. [illegible]

[illegible] '4వ త్రైమాసిక పింఛను అదాలత్ 2024-25' [illegible]

సం/-
అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ (పెన్షన్),
ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం,
తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500020
తేది: 17.02.2025

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అలవాటైన నిర్లక్ష్యం!

మహాకుంభమేళాతో ముడిపడిన మరో దుర్ఘటన ఇది. ప్రయాగ్‌రాజ్‌కు ప్రయాణం కట్టిన సామాన్యులను భద్రంగా గమ్యానికి చేర్చని మన రైల్వేవ్యవస్థ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం ఇది. తొక్కిసలాటలను ఊహిస్తామా, కలగంటామా అన్న అడ్డగోలువాదనలకు ఇక్కడ తావులేదు. లక్షలాదిమంది రైళ్ళలో ప్రయాగ్‌రాజ్‌కు పయనమవుతున్నందున ప్రమాదాలకు ఆస్కారం లేని రీతిలో అన్ని ఏర్పాట్లు చేయాలి, అడుగడుగునా వారిని కనిపెట్టుకోవాలి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 18మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరమైంది. ఆప్తులను కోల్పోయిన లోటు ఎన్నటికీ తీర్చలేనిది. తండ్రి కళ్ళెదుట కుమార్తె శిరస్సు ఛిద్రమైన ఘోరం సహా తొక్కిసలాట తీవ్రత ఏ స్థాయిలో, ఎంత దారుణంగా ఉన్నదో తెలియచెబుతూ పలు కథనాలు వెలుగుచూశాయి. ఎముకలు విరిగి, అవయవాలు దెబ్బతినిపోయిన క్షతగాత్రుల వేదన మరో రకమైనది. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ సమీప భవిష్యత్తులో ఎంత అద్భుతంగా ఉండబోతున్నదో చూడండి అంటూ ఐదేళ్ళక్రితం అప్పటి రైల్వేమంత్రి పీయూష్ గోయల్ విడుదల చేసిన కొన్ని చిత్రాలు ఇప్పుడు తిరిగి సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. వేలాదికోట్లు ఖర్చుచేసి రైల్వేస్టేషన్లకు మెరుగులుదిద్దుతున్న మాటలు ఒకపక్క వినబడుతూండగానే, మరోపక్క ఇటువంటి దారుణాలు సంభవించడం ఆశ్చర్యం.

జరిగిన ఘోరానికి పద్ధతీపాడూ లేని ఆ సాధారణజనమే కారణం తప్ప తమ నిర్లక్ష్యం కాదని పాలకులు, అధికారులు పరోక్షంగా వాదిస్తున్నారు. ఆఖరునిముషంలో మరో ప్లాట్‌ఫామ్ మీదకు రైలును తెచ్చి, మీరు ఎక్కాల్సిన రైలు మీరు వేచివున్నదగ్గరకు కాక, వేరే చోటకు వస్తున్నదని ప్రకటించి రైల్వే అధికారులే తొక్కిసలాటకు కారకులైన సందర్భాలు గతంలో లేకపోలేదు. ఆ తరువాత అటువంటి తప్పటడుగులు వేయకూడదని నిర్ణయించుకున్నప్పటికీ, ఇప్పుడు జరిగింది కూడా దాదాపు అటువంటిదే. అనేక రైళ్ళు ప్రయాగ్‌రాజ్‌కే ప్రయాణం కడుతూ, వేలాదిమంది యాత్రికులు వాటికోసం ఎదురుచూస్తున్నప్పుడు 'ప్రయాగ్‌రాజ్' అన్న ఒక్కమాట సదరు సామాన్యయాత్రికుల్లో గందరగోళాన్ని సృష్టించడం సర్వసాధారణం. మామూలురోజుల్లోనే ఎక్కాల్సిన రైలు ఎక్కి కూర్చునేంతవరకూ ప్రయాణికుడి మనసులో ఆందోళన నెలకొనే ఉంటుంది. ఈ కుంభమేళాకాలంలో పేరు చివర్లో చిన్నచిన్న మార్పులతో అన్ని రైళ్ళకూ గమ్యస్థానం పేరు తగిలించి, ఒకే సమయంలో వేర్వేరు ప్లాట్‌ఫామ్‌ల మీదకు పలు రైళ్ళను తెస్తే యాత్రికులు గాభరాపడటం సహజం. పైగా, చాలా రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్న స్థితిలో ఎదురుచూపుల్లోనే వారి వివేకం, సహనం చచ్చిపోతాయి. స్టేషన్‌లో ఎస్కలేటర్లు పనిచేయడం లేదని, యాత్రికులు దగ్గరతోవలో పోయేందుకు ప్రయత్నించి ప్రాణాలమీదకు తెచ్చుకున్నారని పలు విశ్లేషణలు వింటున్నాం. వాటిని అటుంచితే, చివరి రెండు గంటల్లో యాత్రికుల సంఖ్య విపరీతంగా పెరిగిన స్థితిలో వారిని నియంత్రించడానికి నిర్దిష్టమైన ప్రయత్నాలు జరిగిన దాఖలాలు కూడా లేవు. పావుగంటలో ఇన్ని ప్రాణాలు పోయిన తరువాత, అతివేగంగా వరుసరైళ్ళలో యాత్రికులను తరలించగలిగిన రైల్వేశాఖ ముందుచూపుతో ఎందుకు వ్యవహరించలేకపోయిందో తెలియదు. ఈ ఘటన తరువాత అమలులోకి తెచ్చిన పలురకాల రక్షణలు, జాగ్రత్తలు ముందే ఎందుకు లేవన్నది ప్రశ్న.

ఈ ఘటనకు మూడురోజుల ముందు రైల్వేభవన్‌లో మంత్రి అశ్విన్ వైష్ణవ్ కూర్చొని అన్ని ప్రధాన స్టేషన్లలో రద్దీని సమీక్షిస్తున్న చిత్రాలను మీడియా ప్రసారం చేసింది. పడుతున్న కష్టాన్ని ప్రజలకు చెప్పుకోవడంలో తప్పులేదు కానీ, మీడియా నిర్వహణ కంటే జనసమ్మర్దాన్ని నిర్వహించడం మరీ ముఖ్యం, ఎంతో కష్టం అని ఈ ఘటన గుర్తుచేస్తోంది. రైల్వేమంత్రి రాజీనామాకు విపక్షాలు డిమాండ్ చేయడం సహజం. మూడువందలమంది ప్రాణాలు తీసిన బాలాసోర్ రైలు ప్రమాదం తరువాత కూడా రైల్వేమంత్రి రాజీనామా చేయలేదు. ఆయనకు అటువంటి ఇబ్బంది రాకుండా ఉండేందుకే కాబోలు ఆ ఘోరం జరగగానే చాలా కుట్రసిద్ధాంతాలు తెరమీదకు వచ్చాయి. రైలుదుర్ఘటనలు జరిగినప్పుడు వీలైతే విదేశీశక్తులను, లేకుంటే దేశీకుట్రదారులను తప్పుబట్టి అసలు కారణాలను బయటకు పొక్కనివ్వకపోవడం అనాదిగా జరుగుతున్నదే. ఎన్ఐఏ, సీబీఐ వంటి సంస్థలను రంగంలోకి దించిన ఘోర రైలుప్రమాదాల్లో సైతం నిజం ఇంకా వెలుగుచూడలేదు. ఢిల్లీ తొక్కిసలాట ఘటనను మొదట్లోనే కప్పిపుచ్చడానికి ప్రయత్నించినవారు ఆ నామమాత్రపు దర్యాప్తును సరైనదిశగా సాగనిస్తారా?

మూడు భవనాలు, ముగ్గురు మాజీలు!

హైదరాబాద్‌లోని ప్రగతి భవన్, విశాఖపట్నంలోని రుషికొండ ప్యాలస్, ఢిల్లీలోని శీష్ మహల్.. ఈ మూడు భవనాలూ ఇటీవల దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. ప్రగతి భవన్‌ను తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, రుషికొండ ప్యాలస్‌ను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి వారి హయాంలో నిర్మించగా, శీష్ మహల్ ఆధునీకరణకు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన హయాంలో శ్రీకారం చుట్టారు. అత్యాధునిక వసతులతో కూడిన ఈ మూడు భవనాలు ఎంత ప్రాచుర్యం పొందాయో, అంతకు రెట్టింపు స్థాయిలో విమర్శలపాలయ్యాయి. వీరు ముగ్గురూ మాజీలు కావడంలో వాటి పాత్ర కాదనలేనిది.

హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఐఏఎస్, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారుల నివాస గృహాలను నేలమట్టం చేసి అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యాధునిక సౌకర్యాలతో ప్రగతిభవన్‌ను నిర్మించారు. దానిని ముఖ్యమంత్రి అధికారిక నివాసగృహంగా, సీఎం క్యాంప్ ఆఫీసుగా ప్రకటించి అక్కడినుంచే పాలనా వ్యవహారాలు చూసుకున్నారు. ఆ కాలంలో కేసీఆర్ రాష్ట్ర సచివాలయానికి వెళ్ళిన దాఖలాలు లేవు. ప్రగతిభవన్‌లోకి కేవలం ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు, ప్రముఖులకు మాత్రమే ప్రవేశం ఉండేది. సామాన్య ప్రజలకు, కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడినవారికి ప్రవేశం లేకపోవడం ఆయన నియంతృత్వ పోకడలకు నిదర్శనమని రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ఉధృతంగా ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గడీ గోడలు బద్దలు కొట్టి, సామాన్య ప్రజలకు ప్రవేశం కల్పిస్తామని ప్రకటించింది. అధికారంలోకి రాగానే ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి గేట్లు తొలగించారు, అందులో ప్రజావాణి కార్యాలయాన్ని నెలకొల్పారు.



అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డు, సివిల్ లైన్స్‌లో ఉన్న ఆరో నెంబరు బంగ్లాను తన అధికారిక నివాసంగా ఉపయోగించారు. ఆ సమయంలో ఆ బంగ్లాను అత్యాధునిక వసతులతో కేజ్రీవాల్ ఆధునీకరించారు. దీనికి సుమారు రూ.80కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ పరిణామమే కేజ్రీవాల్ పాలిట శాపంగా మారింది. సకల సౌకర్యాలతో ఆధునీకరించిన ఈ బంగ్లాను అయిదు నక్షత్రాల వసతులతో కూడిన అద్దాలమేడ (శీష్ మహల్)గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణిస్తూ కేజ్రీవాల్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. లిక్కర్ స్కామ్ కూడా దీనికి తోడవటంతో బీజేపీ ధాటికి ఆప్ ఉక్కిరిబిక్కిరి అయ్యింది. పర్యవసానంగా ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీతో పాటూ స్వయంగా దాని అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఓటమి పొందారు. ఆప్ అధికారాన్ని కోల్పోయాక కేజ్రీవాల్ కోట్లాది రూపాయలు వెచ్చించి ఆధునీకరించిన శీష్ మహల్‌పై తలెత్తిన వివాదాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కూడా దానిని ఉపయోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు.

శాశ్వతంగా తామే ముఖ్యమంత్రులం అన్నరీతిలో కేసీఆర్, జగన్, కేజ్రీవాల్ తమ హయాంలో ప్రగతిభవన్, రుషికొండ ప్యాలస్, శీష్ మహళ్ళ నిర్మాణానికి భారీగా ప్రజాధనాన్ని వెచ్చించడం శోచనీయం. ముఖ్యమంత్రులకు అధికారిక నివాస గృహాలు, క్యాంప్ ఆఫీసులు ఉండాల్సిందే కానీ, వాటిని విలాసవంతమైన దర్బార్లుగా మార్చేందుకు వందల కోట్లు ఖర్చుచేయడం సరికాదు.

ఇక, ఆంధ్రప్రదేశ్‌లో రుషికొండ ప్యాలస్ నిర్మాణాలపై అనేక విమర్శలు వెల్లువెత్తినా జగన్ వాటిని బేఖాతరు చేశారు, తాను కోరుకున్నట్టుగా దానిని పూర్తి చేశారు. ఆ ప్యాలస్ ఫోటోలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జగన్ ఓటమి పాలై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం నేతలు ఆ భవనాల ఫోటోలు బయటపెట్టారు. ఆ విలాసాల్ని చూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలతో పాటు యావత్ దేశ ప్రజలు బిత్తరపోయారు. రుషికొండపై ఆ రాజసౌధాల నిర్మాణానికి రూ.500కోట్లకు పైగా జగన్ ఖర్చు చేసినట్లు విపక్ష పార్టీలు చెపుతున్నాయి. ఈ భవనాల నిర్మాణంలో జాతీయ పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల పరిరక్షణ సంస్థ నియమాలను జగన్ ప్రభుత్వం ఉల్లంఘించింది. వైసీపీ వర్గాలు కాదంటున్నప్పటికీ ముఖ్యమంత్రి అధికారిక నివాసం, క్యాంప్ ఆఫీసు కోసమే రుషికొండపై ఈ ఇంద్రభవనాలను నిర్మించినట్లు ప్రజలు బలంగా విశ్వసించారు. జగన్ రాజకీయాలలో ఉన్నంత వరకు రుషికొండ ప్యాలస్ నిర్మాణాలు విపక్ష పార్టీలకు రాజకీయ విమర్శనాస్త్రాలుగా ఉపయోగపడతాయి. వందల కోట్ల రూపాయలతో నిర్మించిన ఆ ప్రభుత్వ భవనాలు ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు కూడా అర్థం కావడం లేదు.

ముఖ్యమంత్రులకు ప్రభుత్వపరంగా స్థిరమైన అధికారిక నివాస గృహాలు, క్యాంప్ ఆఫీసులు ఉండాల్సిందే. కానీ దీనిని ఆసరా చేసుకుని వాటిని విలాసవంతమైన దర్బార్లుగా మార్చేందుకు వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఏ మాత్రం సరికాదు. ముఖ్యమంత్రుల అధికారిక నివాస గృహాలు ప్రజల సొమ్ముతో నిర్మించతలచినప్పుడు పాలకులు కచ్చితంగా కొన్ని నియమాలు పాటించాలి. సదరు నివాసాలను ఎక్కడ, ఎందుకు, ఎంత ఖర్చుతో నిర్మించబోతున్నదీ, వాటి ప్లాన్ ఎలా ఉన్నదీ క్యాబినెట్ సమావేశాల్లో చర్చించాలి, శాసనసభకూ తెలియచేయాలి. ప్రజాక్షేత్రంలో ఆ వివరాలన్నీ ఉంచి, అందరి ఆమోదంతో ముందుకు వెళ్ళాలి. ఇటువంటి కనీస నియమాలు పాటించకుండా, శాశ్వతంగా తామే ముఖ్యమంత్రులం అన్నట్లుగా కేసీఆర్, జగన్, కేజ్రీవాల్‌లు తమ హయాంలో ప్రగతిభవన్, రుషికొండ ప్యాలస్, శీష్ మహళ్ళ విషయంలో వ్యవహరించడం శోచనీయం. జవాబుదారీతనాన్ని విస్మరించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఎంత గొప్ప నాయకుడైనా ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

• కైలసాని శివప్రసాద్

పరిశోధనా ప్రమాణాలు ఏమయ్యేను?

విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు ప్రాతిపదికలు. జ్ఞానాన్వేషణలకు, వైజ్ఞానిక ఆవిష్కరణలకు అవి విధానాలు నిర్ణయిస్తాయి. కార్యక్రమాలు రూపొందిస్తాయి. వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాలు, ఇంజినీరింగ్, గణిత శాస్త్రంలో మౌలిక, అనువర్తిత పరిశోధనలకు, సామాజిక, మానవీయ శాస్త్రాలలో విద్వత్ శోధనలు, సమాలోచనలకు; సాహిత్యం, లలిత కళల్లో కొత్త సృజనలకు అవి ఆలంబనలు. ఆ పరిశోధనలు, అన్వేషణలు, సృజనలు అన్నీ వినూత్న సత్యాలను ఆవిష్కరిస్తాయి, కొత్త పరికరాలను రూపొందిస్తాయి, జ్ఞానసీమలను విశాలం చేస్తాయి. క్లిష్ట సమస్యలపై అవగాహనను పెంపొందిస్తాయి. ఒక జాతి అభ్యున్నతికి కొత్త ఆవిష్కరణలు, నవ కల్పనలు, మేధో, కళాత్మక సృజనలు అత్యావశ్యకాలు.

సమాజ పురోగమనానికి, ఆర్థిక వ్యవస్థను సంపద్వంతం చేసేందుకు, నవీకరణకు, ప్రజలు, ప్రాంతాలు, దేశాలు, భూఖండం మొత్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు శాస్త్ర పరిశోధనలు, జ్ఞానాన్వేషణలు అత్యావశ్యకం. పరిశోధన, విద్వత్తు, చరిత్ర ద్వారానే మన చరిత్రను, మనలను మనం తెలుసుకుంటాం, వర్తమాన పరిస్థితులను అర్థం చేసుకుని భద్రమైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోగలుగుతాము. అధ్యయనం, ఆవిష్కరణ, జ్ఞానసృష్టి విధులలో భాగంగా విశ్వవిద్యాలయాలు పరిశోధనల్లో నిమగ్నమవుతాయి. ఆ పరిశోధనలు వాటి బోధనా ప్రమాణాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దోహదం చేస్తాయి. ఆ ప్రమాణాలే అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు బోధించే కళాశాలల నుంచి విశ్వవిద్యాలయాలను భిన్నంగా ఉంచుతాయి. ప్రత్యేకిస్తాయి. మన దేశంలో 1400 విశ్వవిద్యాలయాలు (ప్రభుత్వ, ప్రైవేట్, డీమ్డ్) ఉన్నాయి. 40 వేలకు పైగా కళాశాలలు ఉన్నాయి. అధ్యాపకుల నియామకాలకు, ఆచార్యులుగా పదోన్నతికి అవశ్యమైన అర్హతల విషయమై యూజీసీ నిర్ణీత కాలంలో మార్గదర్శక సూత్రాలు / నిబంధనలు జారీ చేస్తుంది.

కళాశాల, విశ్వవిద్యాలయ అధ్యాపకుల అర్హతల విషయంలో ఎటువంటి బేధాన్ని పాటించదు. కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను బోధనా సిబ్బంది పదోన్నతుల విషయంలో ఒకే విధమైన ప్రమాణాలను పాటించడం వల్ల నాసిరకం ప్రమాణాలతో కూడిన అకడమిక్ జర్నల్స్ తామరతంపరగా వెలుస్తున్నాయి. అవి విచక్షణారహితంగా 'పరిశోధనా పత్రాలు' ప్రచురిస్తున్నాయి. తొలుత నిశితంగా పరిశీలించి వాటి ప్రచురణ యోగ్యతలను నిర్ధారించే సంపాదకవర్గ పర్యవేక్షణ లేని ఆ జర్నల్స్ వల్ల పరిశోధనా ప్రమాణాలకు తీవ్ర హాని వాటిల్లుతోంది. అటువంటి జర్నల్స్‌ను ప్రోత్సహించడం వల్ల అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, పరిశోధకుల సంఘాలలో భారత్‌కు చాలా చెడ్డ పేరు వస్తోంది. వాసి కంటే రాశికి ప్రాధాన్యమిస్తూ కనీస ప్రమాణాలు లేని పరిశోధనా పత్రాలను అవి ప్రచురిస్తున్నాయి. మరి ఇవి జ్ఞాన వికాసానికి ఎలా దోహదం చేస్తాయి? ఉన్నత విద్యా సంస్థలు అన్నిటినీ కలగలపి వేసే బదులు బోధన, పరిశోధనల ప్రాతిపదికన వాటి మధ్య తేడాల ఆధారంగా వర్గీకరించవలసిన అవసరమున్నది. అప్రామాణిక అకడమిక్ జర్నల్స్‌లో ప్రచురించిన పరిశోధనా పత్రాలు ఆధారంగా నియామకాలు, పదోన్నతులు జరగడం పరిపాటి అయింది. విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులుగా ఉన్న వారి పరిశోధనా పత్రాలు కనీస ప్రమాణాలు కూడా లేనివని ఇటీవల వార్తలు వెలువడ్డాయి. ఆ పరిశోధనా పత్రాల ప్రాతిపదికనే వారు సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందుతున్నారు! విచక్షణారహితంగా పరిశోధనా పత్రాలను ప్రచురిస్తున్న అప్రామాణిక జర్నల్స్ ఉండడం వల్లే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయనడంలో సందేహం లేదు. ఉన్నత విద్యావ్యవస్థలో ఉన్నత స్థాయిలో ఉన్న వారి వైదుష్య ప్రమాణాలు వాస్తవంగా నాసిరకమైనవి కావడం మన విద్యారంగానికి శోభనిస్తుందా? అవినీతి ఆరోపణలు నెదుర్కొంటున్న అధ్యాపకులను ప్రభుత్వాలు నిస్సిగ్గుగా ఆచార్యులుగా నియమించడం, ఆచార్యులుగా ఉన్న వారిని వీసీలుగా నియమించడం జరుగుతోంది.



akbar

వీసీల నియామకానికి సంబంధించి యూజీసీ ప్రతిపాదించిన కొత్త ముసాయిదా నిబంధనలు ఆ ప్రక్రియలో రాష్ట్ర గవర్నర్‌కు ప్రాధాన్యమివ్వడాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిరసిస్తున్నాయి. ఇదే సమయంలో అకడమిక్ జర్నల్స్‌కు సంబంధించి UGC CARE జాబితాను పూర్తిగా రద్దు చేస్తూ యూజీసీ నిర్ణయం తీసుకున్నది. మన విశ్వవిద్యాలయాలలో పరిశోధనల ప్రమాణాలను ప్రతికూలంగా ప్రభావితం చేసే నిర్ణయమిది. రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యావేత్తలు ఈ నిర్ణయాన్ని మాత్రం పట్టించుకోకపోవడం ఆశ్చర్యం.

పరిశోధనల నేపథ్యాన్ని, నాణ్యతను కనీసమాత్రంగానైనా పరిశీలించకుండా ఇలా నియామకాలు జరపడం గర్హనీయం. వీసీల నియామకానికి సంబంధించి ఇటీవల కొత్త ముసాయిదా నిబంధనలను ప్రజల పరిశీలనకు నివేదించింది. అత్యున్నత స్థాయి నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి అధినేతలకు కాకుండా రాష్ట్ర గవర్నర్‌కు ప్రాధాన్యమివ్వడం పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిరసన తెలుపుతున్నాయి. అయితే అకడమిక్ జర్నల్స్‌కు సంబంధించి UGC CARE జాబితాను పూర్తిగా రద్దు చేస్తూ యూజీసీ ఇటీవల నిర్ణయం తీసుకున్నది. మన విశ్వవిద్యాలయాలలో పరిశోధనల ప్రమాణాలను తీవ్రంగా ప్రభావితం చేసే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోకపోవడం విస్మయకరంగా ఉన్నది. ఉన్నత విద్యా రంగంలో అత్యున్నత స్థాయి బాధ్యతలకు ఎంపిక చేసే ఆచార్యుల అర్హతల విషయంలో రాజీ పడుతున్నప్పుడు పరిశోధనా పత్రాలు ప్రచురించే అకడమిక్ జర్నల్స్ నాణ్యత ఉత్కృష్టంగా ఉండేలా ఎలా చేయగలం?

2010లో జారీ చేసిన నిబంధనల కారణంగా యూజీసీ 2018లో అప్రామాణిక అకడమిక్ జర్నల్స్‌పై దృష్టి పెట్టింది. పరిశోధనా పత్రాలను నిశితంగా పరిశీలించకుండా, వాటి మంచి చెడ్డలను నిర్ణయించకుండా సులువుగా ప్రచురించే అవకాశాలు ఉండడంతో తమ పదోన్నతిని దృష్టిలో ఉంచుకుని పరిశోధనా పత్రాలను ప్రచురించడం విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, ఆచార్యులకు ఆనవాయితీ అయిపోయింది. అయితే UGC CARE జాబితాలో చేర్చాలని విశ్వవిద్యాలయాలు సూచించిన జర్నల్స్‌లో 88 శాతం నాసిరకం ప్రమాణాలతో ఉన్నవేనని తేలింది. సత్ సంకల్పంతోనే జారీ చేసిన నిబంధనలు పూర్తిగా దుర్వినియోగమైపోయాయి. ప్రచురించడం లేదా వెనుకబడి పోవడం అనే ధోరణి అధ్యాపక లోకంలో బాగా పెరిగిపోయింది.

ఈ వాస్తవాల దృష్ట్యా UGC List of Journalsలో వెలువడుతున్న పరిశోధనా పత్రాల ప్రమాణాలను విశ్లేషించి, పూణేలోని సావిత్రీబాయి పూలే విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఫర్ పబ్లికేషన్స్ ఎథిక్స్' పరిశోధనా పత్రాల ప్రచురణకు మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. వీటి ప్రేరేపణతో ఉన్నత విద్యా సంస్థల ప్రచురణ ప్రమాణాలను నిర్దేశించి, నియంత్రించే బాధ్యతను యూజీసీ చేపట్టింది. ఆ మేరకు 'Reference List of Quality Journals' నిర్వహించేందుకు 'Consortium For Academic and Research Ethics'ను నెలకొల్పింది. ఈ చర్య ద్వారా యూజీసీ జాబితా నుంచి వందలాది అప్రామాణిక అకడమిక్ జర్నల్స్‌ను తొలగించడం జరిగింది. ఈ జాబితాను ప్రతి మూడు నెలలకు ఒకసారి అప్‌డేట్ చేసే ఆనవాయితీని కూడా యూజీసీ పాటించింది. ఇది పరిశోధనా రంగంలో ఉత్కృష్ట ప్రమాణాలను నెలకొల్పిందనడంలో సందేహం లేదు. దురదృష్టవశాత్తు యూజీసీ ఇటీవల UGC CARE జాబితాను రద్దుచేసింది. ఈ నిర్ణయం వల్ల అంతర్జాతీయ ఉన్నత విద్యా రంగంలో మన దేశానికి మళ్లీ అప్రతిష్ఠపాలయ్యే ప్రమాదమెంతైనా ఉన్నది. యూజీసీ నిర్ణయం వల్ల పరిశోధన పత్రాలు ప్రచురించే జర్నల్స్ నాణ్యత విషయంలో విశ్వవిద్యాలయాలు రాజీపడే అవకాశమున్నది. ఇది ఎవరికి మేలు చేస్తుంది?

దీనివల్ల అప్రామాణిక జర్నల్స్ ప్రచురణ మళ్లీ పెరుగుతుంది. పైగా యూజీసీ ఇటీవల జారీ చేసిన ముసాయిదా రెగ్యులేషన్స్ ప్రకారం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ పదోన్నతికి మూడు పరిశోధన పత్రాలు ప్రచురిస్తే సరిపోతుంది; అలాగే ఒక అసోసియేట్ ప్రొఫెసర్ ఏడు పరిశోధన పత్రాల ప్రచురణతో పదోన్నతి పొందే అవకాశమున్నది. గతంలో పదోన్నతికి ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ UGC CARE జాబితాలోని జర్నల్స్‌లో ఏడు పరిశోధనా పత్రాలు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పది పరిశోధనా పత్రాలను ప్రచురించవలసి ఉండేది. యూజీసీ ఒక పక్క ముసాయిదా మార్గదర్శక సూత్రాలు జారీ చేసి మరోపక్క UGC CARE జాబితాను రద్దు చేసింది! అంతేకాకుండా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు పదోన్నతికి ప్రచురించాల్సిన పరిశోధనా పత్రాల సంఖ్యను కూడా తగ్గించింది! ఇది ఉన్నత విద్యా ప్రమాణాల ఉన్నతికి ఎలా దోహదం చేస్తుంది?

యూజీసీ కేర్ జాబితా ఉన్న కారణంగా కనీసం గత ఆరు సంవత్సరాలుగా ఆ జాబితాలోని జర్నల్స్‌లో తమ పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యేందుకు అధ్యాపకులు, ఆచార్యులు శ్రద్ధ చూపారు. ఈ జాబితాను రద్దు చేయడం వల్ల ప్రతి విశ్వవిద్యాలయం తన సొంత జర్నల్స్ జాబితాను అనుసరిస్తుంది. ఇది గందరగోళానికి తప్పక దారితీస్తుంది. UGC CARE జాబితాకు ప్రత్యామ్నాయంగా మరింత పటిష్ఠమైన యంత్రాంగం లేనిపక్షంలో పరిశోధనా ప్రమాణాలు మళ్లీ పడిపోవడం ఖాయం. UGC CARE జాబితా రద్దు నిర్ణయంలోని అంతస్సూచనలు, పర్యవసానాలను అర్థం చేసుకుని, విశ్వవిద్యాలయాల బోధనా సిబ్బంది నియామకాలలో అత్యున్నత స్థాయి ప్రమాణాలను రాష్ట్ర ప్రభుత్వాలు పాటించాలి.



■ అప్పారావు పొదిలె
మాజీ వీసీ
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

చిత్తశుద్ధిలేని ఆదర్శాలు

ఒకప్పుడు ఒక నినాదం ఉండేది: 'నా సలహా పాటించండి, నేను ఉపయోగించడం లేదు'. చమత్కారంగా ఉంది కదూ! కాంగ్రెస్ పార్టీకి బాగా వర్తించే వాస్తవమది. తెలంగాణలో ఆ పార్టీ ప్రభుత్వం, ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోంది; బాపూజీ, బాబాసాహెబ్ ఆదర్శాలకు పూర్తి విరుద్ధంగా పాలన చేస్తోంది. అయితే ఇతర రాష్ట్రాలలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ ఉద్యమాలు నిర్వహిస్తోంది!!!

గ్రామ స్వరాజ్ గురించి మహాత్ముడు ఏమన్నారో గుర్తు చేసుకుందాం: 'గ్రామ స్వరాజ్ అనేది ఒక సంపూర్ణ గణతంత్ర రాజ్యంగా ఉండాలి. తన అవసరాలకు ఇరుగు పొరుగుపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఉండాలి. అయితే తప్పనిసరి అయిన వాటి కోసం ఇరుగుపొరుగు వారితోనే కాకుండా ఇంకా మరెంతో మందితో పరస్పరాధారిత సంబంధాలు నెలకొల్పుకోవాలి. అలా ప్రతి గ్రామమూ తన అవసరాల మేరకు సొంత ఆహార ధాన్యాలను పండించుకోవాలి. వస్త్రాలకు అవసరమైన పత్తిని ఉత్పత్తి చేసుకోవాలి. పశువులకు, బాలలు, వయోజనుల ఆటపాటలు, వినోద విహారాలకు గాను సముచిత రీతిలో ఉమ్మడి స్థలాలను ఉంచుకోవాలి'. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి నమూనా ఎలా ఉందో చూడండి: రాజనాలు పండే వ్యవసాయ భూములను రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటోంది. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేరిట యాచారం మండలంలోని మేడిపల్లి, కుర్మిడ్డ, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాలలోని సాగు భూములను స్వాధీనం చేసుకున్నారు, మాన్యుఫాక్చరింగ్ జోన్ పేరిట జహీరాబాద్ ప్రాంతంలోని జీవ వైవిధ్యం సమృద్ధిగా ఉన్న భూములను, దుగ్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట్ గ్రామాలలోని సస్యశ్యామల భూములను అనవసరంగా, బలవంతంగా స్వాధీనం చేసుకొంటున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరిట నిర్దిష్ట ప్రణాళిక ఏదీ లేకుండా భూమార్కెట్లను క్రియాశీలం చేసేందుకే షెడ్యూల్డు తెగల వారి నుంచి భూములు స్వాధీనం చేసుకుంటున్నారు. ఇదీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ జై బాపు ఉద్ఘోష వెనుక జరుగుతున్నది!

దళితుల, గిరిజనులకు సంక్షేమ సాధన గురించి బాబాసాహెబ్ అంబేడ్కర్ ఏమి చెప్పారో చూడండి: 'షెడ్యూల్డు కులాల వారికి భూములు పంపిణీ చేయడంపై ప్రభుత్వం తన దృష్టిని కేంద్రీకరించడం చాలా ముఖ్యమైన, ఆవశ్యక విధి. వారు ఆ భూములలో స్థిరపడి సొంత జీవనాధారాలను సమకూర్చుకోవలసి ఉంది. వారు ఎవరికీ భయపడవలసిన పరిస్థితులు ఉండకూడదు నిర్భీతితో ధైర్యంగా, స్వతంత్రంగా జీవించాలి'. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందేమిటి? అభివృద్ధి పేరిట షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారి నుంచి భూములను బలవంతంగా కైవసం చేసుకోవడాన్ని కొనసాగిస్తోంది. స్వతంత్ర జీవనాధారాలకు అవసరమైన భూమి వారికి ఇంకెంతమాత్రం లేకుండా చేస్తోంది. ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ మహిళల నిత్య జీవితాలలో భాగంగా ఉన్న కొద్ది పాటి భూమిని సైతం, వారితో ఏ విధంగాను సంప్రదించకుండానే వారికి లేకుండా చేస్తోంది. మరి ఇదే కాంగ్రెస్ పార్టీ ఇతర రాష్ట్రాలలో జై భీమ్ అని నినదిస్తోంది!

భూ స్వాధీన చట్టం–2013కు గత ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణలు అమలుపరచడాన్ని, దళితుల, గిరిజనుల, వెనుకబడిన వర్గాల సాగుదారుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడాన్ని కొనసాగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ అధికరణలు 14, 19, 21, 300ఎ, ఆదేశిక సూత్రాలను ఉల్లంఘిస్తోంది. ఇదీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ జై సంవిధాన్ ఆదర్శ పాలన!

– సరస్వతి కవుల

స్వదేశీ ఏఐ అభివృద్ధి ఏదీ?

కృత్రిమ మేధస్సు (ఏఐ-AI) ప్రపంచ సాంకేతిక దృశ్యాన్ని మార్చుతున్న యుగంలో, భారతదేశం ఒక కీలకమైన మలుపు దగ్గర ఉన్నది. ఐటీ శక్తిగా మన దేశానికి ఎంతో ఖ్యాతి, విశాలమైన సాంకేతిక ప్రతిభ ఉన్నప్పటికీ, ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఇంకా స్వంతంగా ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేయలేదు.

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలను ప్రపంచానికి అందించిన దేశం మనది. కానీ OpenAI నుంచి విడుదలైన ChatGPTకు లేదా చైనాకు చెందిన DeepSeekకు సమానమైన స్వంత ఏఐ ఉత్పత్తులను మనం ఇంకా తయారు చేయలేదు. ఈ లోటు ఇప్పుడు మన ముందు ఒక పెద్ద సవాలును నిలబెట్టింది: అది సేవా ప్రదాత స్థాయి నుంచి ఉత్పత్తి సృష్టికర్త స్థాయికి ఎదగాల్సిన సవాలు. ఈ దిశగా పెట్టుబడి, పరిశోధనలతో పాటు– ప్రభుత్వ – ప్రైవేట్ సంస్థల మధ్య మరింత సమగ్ర సహకారం అవసరం.

భారతదేశంలో కొన్ని ఏఐ అంకుర సంస్థలు లేకపోలేదు. కానీ భారీగా నిధులు పొందిన పాశ్చాత్య, చైనీస్ ప్రత్యర్థులతో అవి పోటీపడలేక ఇబ్బందిపడుతున్నాయి. ఏఐ అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాలు పరిమితంగా లభించడం, అధిక కంప్యూటింగ్ ఖర్చులు, అంకితభావంతో కూడిన ఏఐ పరిశోధనా కేంద్రాల కొరత ఇక్కడ అడ్డంకులుగా ఉన్నాయి. ప్రపంచ స్థాయిలో పోటీ పడగల స్వదేశీ ఏఐను అభివృద్ధి చేయాలంటే ముందుగా ఈ సమస్యలను పరిష్కరించడం అత్యవసరం.

సరైన మౌలిక సదుపాయాలు, నిధులు లేకుండా, స్వదేశీ ఏఐ అభివృద్ధి దాదాపు అసాధ్యం! ప్రస్తుతం దేశంలో అధునాతన ఏఐ మోడల్‌లకు శిక్షణ ఇవ్వడానికి అవసరమైన పెద్ద స్థాయి కంప్యూటింగ్ క్లస్టర్‌లు, అధిక శక్తిగల జీపీయూలు తదితర మౌలిక సదుపాయాలు లేవు. ఓపెన్‌ఏఐ వంటి కంపెనీలు బిలియన్ల డాలర్ల పెట్టుబడులను పొందుతున్నాయి (మైక్రోసాఫ్ట్ నుంచి $13 బిలియన్ల మద్దతుతో సహా). భారతదేశంలో ఏఐ ఆవిష్కరణల కోసం వెంచర్ కాపిటల్ ఇంకా శైశవ దశలో ఉన్నది. పెట్టుబడిదారులు దీర్ఘకాలిక పరిశోధన ప్రాజెక్టుల కంటే త్వరిత రాబడులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పెట్టుబడి కొరత ప్రపంచ వ్యాప్తంగా పోటీపడగల అత్యాధునిక ఏఐ సాంకేతికతలను అభివృద్ధి చేయకుండా మన దేశాన్ని అడ్డుకుంటున్నది. ఈ అడ్డంకిని అధిగమించాలంటే ప్రభుత్వం మౌలిక సదుపాయాల విషయంలో చొరవ చూపాలి. ప్రభుత్వ నిధులతో నడిచే సూపర్ కంప్యూటింగ్ సౌకర్యాలు, అంకిత భావంతో కూడిన ఏఐ పరిశోధనా కేంద్రాల స్థాపన, ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు అవసరమైన వనరులు ప్రభుత్వం కల్పించాలి.

రిలయన్స్ జియో వంటి ప్రైవేట్ సంస్థలు డిజిటల్ సౌకర్యాలను విప్లవాత్మకంగా మార్చాయి. కోట్ల మందికి వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందుబాటులో ఉంచాయి. ఈ డిజిటల్ అభివృద్ధి ఆరోగ్య సంరక్షణ నుంచి, విద్య, వ్యవసాయం వరకు అన్ని రంగాల్లో విస్తృత ఏఐ వినియోగానికి పునాదిని వేయగలదు. ఇక్కడ 1.3 బిలియన్లకు పైగా పౌరులు ఆధార్‌లో నమోదు చేసుకోవటం, యూపీఐ ద్వారా నెలకు 8 బిలియన్ల లావాదేవీలు జరగడం మొదలైన ఋజువులను బట్టి పెద్దస్థాయి డిజిటల్ పరిష్కారాలను అమలు చేయగల సామర్థ్యం మన దేశానికి ఉందని అర్థమవుతుంది.

భారతదేశ విద్యా వ్యవస్థ సంవత్సరానికి 1.5 మిలియన్లకు పైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తున్నది. గొప్ప ఏఐ కార్యబలాన్ని నిర్మించడానికి విశాల సామర్థ్యాన్ని అందిస్తున్నది. అయితే, ఈ ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడానికి, పాఠశాల నుండి ఉన్నత విద్య వరకు విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. సాంకేతికతపై ఆసక్తిని పెంపొందించడానికి పాఠశాల స్థాయిలో ఏఐ అక్షరాస్యత, కోడింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరిచయం చేయాలి. కళాశాల స్థాయిలో ప్రాక్టికల్ ఏఐ ప్రాజెక్టులు, అంతర్విభాగ అభ్యాసాలు, ఏఐ నైతికతపై చర్చలు అమలు జరపాలి. విశ్వవిద్యాలయాలు అధునాతన ఏఐ, మెషిన్ లెర్నింగ్, పరిశ్రమ సమన్వయం వంటి అంశాల్లో పాఠ్య ప్రణాళికను తయారు చేయాలి. ఈ అంశంలో విద్యా సంస్థలకు పరిశ్రమలకు మధ్య వారధి ఏర్పడాలి. పరిశ్రమలలో తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌లు, మెంటర్‌షిప్ కార్యక్రమాలు జరగాలి.



ప్రపంచ శక్తి సమీకరణాల్లో ఏఐ ప్రధానపాత్ర పోషిస్తున్న ఈ దశలో భారతదేశం కేవలం సేవల ప్రదాతగానే మిగిలిపోతే, అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని కోల్పోతుంది. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా, భారతదేశం తన స్వంత ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యవసరం.


ఏఐ విషయంలో సమగ్ర వ్యూహం అవసరం. ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన రూ.10,000 కోట్లు ఈ దిశగా తీసుకున్న సరైన చర్య. ఈ పెట్టుబడి ఇంకా ఎక్కువగా, ఈ అంశంలో ప్రపంచ స్థాయిలో మన పోటీదారులతో సమానంగా ఉండాలి. అలాగే అమెరికాలోని 'DARPA', లేక చైనాలోని ఏఐ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ లాంటి ప్రత్యేక ఏఐ పరిశోధనా సంస్థను ఏర్పాటు చేయాలి.

స్వదేశీ ఏఐ మోడల్స్ భారతీయ భాషలను, స్థానిక సందర్భాలను బాగా అర్థం చేసుకునేలా ఉండాలి. 22 అధికారిక భాషలు, 1600కి పైగా ఉప భాషలతో, భారతదేశంలో ఏఐ అభివృద్ధికి ప్రత్యేకమైన సవాళ్లు ఉన్నాయి. ఈ ఏఐ మోడళ్లు కేవలం భాషలను మాత్రమే కాకుండా, భారతీయ సంస్కృతీ లక్షణాలను, కమ్యూనికేషన్ సందర్భాలను అర్థం చేసుకోవాలి. దీనిని సాధించడానికి, భారతదేశం ప్రాంతీయ భాషలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టే ఏఐ పరిశోధనా కేంద్రాలను నెలకొల్పాలి. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (NLP) మోడళ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టి, భిన్న ప్రజా సమూహాల కోసం ప్రత్యేకమైన ఏఐ పరిష్కారాలను రూపొందించాలి.

ప్రపంచ శక్తి సమీకరణాల్లో ఏఐ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ దశలో భారతదేశం కేవలం సేవల ప్రదాతగానే మిగిలిపోతే, అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని కోల్పోతుంది. స్వదేశీ ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం కేవలం వ్యాపార అవకాశాల కోసం మాత్రమే కాదు; ఇది డిజిటల్ స్వాయత్తతకు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశం. రక్షణ, సైబర్ భద్రత, ఆరోగ్య సంరక్షణ, పాలన వంటి రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషించనుంది. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా, భారతదేశం తన స్వంత ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యవసరం.

భారతదేశం ఐటీ సేవా రంగంలో సాధించిన ప్రఖ్యాతిని రాబోయే దశాబ్దంలో ఏఐలోనూ సాధిస్తుందా లేదా అన్నది కీలకం. సరైన పెట్టుబడి, దూరదృష్టి, సమర్థవంతమైన అమలు ఉంటే, భారతదేశం ఒక గ్లోబల్ ఏఐ శక్తిగా ఎదగగలదు. అమెరికా, చైనా ఏఐ మోడళ్లకు ప్రత్యామ్నాయాలను అందించే సమర్థవంతమైన దేశంగా మారగలదు. ప్రపంచ దేశాలు ఏఐ ప్రభావాలను అర్థం చేసుకుంటున్న ఈ సమయంలో భారతదేశం ఈ మార్పులో విజయం సాధిస్తే, అభివృద్ధి చెందుతున్న దేశాలకు గ్లోబల్ ఏఐ రంగంలో తమ స్థానాన్ని ఎలా ఏర్పాటు చేసుకోవాలో ఒక కొత్త నమూనాను అందించగలదు. ముందుకు సాగాల్సిన మార్గం స్పష్టంగా ఉంది: ఏఐ మౌలిక సదుపాయాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాలి; స్వదేశీ ఆవిష్కరణలను ప్రోత్సహించాలి; విద్యా వ్యవస్థను నవీకరించాలి; ప్రభుత్వ –ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలి. భారతదేశ సాంకేతిక భవిష్యత్తుకై నిర్ణయాత్మక చర్య తీసుకోవాల్సిన సమయం ఇదే.

◆ ఎన్. శివప్రసాద్
విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ మద్రాస్



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.4 కనిష్ఠం 18.6

బెంజ్ కారు రంగుమార్చిన
యజమానిపై కేసు 6



మేనబావను కడతేర్చిన బాలుడు 8
ఇష్టారాజ్యంగా ఇంటర్ ప్రాక్టికల్స్



బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు పార్టీ శ్రేణులు బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ భవన్‌కు సోమవారం భారీగా తరలివచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు.

నిలిచిన గోదావరి జలాలు

- పలు ప్రాంతాలకు నీటి ఇబ్బందులు
- నేడు పునరుద్ధరణకు చర్యలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌కు గోదావరి జలాల సరఫరా సోమవారం ఉదయం నుంచి నిలిచింది. నగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ఫేజ్-1లోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద 3000ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు.. 900ఎంఎం డయా వాల్వులు (బీఎఫ్ అండ్ ఎన్ఆర్వీ) అమర్చే ప్రక్రియను సోమవారం చేపట్టారు. నగరానికి నీటి సరఫరా నిలిపివేసి వాల్వులు బిగించే పనులు

మిగతా 6వ పేజీలో..

చివరిరోజూ పోటెత్తారు

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో 46 రోజులపాటు అట్టహాసంగా జరిగిన నుమాయిష్ సోమవారం ముగిసింది. చివరిరోజున వ్యాపారులు పలు వస్తువులను చౌకగా ఇవ్వడంతో సందర్శకులు పోటెత్తారు. భారీగా కొనుగోళ్లు జరిగాయి.



ప్రైవేట్ డ్రైవర్లు V/s ఆర్టీసీ కండక్టర్లు

- ఎలక్ట్రిక్ బస్సుల్లో కుదరని సయోధ్య
- కండక్టర్ల సూచనలు పాటించని డ్రైవర్లు!
- పలుస్టాపుల్లో ఆపకుండా వెళ్తున్న ఈవీ బస్సులు



ఆర్టీసీ నడుపుతున్న ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్‌లో ఆర్టీసీ నడుపుతున్న ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణలో కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. నగరంలో ప్రస్తుతం 180 ఈవీ బస్సులను ప్రైవేట్ డ్రైవర్లు నడుపుతున్నారు. ఆర్టీసీ సంస్థకు చెందిన కండక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. అయితే, వీరి మధ్య సయోధ్య కుదరడం లేదు. కొందరు ప్రైవేట్ డ్రైవర్లు కండక్టర్లతో దురుసుగా ప్రవర్తిస్తూ పలు బస్టాపుల్లో ఆపకుండా ముందుకు వెళుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్సులు ఆపాలని చెబుతున్నా కొంతమంది డ్రైవర్లు అవేవీ పట్టించుకోవడం లేదని, దీంతో తమతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగుతున్నారని కండక్టర్లు వాపోతున్నారు. వీరి మధ్య తలెత్తే ఇబ్బందుల ప్రభావం ప్రయాణికులపై పడుతోంది. ఈవీ బస్సుల్లో డ్రైవర్లుగా వచ్చేవారు ఆర్టీసీ నియమనిబంధనలు పాటించాలని పలువురు కోరుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సులను సైతం ఆర్టీసీ సంస్థకు చెందిన డ్రైవర్లు నడిపేదిశగా చర్యలు తీసుకోవాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

ఒకప్పుడు నగర ప్రజలను నిలువునా ముంచేసిన మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) ఇప్పుడు మళ్లీ ప్రవేశించింది. చాపకిందనీరులా విస్తరిస్తోంది. ఈ మార్కెటింగ్ విధానాన్ని నిషేధించినా ఆయా కంపెనీలు పేర్లు మార్చి మళ్లీ వాటిని నిర్వహిస్తున్నాయి. తాజాగా ఓ సంస్థ పేరు మార్చుకుని నిరుద్యోగులకు సుమారు రూ.850 కోట్ల కుచ్చుటోపీ వేసింది.



మల్టీ.. పల్టా!

- మళ్లీ విజృంభిస్తున్న ఎంఎల్ఎం మోసాలు
- మార్కెటింగ్ పేరుతో నిరుద్యోగులకు వల

- పేరు మాత్రమే మారుతోంది...
- మిగతాదంతా సేమ్ టూ సేమ్
- అధిక లాభాల పేరుతో ఎర
- కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం)లో చేరితే లక్షల్లో సంపాదించవచ్చనే ఆశలు చూపి పలు కంపెనీలు అమాయకులను నిలువునా మోసగిస్తున్నాయి. నగరంలో కొన్నేళ్ల క్రితం క్యూనెట్ సంస్థ పేరు మార్చుకొని విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ పేరిట అమాయకులు, నిరుద్యోగులను మోసగించింది. అదే తరహాలో ఇతర కంపెనీలు సైతం పాత పేర్లు ఎక్కడా కనిపించకుండా కొత్త పేర్లతో, సరికొత్త తీరుతో ఎంఎల్ఎం కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. ఇందుకు ఆదివారం బయట పడిన రూ.850 కోట్ల స్కామే నిదర్శనం. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్ పేరుతో వేలాది మంది నుంచి 'మీ పెట్టుబడికి అధిక రాబడి అంటూ' డిపాజిట్లు సేకరించి మోసం చేసింది. ఇలా పలు కంపెనీలు రకరకాలుగా ఎంఎల్ఎం విధానంలో మోసాలకు పాల్పడుతూనే ఉన్నాయి. సామాన్యుడే లక్ష్యంగా చేసుకొని కేటుగాళ్లు పంజా విసురుతున్నారు. కోట్లు కొల్లగొట్టి బిచాణా ఎత్తివేస్తున్నారు.

హైటెక్ హంగులతో..

సామాన్య ప్రజలు, మహిళలను లక్ష్యంగా చేసుకొని పలు కంపెనీలు మీటింగులు పెట్టి, హైటెక్ హంగులతో కార్పొరేట్ కార్యాలయాల్లో, స్టార్ హోటల్స్‌లలో సమావేశాలను ఏర్పాటు చేస్తుంటారు. లైవ్‌లో కొందరిని పిలిపించి వారితో 'మేము పెద్ద మొత్తంలో లాభాలను తీసుకుంటున్నాం' అంటూ నమ్మించే ప్రయత్నం చేసి ఔత్సాహికులను మార్కెటింగ్ ఉచ్చులోకి దించుతారు. ఇలా ఒకరు...ఇద్దరు నుంచి మొదలు కొని పదులు, వందలాది మందిని ఏజెంట్లుగా చేర్చుకొని వారి నుంచి డిపాజిట్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తుంటారు. 'కంపెనీలో చేరిన మూడు నెలల్లోనే నా సంపాదన వేల నుంచి లక్షల్లోకి చేరింది. ఇందులో చేరితే మీరు సైతం లక్షలు సంపాదించవచ్చు.' అని కొన్ని మొబైల్ యాప్‌లను, పత్రాలను చూపిస్తూ నమ్మిస్తుంటారు.

రియల్ ఎస్టేట్ సంస్థలు అదే బాటలో

ఎంఎల్ఎంలో రకరకాల ఉత్పత్తులతో పాటు

మిగతా 8వ పేజీలో..

మార్కెటింగ్ మాయలో పడొద్దు..

మల్టీ లెవల్ మార్కెటింగ్ మాయలో పడొద్దని ప్రజలకు పోలీసులు సూచిస్తున్నారు. ఇంట్లో ఉంటూనే సంపాదించవచ్చనే కొందరు మోసగాళ్ల ప్రకటనల్ని నమ్మి మోసపోవద్దంటున్నారు. ప్రొడక్ట్‌ల పేరిట చైన్ లింక్ మార్కెటింగ్ జరుగుతూ ఉంటుంది. ముఖ్యంగా గృహిణులకు సదావకాశం అంటూ ఊదరగొట్టే ప్రకటనలు గుప్పిస్తుంటారు. మీతో పాటు నలుగురిని చేర్చుకోవాలని బ్రెయిన్ వాష్ చేస్తారు. పేరు ఏదైనా అక్కడ జరిగేది పచ్చి మోసమే. మల్టీ లెవల్ మార్కెటింగ్ జోలికి వెళ్లకండి. ఎలా చేసినా అంతిమంగా నష్టపోయేది కొనుగోలుదారులు, పెట్టుబడిదారులే. లక్షలు, కోట్లు వస్తాయన్న ఆశనే ఆయా కంపెనీల మాయ మాటల్లో పడేలా చేస్తోంది. అత్యాశకు పోతే చివరకు మిగిలేది శూన్యమేనన్న విషయాన్ని గుర్తించాలి.' అని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్..

- లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్లు, అత్యధిక లాభాలు అని ప్రకటనల్లో ఊదరగొడితే అది పక్కా మోసమని గుర్తించాలి.
- మీకు వచ్చే ప్రకటనల్లో ఉన్న కంపెనీల పేర్లు, వాటి వ్యాపారం గురించి గుడ్డిగా నమ్మకుండా పూర్తి వివరాలు తెలుసుకోవాలి.
- మల్టీలెవల్ మార్కెటింగ్‌లో ఒకరి ద్వారా మరొకరు చేరుతుంటారు. ఇలాంటి గొలుసు కట్టు విధానంలో చేరవద్దు.
- మీకు ఫోన్‌లకు వచ్చే సందేశాలకు, అనుమానాస్పద వెబ్ లింక్‌లు, ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయవద్దు.
- మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీంలు నడిపే నిందితుడు విదేశాల్లో ఉండి మోసగిస్తారు.
- ఈ స్కీమ్‌తో మొదట్లో చేరిన కొద్ది మందికి లాభాలు చూపించి, మిగిలిన అందరి సొమ్ము కొల్లగొట్టేస్తారు.

పోలీసు కస్టడీలో డాక్టర్ రాజశేఖర్

- పవన్ పరిచయంతోనే అలకనందలో కిడ్నీ మార్పిడి



దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సంచలనాత్మకంగా మారిన అలకనంద ఆస్పత్రి కిడ్నీ దందా కేసులో రిమాండ్‌లో ఉన్న డాక్టర్ రాజశేఖర్‌ను సరూర్‌నగర్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించడంతో అతన్ని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. చెన్నైకి చెందిన రాజశేఖర్ సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలోని అలకనంద ఆస్పత్రికి వచ్చి కిడ్నీ మార్పిడి చేసి వెళ్లేవాడు. అయితే ఇప్పటికే ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న అలకనంద ఆస్పత్రి యజమాని సుమంత్, అవినాష్‌లను కస్టడీకి తీసుకుని విచారించిన పోలీసులు మరింత సమాచారం కోసం డాక్టర్ రాజశేఖర్‌ను కూడా కస్టడీకి తీసుకున్నారు. వైజాగ్‌లో గతంలో కిడ్నీ మార్పిడి సమయంలో పవన్‌తో ఉన్న పరిచయంతోనే అలకనందకు వచ్చి మార్పిడీని చేస్తున్నట్లు వెల్లడించినట్లు సమాచారం. గతంలో పవన్‌తో పాటు డాక్టర్ రాజశేఖర్ కూడా జైలుకు వెళ్లి వచ్చిన విషయం తెలిసిందే. జైలు నుంచి వచ్చిన తరువాత ఆంధ్రా నుంచి హైదరాబాద్ అడ్డాగా కిడ్నీ దందాకు తెరతీశారు. దీని వెనుక ఎవరెవరు ఉన్నారు? కార్పొరేట్ ఆస్పత్రుల ప్రమేయం గురించి ఆరా తీయగా రాజశేఖర్ నోరు మెదపనట్లు తెలుస్తోంది. మంగళవారంతో కస్టడీ ముగియనున్న నేపథ్యంలో పోలీసులు సమాచారం రాబట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పరారీలో ఉన్న పవన్ ఎక్కడ తల దాచుకున్నాడు? అతని వెనుక ఎవరు ఉన్నారా? అనే సమాచారం రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

సృజనాత్మకం



ఆకట్టుకున్న 'ఆర్ట్' ఎగ్జిబిషన్
20న గవర్నర్ చేతుల మీదుగా విజేతలకు అవార్డులు 8

మీరు మారరా?

- పట్టణ ప్రణాళికా విభాగం తీరుపై కమిషనర్ మండిపాటు
- అక్రమ నిర్మాణాలపై చర్యల్లో జాప్యంపై అసహనం
- 'ప్రజావాణి'లో పాల్గొన్న ఇలంబరితి

'స్టాండింగ్' ఏకగ్రీవమే..?

- ఎన్నికలకు బీఆర్‌ఎస్, బీజేపీ దూరం
- కాంగ్రెస్-7, ఎంఐఎం-8
- బీఆర్‌ఎస్ నుంచి రెండు నామినేషన్లు.. ఉపసంహరణకు అవకాశం..?



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 17 నామినేషన్లు దాఖలైనా.. బీఆర్‌ఎస్ పోటీలో ఉండదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కాంగ్రెస్, ఎంఐఎం సభ్యుల ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమం కానుంది. 15 మంది సభ్యుల స్థానాలకుగాను కాంగ్రెస్ నుంచి ఏడుగురు, ఎంఐఎంకు చెందిన ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజైన సోమవారం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 17లో బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు.. కాంగ్రెస్, ఎంఐఎంలకు చెందిన 15 మంది ఉన్నారు. బీజేపీ కార్పొరేటర్లు 41 మంది ఉన్నా.. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిస్తే జీహెచ్ఎంసీకి సంబంధించి అధికారంలో భాగస్వాములైనట్టే అని భావించి, పోటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ నిర్ణయించింది. దీంతో బీఆర్‌ఎస్ పునరాలోచనలో పడింది. తాము బరిలో ఉన్నా.. గెలిచే పరిస్థితి ఉండదన్న ఉద్దేశంతో గులాబీ పార్టీ వెనక్కి తగ్గాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆ పార్టీకి చెందిన

మిగతా 6వ పేజీలో..



నీళ్ల తొట్టిలో వేసిన వెల్లుల్లి పాయలను తొక్కుతున్న మహిళ, వెల్లుల్లి తొట్టెలో చెప్పులు

కాళ్లతో తొక్కుతూ వెల్లుల్లి పేస్ట్ తయారీ

- వాడిన వారికి అనారోగ్య సమస్యలే
- చాదర్‌ఘాట్‌లో అక్రమంగా వెలిసిన తయారీ కేంద్రం
- భరించలేని దుర్వాసనతో స్థానికుల ఆరా..

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సాధారణంగా వెల్లుల్లిని రోలు ద్వారానో, గ్రైండర్, మిక్సీలోనే వేసి పేస్ట్ తయారు చేస్తారని అందరికీ తెలుసు. కానీ, ఇక్కడ ఎవరి ఊహకు అందని విధంగా కాళ్లతో తొక్కుతూ వెల్లుల్లి పాయలను వేరు చేస్తున్నారు. అనంతరం పేస్ట్ తయారు చేస్తున్నారు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. నగరం నడిబొడ్డున చాదర్‌ఘాట్‌లో వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జి వెనుక ఉన్న మూసానగర్‌లో కొందరు అక్రమంగా వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెల్లుల్లిని పేస్ట్‌గా మార్చేందుకు కొందరు కార్మికులను నియమించుకున్నారు. వెల్లుల్లి పేస్టును తయారు చేయగా వచ్చే రసం (ద్రావణం) సమీపంలో ఉన్న నాలాలో పారవేస్తుండడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. మొదట్లో మూసీ నుంచి వచ్చే దుర్వాసనగా భావించిన స్థానికులు

మిగతా 6వ పేజీలో..

ఐఐటీలను తలదన్నేలా జేఎన్‌టీయూ

ఇన్నోవేషన్ పార్క్



ఇన్నోవేషన్ పార్కు ఏర్పాటు చేయనున్న గోల్డెన్ జూబ్లీ భవనం

ఆసియాలోనే అత్యుత్తమంగా ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే అత్యుత్తమంగా ఉండేలా ఇన్నోవేషన్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు జేఎన్‌టీయూ సన్నాహాలు చేస్తోంది. విద్యార్థులు తమ ఆలోచనలను వాస్తవికతగా మార్చుకునేందుకు అనువైన వాతావరణాన్ని పెంపొందించడమే ధ్యేయంగా ఈ అత్యాధునిక ఇన్నోవేషన్ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఐఐటీ మద్రాస్, ఐఐటీ ముంబై.. తదితర జాతీయ సంస్థలలో నెలకొల్పిన ఇన్నోవేషన్ పార్కులను సందర్శించిన జేఎన్‌టీయూ అధికారులు.. త్వరలో ఏర్పాటు చేయబోయే ఈ పార్క్‌ను.. రాబోయే ఐదేళ్లలో(2030 నాటికి) ఆసియాలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్లస్టర్లలో ఒకటిగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు, అనుభవజ్ఞులైన అధ్యాపకుల వినతుల నేపథ్యంలో ఇటీవల రూ.50కోట్లతో నిర్మితమై ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గోల్డెన్ జూబ్లీ భవనంలోనే ఇన్నోవేషన్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్, ఇతర ఉన్నతాధికారులు యోచిస్తున్నట్లు తెలిసింది. ఇన్నోవేషన్ పార్కులో పరిశోధనకు అవసరమైన టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సమకూర్చేందుకు మరో రూ.20కోట్లు వెచ్చించాలని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు సమాచారం.

ఇన్నోవేషన్ పార్కు లక్ష్యాలు.. ప్రత్యేకతలు

- శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక పురోగతి కోసం పరిశోధనల అభివృద్ధి, ఆవిష్కరణలకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడం
- సాంకేతికత ఆధారిత పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థల సృష్టి, అభివృద్ధి, వృద్ధిని ప్రోత్సహించడానికి తగిన పరిశోధన, సాంకేతిక వ్యాపార, పారిశ్రామిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం.
- టెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌లు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి, ఎగుమతి మార్కెట్‌లోకి ప్రవేశించడానికి, పెట్టుబడులు పొందడానికి, దేశీయంగా, అంతర్జాతీయంగా ఉన్న సలహాదారులను ఉపయోగించుకోవడానికి అవసరమైన స్మార్ట్ రీసెర్చ్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయడం
- ఇతర సంస్థలతో స్వతంత్రంగా లేదా సంయుక్తంగా కాంట్రాక్టు పరిశోధన, సహకార పరిశోధన, కన్సల్టెన్సీ ప్రాజెక్ట్‌లను చేపట్టడం.
- టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను పెంచడానికి అవసరమైన మేధో సంపత్తి, నిర్వహణ, టెక్నాలజీ షేరింగ్ సర్వీసులను అభివృద్ధి చేయడం, ప్రోత్సహించడం
- పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధక సంస్థలతో కలిసి వారసత్వ సాంకేతిక వ్యాపారాలను

మిగతా 6వ పేజీలో..

నోటీసులా.. అయితే మాకేంటి?

- గడువు ముగిసినా వివరణ ఇవ్వని కొందరు అధికారులు
- కారు 'అద్దె దందా'పై పురపాలక శాఖ సీరియస్
- అయినా పట్టని వైనం
- తీవ్రంగా పరిగణిస్తోన్న కమిషనర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతోన్న అధికారుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఈ విషయంలో కమిషనర్ ఇలంబరిది సీరియస్‌గా ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. సంస్థలోని పలు విభాగాల్లో పనిచేసే అధికారులు సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతూ బినామీ ట్రావెల్ ఏజెన్సీల పేరిట ప్రతినెలా అద్దె తీసుకుంటున్నారని జీహెచ్ఎంసీ డ్రైవర్ కమ్ ఓనర్స్ (డీసీఓ) అసోసియేషన్ పురపాలకశాఖ, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు

మిగతా 8వ పేజీలో..

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



టికెట్ ధర కేవలం రూ. 150/- మాత్రమే
దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
అర్జున్ 70 - కూకట్‌పల్లి | రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



విమల్ 70ఎంఎం - బాలానగర్
64 channel Dolby AtmosEnjoy 4k Laser Projection Centrally Air Conditioned
మెగా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్
జగదాంబ 70ఎంఎం ఎ/సి - ఘట్‌కేసర్
సాయిపూజ - సూరారం | రామకృష్ణ 70 - ఆబిడ్స్ | ప్రశాంత్ - సికింద్రాబాద్
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

బెంజ్ కారు రంగుమార్చిన యజమానిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా బెంజ్ కారును ఆధునికీకరించిన యజమాని, మార్పులు చేసిన కంపెనీ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 11న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా నిర్లక్ష్యంగా వస్తున్న ఓ బెంజ్ కారును ఆపారు. ఆర్‌సీని పరిశీలించగా కారు వాస్తవ రంగు పోలార్ వైట్ కాగా, యజమాని సుజిత్ మార్పులు చేసినట్లు తేలింది. రంగు మార్చడంతో పాటు స్టిక్కరింగ్ వేయడంతో మోటార్ వెహికల్ చట్టాన్ని అతిక్రమించినట్లు పోలీసులు గుర్తించి జూబ్లీహిల్స్ శాంతి భద్రతల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సుజిత్‌తో పాటు కారును ఆధునికీకరించిన బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ది ర్యాప్ నిర్వాహకులపై మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.


శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

బర్డ్‌ఫ్లూ నుంచి కోళ్ల పరిశ్రమను కాపాడాలి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ నుంచి కోళ్ల పరిశ్రమను కాపాడటానికి పశువైద్య విశ్వవిద్యాలయంలోని కోళ్లశాస్త్ర విభాగం శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి సూచించారు. రాజేంద్రనగర్ పశువైద్య కళాశాలలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) సహకారంతో 10 రోజుల పాటు నిర్వహించనున్న స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కోళ్ల ఉత్పత్తుల అభివృద్ధి, సవాళ్లను ఎదుర్కోవడం ఎలా అనే అంశంపై ఈ శిక్షణ కొనసాగుతుంది. ఈ సందర్భంగా డాక్టర్ బి.గోపి మాట్లాడుతూ కోళ్ల పెంపకం పరిశ్రమను సహకార వ్యవస్థగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా అధిక లాభాలు వచ్చేలా చూడాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్ర, డీన్ ఫ్యాకల్టీస్ డాక్టర్ ఉదయ్‌కుమార్, పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.మాధురి పాల్గొని ప్రసంగించారు. పది రోజుల కోర్సు డైరెక్టర్లు డాక్టర్ దైద కృష్ణ, డాక్టర్ దాసరి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70ఎంఎం - నారాయణగూడ
లక్ష్మీకళ సినిప్లెడ్ - మూసాపేట్ | ఏ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినిప్లెడ్ - మూసాపేట్
DEEPA ARTS



సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
శ్రీకృష్ణ 70 - ఆదిబాబాద్ 11.00,2.00,6.00,9.00 | వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
DEEPA ARTS

విజయవంతమైన 5వ వారం



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
మల్లికార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

విజయవంతమైన 2వ వారం
BLOCKBUSTER LOVE TSUNAMI



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00
GEETHA FILM DISTRIBUTORS

SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4K Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30
శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర 70 - కర్నన్‌ఘాట్
11.15,2.30,6.15,9.30
విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45 | మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

నేడే చూడండి



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.15
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
అర్జున్ 70 - కూకట్‌పల్లి 11.00,2.00 | రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.30,2.30,6.30,9.30 | తాల్లూరి 70 - ఐఎస్‌సదన్ 11.15,6.15
GEETHA FILM DISTRIBUTORS


సరైన జాగ్రత్తలు తీసుకోకుండా వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న నిర్వాహకులు

కాళ్లతో తొక్కుతూ వెల్లుల్లి పేస్ట్ తయారీ

(5వ పేజీ తరువాయి)

దానిపై దృష్టి సారించగా అక్రమంగా వెల్లుల్లి పేస్ట్ తయారు చేసే కేంద్రంగా బయటపడింది. కార్మికులతో నానబెట్టిన వెల్లుల్లిని తొక్కిస్తూ పేస్టును తయారు చేస్తున్నట్లు తేలింది.

లైసెన్సు లేదు..

వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రం నిర్వాహకులకు కనీసం ఫుడ్ లైసెన్సు, లేబర్ లైసెన్సు, ఆహార ప్రాసెసింగ్ కోసం అవసరమైన ప్రభుత్వం ఆమోదించిన అధికారిక ధ్రువీకరణ పత్రాలు లేవని తెలిసింది. ఇలాంటి పేస్ట్ తయారీ కేంద్రాలు బయటపడడం మొదటిసారి కాదని, ఇతర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు వెలుస్తుండడం ఇక్కడ మామూలై పోయిందని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు వస్తున్నారని తెలిస్తే మకాం మరో చోటకు మారుస్తున్నారని చెబుతున్నారు.

ఫిర్యాదు చేస్తున్నా..

ఇది చట్టవిరుద్ధమైన పేస్ట్ తయారీ కేంద్రమని ఇటు పోలీసులకు, అటు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు తీసుకోవడంలో వారు విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. చట్టబద్ధత లేని పేస్టలను వంటకాల్లో వాడితే కచ్చితంగా అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నవారమవుతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యం దెబ్బతినకుండా అక్రమంగా వెలిసిన వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంతో పాటు ఇతర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లను మూసివేసేందుకు అధికార యంత్రాంగం కఠినమైన చర్యలు తీసుకోవాలని మూసానగర్ బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిలిచిన గోదావరి జలాలు

(5వ పేజీ తరువాయి)


కొండపాక వద్ద చేపడుతున్న గోదావరి పైపులైన్ల వాల్వుల బిగింపు పనులు

ప్రారంభించారు. ఫలితంగా నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సోమవారం ఉదయం 6గంటల నుంచి మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు పనులు జరగనుండగా.. ఆ తర్వాతే నగరానికి గోదావరి జలాల సరఫరాను పునరుద్ధరించనున్నారు. సోమవారం నీటి సరఫరా లేక పలు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ట్యాంకర్లను బుక్ చేశారు. ప్రస్తుతం రోజూ 4వేల ట్యాంకర్లను బుకింగ్ చేస్తుండగా, సోమవారం ట్యాంకర్లకు మరింత డిమాండ్ పెరిగింది. సోమవారం రాత్రి వరకు సుమారు 6వేల ట్యాంకర్లు బుక్ చేసినట్లు సమాచారం

ఐఐటీలను తలదన్నేలా జేఎన్‌టీయూ ఇన్నోవేషన్ పార్క్

(5వ పేజీ తరువాయి)

ప్రోత్సహించడం

- సాంకేతికత-ఆధారిత పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సౌకర్యాలను అందించడం
- నమూనాల అభివృద్ధి, పరీక్షల కోసం ఇక్కడి పరిశోధన సౌకర్యాలను అందించడం
- విద్యార్థులకు, అధ్యాపకులకు, సాంకేతికత- ఆధారిత పరిశ్రమలకు స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్) శిక్షణా కార్యక్రమాలను అందించడం
- పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణల కోసం కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలతో పాటు కన్సల్టింగ్, మెంటరింగ్ సహకారాన్ని అందించడం
- పరిశ్రమలకు, విద్యా సంస్థలకు టెక్నాలజీ, ఇన్నోవేషన్ అంశాల్లో సహకారం, ఉమ్మడిగా పరిశోధన ప్రాజెక్టులను ప్రోత్సహించడం.
- సమాజానికి పెద్దఎత్తున ఉపకరించే ఆవిష్కరణలు, వ్యాపారాలకు జాతీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లతో సహకారాన్ని అందించడం.

అన్నిటికీ మించి జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలలో ఆవిష్కరణలకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను పెంపొందించడం, అభివృద్ధి చేయడమే ఇన్నోవేషన్ పార్కు ప్రధాన లక్ష్యం కానుంది.

'స్టాండింగ్' ఏకగ్రీవమే?

(5వ పేజీ తరువాయి)

ఇద్దరు కార్పొరేటర్లు గతంలోనే నామినేషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో.. వారిని ఉపసంహరించుకోవాలని పార్టీ సూచించినట్టు ఓ నాయకుడు తెలిపారు. మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెడ్తామని బీరాలు పలికిన బీఆర్‌ఎస్.. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు దూరంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీపై ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ అధికారిక ప్రకటన చేయలేదు. ఒకవేళ ఆ పార్టీ కార్పొరేటర్లు నామినేషన్లు ఉపసంహరించుకోని పక్షంలో ఎన్నికల నిర్వహణ అనివార్యం కానుంది.

కాంగ్రెస్, ఎంఐఎం

పరస్పర అవగాహనలో భాగంగా కాంగ్రెస్, ఎంఐఎం స్టాండింగ్ కమిటీ సభ్యుల స్థానాలను పంచుకున్నాయి. 41 మంది కార్పొరేటర్లు ఉన్న ఎంఐఎం నుంచి ఎనిమిది మందికి, 24 మంది కార్పొరేటర్లున్న కాంగ్రెస్ నుంచి ఏడుగురికి అవకాశం కల్పించారు. గతంలో బీఆర్‌ఎస్, ఎంఐఎం స్టాండింగ్‌లో ఉండగా.. ఇప్పుడు కాంగ్రెస్, ఎంఐఎం కలవడం గమనార్హం.

వ్యవసాయ వర్సిటీ - ఐఐఆర్ఆర్ మధ్య అవగాహన ఒప్పందం


అవగాహన ఒప్పందాలను మార్చుకుంటున్న వ్యవసాయ వర్సిటీ, జాతీయ వరి పరిశోధనా సంస్థ ఉన్నతాధికారులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాల మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, ఐఐఆర్ఆర్ సంచాలకులు డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈసందర్భంగా డాక్టర్ జానయ్య మాట్లాడుతూ, వాతావరణ మార్పులకనుగుణంగా వ్యవసాయ పరిశోధనలు, ప్రాధాన్యత పద్ధతిలో చేపట్టాలన్నారు. వరిలో ఉత్పత్తి, ఉత్పాదకతల పెంపుతో పాటు రైతులకు, వినియోగదారులకు కూడా ప్రయోజనాలు కలిగించే విధంగా ఇరు సంస్థలు కలిసి పనిచేయాలన్నారు.

రాజేంద్రనగర్‌లో ద్రాక్ష మేళా


మేళాలో పాల్గొన్న డాక్టర్ డి.రాజిరెడ్డి తదితరులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ద్రాక్ష పరిశోధన స్థానంలో సోమవారం గ్రేప్ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర ద్రాక్ష రైతుల సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి, ప్రఖ్యాత ద్రాక్ష నిపుణులు డాక్టర్ ఎస్ డీ శిఖామణి, పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ద్రాక్ష పంటలో ఎదురవుతున్న సవాళ్లు, వాటి యాజమాన్య పద్ధతులపై చర్చించడం జరిగింది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ మార్కెట్, డిమాండ్‌ను అనుసరించి రకాలను ఎంచుకొని లాభ పడాలని సూచించారు. ద్రాక్ష పంటలో మానవ రహిత ట్రాక్టర్ వినియోగం కోసం భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో సీడీఏసీ సంస్థతో సంయుక్తంగా జరుగుతున్న పరిశోధన వివరాలను రైతులకు తెలియజేశారు. 40రకాల ద్రాక్ష రకాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు డాక్టర్ ఎ.భగవాన్, డాక్టర్ డి.లక్ష్మీనారాయణ, డాక్టర్ టి.సురేశ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కె.వెంకట రమేశ్, డాక్టర్ కె.ప్రభావతి పాల్గొన్నారు.

కర్పూరీ ఠాగూర్ జీవితం నేటి సమాజానికి స్ఫూర్తి


కర్పూరీ ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు, వీజీఆర్ నారగోని తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్లను 26 శాతం బీహార్‌లో అమలు చేసిన ఘనత కర్పూరీ ఠాగూర్‌దేనని పలువురు వక్తలు అన్నారు. బిహార్ రాష్ట్ర సీఎంగా నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. సోమవారం సూర్యలోక్ కాంప్లెక్స్‌లో కర్పూరీ ఠాగూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 37వ కర్పూరీ ఠాగూర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు, సీనియర్ జర్నలిస్టు వినయ్‌కుమార్, వీజీఆర్ నారగోని తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లారని, తర్వాత చరణ్‌సింగ్, జయప్రకాష్‌నారాయణ ఉద్యమాలలో సమాజ మార్పు కోసం పాటుపడ్డారని కొనియాడారు. కర్పూరీ ఠాగూర్ జీవితం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, గోపాల్‌సింగ్, బాలకృష్ణ, సత్యనారాయణ, డాక్టర్ రాజేష్, మహేశ్వర్‌రావు, శ్రీధర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దివంగత డాక్టర్ అశ్విని పేరుతో గోల్డ్ మెడల్

- రైతు కమిషన్ సభ్యుడు రాములు నాయక్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం ఖమ్మంలో వచ్చిన వరదల్లో తండ్రితో పాటు కొట్టుకుపోయిన డాక్టర్ అశ్విని పేరుతో గోల్డ్ మెడల్ ఇవ్వడానికి తాను కావాల్సిన రూ. 5లక్షలను ఇస్తానని మాజీ ఎమ్మెల్సీ, అగ్రికల్చరల్ కమిషన్ సభ్యుడు రాములు నాయక్ ప్రకటించారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాములు నాయక్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చదువుకొని శాస్త్రవేత్తగా ఎదగడంతో పాటు వర్సిటీలో ఆరు గోల్డ్ మెడల్స్‌ను సాధించిన డాక్టర్ అశ్వినిని మరిచిపోలేమన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం పొందిన ఆమె గత సంవత్సరం ఖమ్మంలో వచ్చిన వరదల్లో తండ్రితో పాటు కొట్టుకుపోయిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సూర్య ధనుంజయ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ అల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ కేబీ ఈశ్వరీ, డాక్టర్ బాలాజీ నాయక్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో వార్షికోత్సవ పూజలు

పహాడీషరీఫ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పండుగలను కుటుంబ సమేతంగా జరుపుకోవాలని బీజేవైఎం రంగా రెడ్డి జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ గౌడ్‌అన్నారు, సోమవారం మామిడిపల్లి సీఐఎస్ఎఫ్ పెద్దమ్మ ఆలయంలో వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. యువకులు పాశ్చాత్య సంస్కృతికి అలావటు పడి మన పండుగలను మరచిపోతున్నారని, తల్లి తండ్రులు ప్రతి పండుగ కుటుంబ సమేతంగా జరుపుకొని పండుగ ప్రముఖ్యతని పిల్లలను వివరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, రమేష్ గౌడ్, ఈసంపల్లి కృష్ణ గౌడ్, గుజ్జుల పద్మారావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివరాంపల్లిలోని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 18న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర నాయకులు దాసరి శ్యామ్ మనోహర్, కె.చంద్రయ్య, రమేశ్ మేడి, ఎన్.సోమ్లు, పి.ఆనంద్‌బాబు హాజరుకానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

టన్నెలింగ్ పనులు సమన్వయంతో చేపట్టాలి

- జోన్-3 సీవర్ నెట్‌వర్క్‌ప్రాజెక్టు పనుల పరిశీలనలో ఎండీ అశోక్‌రెడ్డి


టోలిచౌకి ఫ్లైఓవర్ ప్రధాన రహదారిలో చేపట్టే జంక్షన్ పనులను పరిశీలనలో ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జోన్-3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టులో భాగంగా టోలిచౌకి ఫ్లైఓవర్ ప్రధాన రహదారిలో చేపట్టే జంక్షన్ పనులను ఆటంకాలు లేకుండా చేపట్టాలని, టన్నెలింగ్ పనులు చేపట్టేటప్పుడు జీహెచ్ఎంసీ, ట్రాన్స్ కో, ట్రాన్స్ మిషన్, ఓ అండ్ ఎం అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్వహించాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి నిర్మాణ సంస్థను ఆదేశాలిచ్చారు. కోర్ సిటీలో మురుగు నీటి వ్యవస్థ ఆధునీకరణ కోసం చేపట్టిన జోన్-3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్‌తో కలిసి సమస్యాత్మకమైన ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్న పనులను పరిశీలించారు. టోలిచౌకి ఫ్లైఓవర్ ప్రధాన రహదారిలో చేపట్టే జంక్షన్ పనులను ఆటంకాలు కాకుండా ఎలా చేపట్టాలో చర్చించారు. ఇక్కడ ప్రధాన రహదారి వివిధ మతాల ఆలయాలు, లేబర్ అడ్డా కావడంతో పనులు చేపట్టడం అంత సులువు కాదని అంచనా వేశారు. దాదాపు 8నుంచి 11 మీటర్లు లోతులో జరిగే టన్నెలింగ్ పనులను ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రద్దీ లేని సమయాల్లో, సెలవు రోజుల్లో నిర్వహించాలని సూచనలు చేశారు. టన్నెలింగ్ పనులు చేపట్టేటప్పుడు జీహెచ్ఎంసీ, ట్రాన్స్ కో, జలమండలి ట్రాన్స్ మిషన్, ఓ అండ్ ఎం అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్వహించాలన్నారు. అక్కడక్కడ ట్రయల్ పిట్ ఏర్పాటు చేసుకుని భూగర్భంలో ఉన్న ఏమైనా పైప లైన్లు, కేబుళ్ల తదితరాలను అంచనా వేసుకుని వాటికి ఆటంకం కాకుండా పనులు నిర్వహించాలని సూచించారు. పనులు చేపట్టే సమయంలో సరైన బారికేడ్లు, రక్షణ పరికరాలను ధరించి భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అక్కడి నుంచి సమీపంలోని 7 టూంబ్స్ వెళ్లే రహదారిలో అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ పనులను ఎండీ పరిశీలించారు. మార్చి మొదటి వారం వరకు ఈ స్ట్రెచ్ పూర్తయ్యేలా రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టి వేగంగా చేయాలని ఆదేశించారు. గుడిమల్కాపూర్, లైన్స్ గిరకపల్లి తదితర ప్రాంతాల్లో పురోగతిలో ఉన్న పైపులైన్ విస్తరణ పనుల్ని పరిశీలించారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే.. రంజాన్ మాసంలో ముస్లింలకు ఇబ్బంది కలగకుండా.. పనులు చేపట్టి మే వరకు పూర్తి చేయాలని ఎండీ అశోక్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీజీఎం రాజేందర్, జీఎం కుమా ర్, ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నార్సింగ్: టోలిచౌకి మెయిన్‌రోడ్డు, ఎండీ లైన్స్, లక్ష్మీనగర్ మెయిన్‌రోడ్డు, గుడిమల్కాపూర్ మార్కెట్, కార్వాన్, జీయాగూడ ప్రాంతాల్లో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, ఎండీ అశోక్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఎమ్మెల్యే కౌసర్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగ లోపు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహ్మద్ నసీరొద్దీన్, స్వామియాదవ్, ఉస్మాన్ సిద్ధికీ, అమీరుద్దీన్ మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నుమాయిష్' ఆదాయంతో విద్యావ్యాప్తి

- ప్రభుత్వ తరపున సహకరిస్తాం
- మంత్రి ప్రభాకర్ స్పష్టీకరణ
- ముగింపు ఉత్సవాలకు హాజరైన పొన్నం



జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యేటా అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నుమాయిష్ ద్వారా వస్తున్న ఆదాయాన్ని వెనకబడిన తెలంగాణ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నెలకొల్పి, విద్యావ్యాప్తికి కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం రాత్రి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో గాంధీ సెంటనరీ హాల్ వేదికగా 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన-2025 నుమాయిష్ ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 46 రోజుల పాటు నిరవధికంగా నుమాయిష్ ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు లేకుండా ప్రశాంతంగా ముగిసిందన్నారు. అందుకు కృషి చేసిన సొసైటీ వర్గాలను ప్రత్యేకంగా అభినందించారు. యేటా నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవా కార్యక్రమం కింద విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఇక ప్రభుత్వపరంగా కూడా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. దేశ, విదేశాల్లో మున్ముందు మరింత ఆదరణ పొందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈసారి దేశ, విదేశాల నుంచి లక్షల మంది సందర్శకులు వచ్చారన్నారు. అనంతరం ఉత్తమ స్టాళ్ల యజమానులు, అధికారులు, ఇతరులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ శివసేనారెడ్డి, తెలంగాణ మైనారిటీస్ గురుకులాల విద్యాసంస్థల సొసైటీ చైర్మన్ ఫయిమ్ ఖురేషి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు నిరంజన్, సురేందర్ రెడ్డి, డి. మోహన్, ప్రభాశంకర్, రవీయాదవ్ పలువురు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు టర్నింగ్ పాయింట్


విద్యార్థులతో కలిసి బెంచ్‌పై కూర్చున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి టర్నింగ్ పాయింట్ అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సికింద్రాబాద్‌లోని నల్లగుట్ట (ఓల్డ్) ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... స్కూల్ ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చూడాలని, పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై భయం వీడి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. గత ప్రశ్నాపత్రాలను ప్రాక్టీస్ చేస్తే అవగాహన ఏర్పడుతోందన్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ శ్రీధర్, డీఐఎస్‌లు గుండప్ప, స్వరూప, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను పెండింగ్ పెట్టొద్దు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమ స్యలపై 546 మంది దరఖాస్తులు అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తమ విభాగాలకు వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిష్కరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, వివిధ శాఖల అధికారులు పవన్ కుమార్, కోటాజీ, డీఎంహెచ్ఓ వెంకటి, సుబ్రహ్మ ణ్యం, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి ఎగ్జిబిషన్‌లో 'ఇందిరా ప్రియదర్శిని' విద్యార్థులు



ఎగ్జిబిషన్‌ను సందర్శించిన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్‌ను నగరంలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సోమవారం సందర్శించారు. ప్రొఫెసర్ అమర్త్యసేన్, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పావని, హాజీరాబేగం నేతృత్వంలో 75 మంది స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా వస్తువుల డిమాండ్- సరఫరా, ఆదాయ వివరాలను సేకరించేందుకు 12 గ్రూపులుగా ఏర్పడ్డారు. నిర్దేశిత ప్రశ్నావళి సాయంతో విషయ సేకరణ చేపట్టారు. స్టాళ్లలో సేకరించిన వివరాలను విశ్లేషించి తమ బృంద ప్రాజెక్టులో పొందుపరచనున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఆర్థిక కమిటీ ఉపాధ్యక్షుడు ఆదిత్య మరుగం.. 46 రోజులు నిర్వహించిన ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయం, దానిని విద్యాసంస్థలకు వినియోగిం చే విషయాలను విద్యార్థినులకు వివరించారు. కళాశాల అధ్యాపకులు సునీత, భీమమ్మ, ఉస్మాన్, చంద్రయ్య పాల్గొన్నారు.

తొలగించిన 26 కులాలను బీసీ జాబితాలో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్ల రామకృష్ణ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్న 26 కులాలను గత కేసీఆర్ ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆ కులాలను బీసీ జాబితాలో చేర్చాలని తొలగించిన 26 కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. గత పదేళ్లగా బీఆర్ఎస్ ప్రభుత్వం 26 బీసీ కులాలకు అన్యాయం చేసిందని కేసీఆర్ జన్మదినం తెలంగాణకు దుర్దినమని ఆయన మండిపడ్డారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 26 కులాలను తొలగించడం వల్ల ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీల జనాభా తగ్గి ఓసీల జనాభా పెరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచిందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. 26 కులాలు బీసీ జాబితాలో చేరిస్తేనే విద్య, ఉద్యోగ రంగాలలో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.కృష్ణప్రసాద్, చిత్తూరు వేణు, ప్రసాద్, ఎం.చంద్రశేఖర్, బి.రమణమూర్తి, భాస్కర్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/heZx41kలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

మోచీ కులస్తులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్.రాజమౌళి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): లిడ్ క్యాప్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మోచీ కులస్తులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సమగర (మోచీ) కుల సంఘం తెలంగాణ విజ్ఞప్తి చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సీ.హెచ్.రాజమౌళి, అధ్యక్షుడు ఎం.భాస్కర్, ప్రధాన కార్యదర్శి బి.సోమురాజు, గౌరవ అధ్యక్షుడు ఎస్.దశరథ్, వైస్ చైర్మన్ ఆర్.వగరాయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హెచ్.రవీందర్‌లు మాట్లాడారు. మోచీ కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం బీ క్యాటగిరిలో చేర్చి 9శాతం రిజర్వేషన్లను కల్పించడం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగలకు మోచీ కులస్తులు రుణపడి ఉన్నారన్నారు. వర్గీకరణ ఫలాలను 57ఉప కులాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని కోరారు. రాబోయే రోజుల్లో మోచీ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ నివేదికలో లోపాలు


సమావేశంలో అభివాదం చేస్తున్న మంద కృష్ణమాదిగ, ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ విచారణ శాస్త్రీయంగా జరగలేదని, లోపాలు సరిదిద్దుకోవడానికి కమిషన్‌కు మరో పది రోజులు గడువు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ సూచించారు. లోపాలతో కూడిన నివేదికను అసెంబ్లీలో ఆమోదించారని విమర్శించారు. వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు, డోర్ కులం వేర్వేరు అయినా తమ కులవృత్తి ఒక్కటేనని, అత్యంత వెనుకబడిన డోర్ కులాన్ని గ్రూపు-2లో తమతో కలపకుండా అభివృద్ధి చెందిన కులాలు ఉన్న గ్రూపు-3లో కలపడం దారుణమన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలోని అంశాలను సబ్ కమిటీ అధ్యయనం చేసిందా లేదా అని ఆయన ప్రశ్నించారు. ఈ నివేదికతో కొన్ని కులాలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ నెల 7న తాము తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా జరిగిన వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించిందని ఆరోపించారు. దళితులలో ఏ కులాన్ని ఏ గ్రూపులో చేర్చాలి, ఏ కులానికి ఎంత శాతం రిజర్వేషన్ కేటాయించాలనే విషయంలో కమిషన్ విచారణ శాస్త్రీయంగా జరగలేదని విమర్శించారు. పొరపాట్లను సరి చేయడానికి కమిషన్‌కు మరో పది రోజుల సమయం ఇవ్వాలని, ఆయన నివేదిక ఇచ్చిన తరువాత ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ 48 గంటలు అధ్యయనం చేసి లోపాలు ఏమైనా ఉంటే సరి చేసి క్యాబినెట్‌కు పంపించాలని సూచించారు. వెనుకబడిన వారిని దోచుకోవడానికి అభివృద్ధి చెందిన కులాలను గ్రూపు-1లో చేర్చారన్నారు. మాజీ ఎంపీ బి.వెంకటేష్ నేత, వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దత్తు పోలె, నాయకులు ఉమేష్, వినోద్ చోగ్లె, ముకేశ్, రాజు గజిరె, నర్సింగ్ గైక్వాడ్ పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

- ఐదు కిలోల మత్తుపదార్థం స్వాధీనం చేసుకున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చార్మినార్ ప్రాంతంలోని దరూల్‌షరీఫ్ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ ఏ టీం ఎక్సైజ్ పోలీసులు సోమవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గంజాయి అమ్మకాలు జరుపుతున్న సదన్ ఖాన్, షేక్ సజ్జలీ, అజీజ్ అహ్మద్ ఖాన్‌లను అరెస్ట్ చేశారు. వీరు ఒడిషాకు చెందిన ఎస్కే దన అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి 2.60 కిలోల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు ప్రధాన నిందితుడు ఎస్కే దన పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ ఎస్టీఎఫ్ టీమ్‌లీడర్ అంజిరెడ్డి తెలిపారు. సనత్‌నగర్ బీకేగూడ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం తనిఖీలు ప్రారంభించింది. గంజాయి విక్రయాలు చేస్తున్న వెస్ట్‌గోదావరి జిల్లాకు చెందిన మామిడి స్వర్ణరాజు కుమార్, వెంకట రామకృష్ణ, బాబు అలియాస్ వినిలను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.2.50 కిలోల గంజాయితో పాటు బైకును స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న కర్ణాటకకు చెందిన అక్షయ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని ఎక్సైజ్ పోలీసులు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తిపై పెట్టీ కేసు

- 10 రోజుల జైలు శిక్ష


నిందితుడు సభావత్ విజయ్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా అర్ధరాత్రి సంచరిస్తున్న వ్యక్తిపై పెట్టీ కేసు నమోదు చేయగా, న్యాయస్థానం పది రోజుల జైలు శిక్ష విధించినట్టు ఫలకనుమా ఇన్‌స్పెక్టర్ కె.ఆదిరెడ్డి తెలిపారు. జంగంమేట్ రవీంద్ర నాయక్ నగర్ కాలనీకి చెందిన సభావత్ విజయ్ ఆదివారం రాత్రి దొంగతనం చేయడానికి రెక్కీ నిర్వహిస్తూ అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు గమనించి అదుపులోకి తీసుకున్నారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో కేసు నమోదు చేసి గురువారం నాంపల్లిలోని 9వ స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ ఎం.మురళి 10 రోజుల జైలు శిక్ష విధించినట్టు ఇన్‌స్పెక్టర్ కె. ఆదిరెడ్డి తెలిపారు.

కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు


ఉప్పర్‌పల్లిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ అధ్యక్షుడు పొరెడ్డి ధర్మారెడ్డి


చాంద్రాయణగుట్టలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు నరేష్ కుమార్, తదితరులు


లక్ష్మీగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


జల్‌పల్లిలో కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఉప్పుగూడలో కేసీఆర్ చిత్రపటానికి కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ ఉద్యమ నాయకులు, అడ్వకేట్ శ్రీనివాస్


పురాని హవేలిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఆ పార్టీ చార్మినార్ ఇన్‌చార్జి సలావుద్దీన్ లోధి, నాయకులు


రంగనాయకుల కాలనీ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్/ చార్మినార్/ చాంద్రాయణగుట్ట/ పహాడీషరీఫ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్‌లో బీఆర్ఎస్ నాయకులు పాఠశాలల్లో, ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. ఉప్పర్‌పల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఆవరణలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు పొరెడ్డి ధర్మారెడ్డి, ఎస్.వెంకటేశ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, వి.ప్రీతమ్‌రాజ్, వీర్లపల్లి నవీన్, మంజుల, సుల్తానా, తదితరులు పాల్గొన్నారు. జల్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంచి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫుద్దీన్ హమేద్, యంజాల జనార్దన్, మాజీ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు పల్లపు శంకర్, షైక్ అఫ్జల్, నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628

చార్‌ధామ్ యాత్రకు భారత్ గౌరవ్ రైలు



యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాల్ మిశ్రా, రమేశ్ అయ్యంగార్ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చార్‌ధామ్ (బద్రీనాథ్, కేదారనాథ్, గంగోత్రి, యమునోత్రి) యాత్రకు వెళ్లాలనుకునే వారి కోసం తొలిసారిగా 'భారత్ గౌరవ్ ట్రైన్'ను ప్రవేశపెడుతున్నామని ఉత్తరాఖండ్ ప్రభుత్వ సంస్థ గఢ్వాల్ మండల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(జీఎంవీఎన్) మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ మిశ్రా తెలిపారు. సోమవారం పర్యాటక భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చార్‌ధామ్ యాత్రకు సంబంధించిన అంశాలను వివరించారు. ప్రత్యేక పర్యాటక రైలు హరిద్వార్, యమునోత్రి, గంగోత్రి, కేదారనాథ్, బద్రీనాథ్ ప్రాంతాలను కవర్ చేస్తుందన్నారు. 16 రోజుల ప్యాకేజీ టూర్ మే 8, 2025న ప్రారంభమవుతుందని, బుకింగ్‌లు తెరిచి ఉంచామన్నారు. రైలులో 1ఏసీ, 2ఏసీ, 3ఏసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు ఎల్టీసీ, ఎల్ఎఫ్‌సీ సౌకర్యం కింద ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

థర్డ్ ఏసీకి రూ.70,500, 2ఏసీకి రూ.75,500, ఫస్ట్ ఏసీకి రూ.82,500 చార్జీలు నిర్ణయించామని తెలిపారు. ఆసక్తిగలవారు. బుకింగ్, ఇతర సమాచారం కోసం 9160021414, 9160091414 మొబైల్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో టూర్ టైమ్స్ సంస్థ రీజనల్ మేనేజర్ రమేశ్ అయ్యంగార్ పాల్గొన్నారు.

यूनियन बैंक / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కృష్ణానగర్ శాఖ
ప్లాట్ నం.145, ఫేజ్-2, కమలాపురి కాలనీ, కృష్ణానగర్, హైదరాబాద్ - 500073

సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

దిగువ వారికి: రుణగ్రహీతలు : శ్రీ కాకలీవర్ సురేష్, తండ్రి స్వర్గీయ రామ్‌కిషన్, ఫ్లాట్ నం.201/ఎ, రెండవ అంతస్తు, "శ్రేయ హోమ్స్", ప్లాట్ నం.473, M-II, సర్వే నం.లు 120 (కొత్త), షేక్‌పేట్ గ్రామం, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, రోడ్ నం.87, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. శ్రీమతి కాకలీవర్ రోహిణి, భర్త శ్రీ కాకలీవర్ సురేష్, ఫ్లాట్ నం.జి-2, రెండవ అంతస్తు, "శ్రేయ హోమ్స్", ప్లాట్ నం.473, M-II, సర్వే నం.లు 120 (కొత్త), షేక్‌పేట్ గ్రామం, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, రోడ్ నం.87, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. శ్రీ కాకలీవర్ సురేష్, తండ్రి స్వర్గీయ రామ్‌కిషన్, ఫ్లాట్ నం.102, బీవీఆర్ రెసిడెన్సీ, నవోదయ కాలనీ, గణపతి కాంప్లెక్స్ ఎదురుగా, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500073. శ్రీమతి కాకలీవర్ రోహిణి, భర్త శ్రీ కాకలీవర్ సురేష్, ఫ్లాట్ నం.102, బీవీఆర్ రెసిడెన్సీ, నవోదయ కాలనీ, గణపతి కాంప్లెక్స్ ఎదురుగా, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500073. **తనఖాదారు:** శ్రీ కాకలీవర్ సురేష్, తండ్రి స్వర్గీయ రామ్‌కిషన్, ఫ్లాట్ నం.201/ఎ, రెండవ అంతస్తు, "శ్రేయ హోమ్స్", ప్లాట్ నం.473, M-II, సర్వే నం.లు 120 (కొత్త), షేక్‌పేట్ గ్రామం, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, రోడ్ నం.87, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. **తనఖాదారు:** శ్రీ కాకలీవర్ సురేష్, తండ్రి స్వర్గీయ రామ్‌కిషన్, ఫ్లాట్ నం.102, బీవీఆర్ రెసిడెన్సీ, నవోదయ కాలనీ, గణపతి కాంప్లెక్స్ ఎదురుగా, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500073.

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లో సెక్షన్ 13(3)తో చదవబడు సెక్షన్ 13(2) క్రింద ప్రకటన.

సర్/మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (3)తో చదవబడు సెక్షన్ 13(2) క్రింద ప్రకటన. మీరు చిరునామాలు నం.1 & 2 అయిన మీరు మా కృష్ణానగర్ శాఖ నుండి క్రింది రుణ సౌకర్యాలను పొందారు, బకాయిలు/ఇన్‌స్టాల్‌మెంట్/ వడ్డీలు/ఖాతాలను సంతృప్తిపరంగా నిర్వహించడంలో విఫలమైనారు. ఆదాయ గుర్తింపు మరియు ప్రూడెన్షియల్ అకౌంటింగ్ నిబంధనలకు సంబంధించిన ఆర్‌బిఐ మార్గదర్శకాలు, మీ ఖాతాలు 28.01.2025 నాటికి, మీ ఖాతా నం.555306650000148 నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడ్డాయి. మీ యొక్క ఖాతాలోని మిగులు బకాయిలు 30.12.2024 నాటికి మొత్తం రూ. 95,59,211.01/- (రూపాయలు తొంభై ఐదు లక్షల యాభై తొమ్మిది వేల రెండు వందల పదకొండు మరియు ఒక పైసా మాత్రమే) పైన పేర్కొన్న ఖాతాలు బ్యాంకుకు సంబంధించి మీ నం. 1 & 2 నుండి చెల్లించాల్సిన మొత్తం వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

సౌకర్య రకం	ఎన్‌పిఏ తేది అవగా 30.12.2024 నాటికి బకాయి మొత్తం	వర్తింప బడని వడ్డీ w.e.f. 30.12.2024	అపరాధ వడ్డీ (సరళమైన)	బ్యాంక్ ద్వారా భరించే ఖర్చు/చార్జీలు	మొత్తం బకాయిలు
యూనియన్ హోమ్	రూ.95,59,211.01	రూ.2,59,314.20	-	-	రూ. 98,18,525.21
మొత్తం బకాయిలు (రూపాయలు తొంభై ఎనిమిది లక్షల పద్దెనిమిది వేల ఐదు వందల ఇరవై ఐదు మరియు ఇరవై ఒక్క పైసలు మాత్రమే)					రూ. 98,18,525.21

బ్యాంకుకు చెల్లించవలసిన బకాయిలు లేదా చెల్లించాల్సిన రుణం తిరిగి చెల్లించడం కొరకు శ్రీ కాకలీవర్ సురేష్, తండ్రి స్వర్గీయ రామ్‌కిషన్ మరియు శ్రీమతి కాకలీవర్ రోహిణి భర్త శ్రీ కాకలీవర్ సురేష్ వారు 28.05.2017న డాక్యుమెంట్లను అమలు చేశారు మరియు దిగువ వివరించిన స్థిరాస్తిని తనఖా ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్ సృష్టించారు. దిగువ వివరాలు తెలుపబడినవి.

ఆస్తి షెడ్యూలు

షెడ్యూలు "A" ఆస్తి: ఎం.సి.హెచ్. వార్డ్ నం.8 & బ్లాక్ నం.2 పరిధులలోని, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, జూబిలీహిల్స్, రోడ్ నం.87 వద్ద జూబిలీహిల్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆమోదిత లేఅవుట్‌లోని 662 చ.మీటర్లకు సమానమైనట్టి 792 చ.గజాలు విస్తీర్ణం కలిగిన, హకీంపేట గ్రామంలోని 102/1 మరియు షేక్ పేట్ గ్రామంలోని సర్వే నం.లు 403/1 (పాత), 120 కొత్తలో భాగంగా ఏర్పడిన నం. 473-M-III కలిగిన ప్లాట్ ఆస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: 15.25 (ఎం) వెడల్పు రోడ్ నం. 87, దక్షిణం: సరిహద్దు లైన్,తూర్పు: ప్లాట్ నం. 473-ఎన్, పశ్చిమం: సరిహద్దు లైన్లు.

షెడ్యూలు "B" ఆస్తి: ఎం.సి.హెచ్. వార్డ్ నం. 8 & బ్లాక్ నం.2 పరిధులలోని, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, జూబిలీహిల్స్, రోడ్ నం.87 వద్ద జూబిలీహిల్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆమోదిత లేఅవుట్‌లోని హకీంపేట గ్రామంలో 102/1 మరియు షేక్ పేట్ గ్రామంలోని సర్వే నంబర్లు 403/1 (పాత) మరియు 120 కొత్త లలో భాగంగా ఏర్పడిన నం.473-M-III కలిగిన ప్లాట్ వద్ద గల 792 చదరపు గజాల మొత్తంలో అవిభాజ్య భూమి వాటా 60 చ.గజాలతోపాటు 2550 చదరపు అడుగులు (కార్ పార్కింగ్ మరియు కామన్ ఏరియా కలుపుకుని) విస్తీర్ణం కలిగిన శ్రేయ హోమ్స్‌లోని రెండవ అంతస్తు లోని భవనంలో ఫ్లాట్ నం.201ఎ ఆస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: లిఫ్ట్ & మెట్లు, తూర్పు:కారిడార్ మరియు ఖాళీ, పశ్చిమం: ఖాళీ.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం, మీరు వ్రాసుకొనబడినట్టి రుణ డాక్యుమెంట్ల నియమనిబంధనల ప్రకారం బకాయి మొత్తం రూ.95,59,211.01 (రూపాయలు తొంభై ఐదు లక్షల యాభై తొమ్మిది వేల రెండు వందల పదకొండు మరియు ఒక్క పైసా మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేట్ వంతున తదుపరి వడ్డీ మరియు చార్జీలతో కలిపి, ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజుల్లోగా పూర్తి బకాయిలు చెల్లించవలసిందిగా మిమ్మల్ని ఇందుమూలంగా కోరడమైనది, లేనిచో సదరు చట్టం క్రింద ఇవ్వబడిన ఏదేని లేదా అన్ని హక్కులను వినియోగించుకొనుట ద్వారా పైన తెలిపిన సెక్యూరిటీలను స్వాధీనం చేసుకొనుట మాకు తప్పనిసరి అవుతుంది.

చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం ఈ ప్రకటన స్వీకరణ మీదట, బ్యాంక్ అనుమతి లేకుండా పైన తెలిపిన సెక్యూరిటీల విక్రయం నుండి వ్యవహరించుట నుండి మీరు నిరోధించబడినారు/ఆపబడినారు.

సదరు సెక్యూరిటీలను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున SARFAESI చట్టంలోని సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలు గమనించవలసిందిగా మీరు కోరబడుతున్నారు.

తేది: 10.02.2025
ప్రదేశం: హైదరాబాద్
అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కృష్ణానగర్ శాఖ
ప్లాట్ నం.145, ఫేజ్-2, కమలాపురి కాలనీ, కృష్ణానగర్, హైదరాబాద్ - 500073

సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

దిగువ వారికి: రుణగ్రహీతలు : శ్రీమతి కాకలీవర్ రోహిణి, భర్త శ్రీ కాకలీవర్ సురేష్, ఫ్లాట్ నం.జి-2, గ్రౌండ్ ఫ్లోర్, "శ్రేయ హోమ్స్", ప్లాట్ నం.473, M-II, సర్వే నం.లు 120 (కొత్త), షేక్‌పేట్ గ్రామం, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, రోడ్ నం.87, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. శ్రీ కాకలీవర్ సురేష్, తండ్రి స్వర్గీయ రామ్‌కిషన్, ఫ్లాట్ నం.201/ఎ, రెండవ అంతస్తు, "శ్రేయ హోమ్స్", ప్లాట్ నం.473, M-II, సర్వే నం.లు 120 (కొత్త), షేక్‌పేట్ గ్రామం, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, రోడ్ నం.87, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. శ్రీమతి కాకలీవర్ రోహిణి, భర్త శ్రీ కాకలీవర్ సురేష్, ఫ్లాట్ నం.102, బీవీఆర్ రెసిడెన్సీ, నవోదయ కాలనీ, గణపతి కాంప్లెక్స్ ఎదురుగా, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500073. 2) శ్రీ కాకలీవర్ సురేష్, తండ్రి స్వర్గీయ రామ్‌కిషన్, ఫ్లాట్ నం.102, బీవీఆర్ రెసిడెన్సీ, నవోదయ కాలనీ, గణపతి కాంప్లెక్స్ ఎదురుగా, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500073. **తనఖాదారులు:** శ్రీమతి కాకలీవర్ రోహిణి, భర్త శ్రీ కాకలీవర్ సురేష్, ఫ్లాట్ నం.201/ఎ, రెండవ అంతస్తు, "శ్రేయ హోమ్స్", ప్లాట్ నం.473, M-II, సర్వే నం.లు 120 (కొత్త), షేక్‌పేట్ గ్రామం, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, రోడ్ నం.87, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. **తనఖాదారు:** శ్రీమతి కాకలీవర్ రోహిణి, భర్త శ్రీ కాకలీవర్ సురేష్, ఫ్లాట్ నం.102, బీవీఆర్ రెసిడెన్సీ, నవోదయ కాలనీ, గణపతి కాంప్లెక్స్ ఎదురుగా, యూసుఫ్‌గూడ, హైదరాబాద్-500073.

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (3)తో చదవబడు సెక్షన్ 13(2) క్రింద ప్రకటన.

సర్/మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (3)తో చదవబడు సెక్షన్ 13(2) క్రింద ప్రకటన. మీరు చిరునామాలు నం.1 & 2 అయిన మీరు మా కృష్ణా నగర్ శాఖ నుండి క్రింది రుణ సౌకర్యాలను పొందారు, తదనంతరం మా బ్రాంచ్ బదిలీ చేయబడిన బకాయిలు/ఇన్‌స్టాల్‌మెంట్/ వడ్డీలు/ఖాతాలను సంతృప్తిపరంగా నిర్వహించడంలో విఫలమైనారు. ఆదాయ గుర్తింపు మరియు ప్రూడెన్షియల్ అకౌంటింగ్ నిబంధనలకు సంబంధించిన ఆర్‌బిఐ మార్గదర్శకాలు, మీ ఖాతాలు 28.01.2025 నాటికి, మీ ఖాతా నం.553906650000145 నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడ్డాయి. మీ యొక్క ఖాతాలోని మిగులు బకాయిలు 30.12.2024 నాటికి మొత్తం రూ.67,99,045.65/- (రూపాయలు అరవై ఏడు లక్షల తొంభై తొమ్మిది వేల నలభై ఐదు మరియు అరవై ఐదు పైసలు మాత్రమే) పైన పేర్కొన్న ఖాతాలు బ్యాంకుకు సంబంధించి మీ నం. 1 & 2 నుండి చెల్లించాల్సిన మొత్తం వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

సౌకర్య రకం	ఎన్‌పిఏ తేది అవగా 30.12.2024 నాటికి బకాయి మొత్తం	వర్తింప బడని వడ్డీ w.e.f. 30.12.2024	అపరాధ వడ్డీ (సరళమైన)	బ్యాంక్ ద్వారా భరించే ఖర్చు/చార్జీలు	మొత్తం బకాయిలు
యూనియన్ హోమ్	రూ. 54,04,549.23	రూ. 1,58,626.44	-	-	రూ. 55,63,175.67
యూనియన్ తనఖా	రూ. 13,94,496.42	రూ. 55,958.38	-	-	రూ. 14,50,454.80
మొత్తం బకాయిలు (రూపాయలు డెబ్బై లక్షల పదమూడు వేల ఆరు వందల ముప్పై మరియు నలభై ఏడు పైసలు మాత్రమే)					రూ. 70,13,630.47

బ్యాంకుకు చెల్లించవలసిన బకాయిలు లేదా చెల్లించాల్సిన రుణం తిరిగి చెల్లించడం కొరకు శ్రీమతి కాకలీవర్ రోహిణి భర్త శ్రీ కాకలీవర్ సురేష్ మరియు శ్రీ కాకలీవర్ సురేష్, తండ్రి స్వర్గీయ రామ్‌కిషన్ వారు 28.03.2017న డాక్యుమెంట్లను అమలు చేశారు మరియు దిగువ వివరించిన స్థిరాస్తిని తనఖా ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్ సృష్టించారు. దిగువ వివరాలు తెలుపబడినవి.

ఆస్తి షెడ్యూలు

షెడ్యూలు "A" ఆస్తి : M.C.H. వార్డ్ నం.8 & బ్లాక్ నం.2 పరిధులలోని, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, జూబిలీహిల్స్, రోడ్ నం.87 వద్ద జూబిలీహిల్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆమోదిత లేఅవుట్‌లోని 662 చ.మీటర్లకు సమానమైనట్టి 792 చ.గజాలు విస్తీర్ణం కలిగిన, హకీంపేట గ్రామంలోని 102/1 మరియు షేక్ పేట్ గ్రామంలోని సర్వే నం.లు 403/1 (పాత), 120 కొత్తలో భాగంగా ఏర్పడిన నం. 473-M-III కలిగిన ప్లాట్ ఆస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: 15.24 (ఎం) వెడల్పు రోడ్ నం. 87, దక్షిణం: సరిహద్దు లైన్,తూర్పు: ప్లాట్ నం. 473-ఎన్, పశ్చిమం: సరిహద్దు లైన్లు.

షెడ్యూలు "B" ఆస్తి : M.C.H. వార్డ్ నం. 8 & బ్లాక్ నం.2 పరిధులలోని హైదరాబాద్, జూబిలీహిల్స్, రోడ్ నం.87 వద్ద జూబిలీహిల్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆమోదిత లేఅవుట్‌లోని హకీంపేట గ్రామంలో 102/1 మరియు షేక్ పేట్ గ్రామంలోని సర్వే నంబర్లు 403/1 (పాత) మరియు 120 కొత్త లలో భాగంగా ఏర్పడిన నం.473-M-III కలిగిన ప్లాట్ వద్ద గల 662 చ.మీటర్లకు సమానమైన 792 చదరపు గజాల మొత్తంలో అవిభాజ్య భూమి వాటా 79 చ.గజాలతోపాటు 2550 చదరపు అడుగులు (రెండు కార్ పార్కింగ్‌లు మరియు ఒక పని వారి నివాసం కామన్ ఏరియాలు కలుపుకుని) విస్తీర్ణం కలిగిన శ్రేయ జూబిలీ హైట్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని భవనంలో ఫ్లాట్ నం.జి+2 ఆస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: కారిడార్, దక్షిణం: ఖాళీ, తూర్పు: ఖాళీ, పశ్చిమం: ఖాళీ.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం, మీరు వ్రాసుకొనబడినట్టి రుణ డాక్యుమెంట్ల నియమనిబంధనల ప్రకారం బకాయి మొత్తం రూ.67,99,045.65 (రూపాయలు అరవై ఏడు లక్షల తొంభై తొమ్మిది వేల నలభై ఐదు మరియు అరవై ఐదు పైసలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేట్ వంతున తదుపరి వడ్డీ మరియు చార్జీలతో కలిపి, ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజుల్లోగా పూర్తి బకాయిలు చెల్లించవలసిందిగా మిమ్మల్ని ఇందుమూలంగా కోరడమైనది, లేనిచో సదరు చట్టం క్రింద ఇవ్వబడిన ఏదేని లేదా అన్ని హక్కులను వినియోగించుకొనుట ద్వారా పైన తెలిపిన సెక్యూరిటీలను స్వాధీనం చేసుకొనుట మాకు తప్పనిసరి అవుతుంది.

చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం ఈ ప్రకటన స్వీకరణ మీదట, బ్యాంక్ అనుమతి లేకుండా పైన తెలిపిన సెక్యూరిటీల విక్రయం నుండి వ్యవహరించుట నుండి మీరు నిరోధించబడినారు/ఆపబడినారు.

సదరు సెక్యూరిటీలను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున SARFAESI చట్టంలోని సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలు గమనించవలసిందిగా మీరు కోరబడుతున్నారు.

తేది: 10.02.2025, ప్రదేశం: హైదరాబాద్ — అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


సృజనాత్మకం

● ఆకట్టుకున్న 'ఆర్ట్' ఎగ్జిబిషన్

● 20న గవర్నర్ చేతుల మీదుగా విజేతలకు అవార్డులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేల మాటలు చెప్పలేని భావాన్ని ఓ చిత్రం చెబుతుందంటారు. నుమాయిష్‌లో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రదర్శించిన వార్షిక ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను చూస్తే అది నిజమే అనిపిస్తుంది. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 253 మంది కళాకారులు తమదైన సృజనాత్మకతను చూపుతూ రూపొందించిన కళాఖండాలలో ఎంపిక చేసిన 20కు పైగా చిత్రాలతో తీర్చిదిద్దిన ప్రదర్శన కనువిందు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక కళాకారులకు తగిన అవకాశాలను కల్పిస్తూ హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఏటా ప్రదర్శనలను నిర్వహిస్తోంది. 1941లో నవాబ్ సాలార్‌జంగ్ అధ్యక్షుడిగా ప్రారంభమైన ఈ సొసైటీ అప్పటి నుంచి కళాకారులను ప్రోత్సహిస్తూనే ఉంది. 84 ఏళ్లుగా తాము ఏటా ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామని హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రస్తుత అధ్యక్షులు ఎంవీ రమణా రెడ్డి తెలిపారు. ఈసారి దేశవ్యాప్తంగా పోటీపడిన 253 ఎంట్రీల నుంచి 200 కళాఖండాలను ప్రదర్శించామని, వీటి నుంచి 35 మంది ఆర్టిస్ట్‌లకు నగదు బహుమతులను అందించడంతో పాటుగా ప్రశంసా బహుమతులను అందజేయబోతున్నామన్నారు. ఈ నెల 20న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదగా అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.

అవార్డులకు ఎంపికైన కొన్ని చిత్రాలను పరిశీలిస్తే..



విశ్వాధిపతి: సృష్టించేది తానే, నాశనం చేసేదీ తానే అని భగవంతుడు చెప్పాడు కానీ, నాశనం చేసే అవకాశం భగవంతుడికి మన మివ్వడం లేదేమోననిపిస్తోంది తెలంగాణకు చెందిన పులి విజయ కిశోర్ రచించిన 'విశ్వాధిపతి' చిత్రం చూసిన తరువాత. కోల్డ్ ప్రెస్ట్ పేపర్‌పై వాటర్ కలర్స్‌తో ఆమె రచించిన ఈ చిత్రం ప్రకృతి సోయగాలను హృద్యంగా చూపుతుంది. అదే సమయంలో సూర్య గమనం మీదనే ఆధారపడ్డ మన బతుకునూ వివరిస్తుంది. ఆర్ట్ సొసైటీ నిర్వహించిన ప్రదర్శనలో ఈ చిత్రానికి బంగారు పతకం లభించింది.

నో టైమ్.. నో పీస్



నేటి సమకాలీన జీవన శైలిని కాన్వాస్‌పై అందంగా ఆవిష్కరించారు 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆర్టిస్ట్ అక్బర్ మొహమ్మద్. బిజీ బిజీ బతుకులు.. నిద్ర లేచింది మొదలు సామాజిక మాధ్యమాలతో వెతలు.. అన్నట్లుగా సాగిపోతున్న నవతరపు జీవనశైలిని అందంగా 'నో టైమ్ నో పీస్' అంటూ ఒడిసిపట్టే ప్రయత్నం చేశారు. నీ జీవితం మొబైల్ ఫోన్‌కే అంకితమా అని కాన్వాస్‌పై ఎక్రిలిక్ శైలిలో చూపిన తీరుకు ఆయనకు బెస్ట్ అవార్డును తెచ్చింది.



మై మదర్

తెలంగాణ గ్రామీణ చిత్రాన్ని అందంగా ఆవిష్కరిస్తోందీ చిత్రం. 'మై మదర్' అంటూ వర్ధమాన కళాకారిణి పాలనాటి లావణ్య, కాన్వాస్‌పై ఎక్రిలిక్ శైలిలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరు, ఉపయోగించిన రంగులు ప్రతి ఒక్కటీ ఒక్కో కథను చెబుతుంది. నగదు బహుమతికి ఎంపికైందీ చిత్రం.



హ్యూమన్స్ బిలీవ్ ఆన్ కౌరీ

తెలంగాణకు చెందిన ఔత్సాహిక కళాకారుడు తాండ్ర అనీల్ రూపొందించిన మెటల్ కాస్టింగ్ ఇది. 'హ్యూమన్స్ బిలీవ్ ఆన్ కౌరీ' శీర్షికన ఇత్తడితో తీర్చిదిద్దిన ఈ కళారూపం, మన ఆలోచనలు, నమ్మకాలను సున్నితంగా ప్రశ్నిస్తోంది. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రదర్శనలో నగదు బహుమతికి ఎంపికైందీ చిత్రం.

మీరు మారరా?

● పట్టణ ప్రణాళికా విభాగం తీరుపై కమిషనర్ మండిపాటు

● అక్రమ నిర్మాణాలపై చర్యల్లో జాప్యంపై అసహనం

● ప్రజావాణిలో పాల్గొన్న ఇలంబరిది



ప్రజావాణిలో కమిషనర్ ఇలంబరిది, అధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 'అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే నియంత్రించరు. మీ అంతట మీరు చర్యలు తీసుకోరు. కనీసం ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోరా..?' అని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులపై కమిషనర్ ఇలంబరిది ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలకు స్పీకింగ్ నోటీసులు ఇచ్చిన అనంతరం తదుపరి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 'బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడం సరికాదు. ఎవరి పనులు వారు బాధ్యతగా చేయాలి' అని సూచించారు. ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడం.. గతంలో వచ్చిన వారే తిరిగి వస్తుండడంతో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం అనుమతి లేని భవనాలను కూల్చడంలో వెనకడుగు వేయవద్దని స్పష్టం చేశారు. సర్కిల్ స్థాయిలో చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఇలంబరిది.. ప్రజల నుంచి వస్తోన్న ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలన్నారు. కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో 57 ఫిర్యాదులు రాగా.. అందులో 25 పట్టణ ప్రణాళికా విభాగానికి చెందినవే ఉన్నాయి. ఆస్తి పన్ను వివాదాలకు సంబంధించి 12, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్, ఆర్థిక విభాగాల ఫిర్యాదులు మూడు చొప్పున, అర్బన్ బయోడైవర్సిటీ, ఆస్తుల సేకరణ విభాగాలవి రెండు చొప్పున, యూసీడీ, వీధి దీపాలు, పాలనాపరమైన అంశాలపై మూడు ఫిర్యాదులు వచ్చాయి. ఫోన్ ఇన్‌లో మరో ఆరు ఫిర్యాదులు వచ్చినట్టు జీహెచ్ఎంసీ పేర్కొంది. ఆరు జోనల్ కార్యాలయాల్లో 82 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో కూకట్‌పల్లి-29, ఎల్బీనగర్, సికింద్రాబాద్ 19 చొప్పున, శేరిలింగంపల్లి 10, చార్మినార్-4, ఖైరతాబాద్ జోన్‌లో ఒక ఫిర్యాదు వచ్చాయి.

వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించండి

● జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి వెంకటి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించాలని, వారిని ఆరోగ్య కేంద్రాలకు తరలించి చికిత్స అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి ఆదేశించారు. సోమవారం పురానాపూల్ పానీపూర క్లస్టర్ పరిధిలో ఆరోగ్య సిబ్బందికి, సూపర్‌వైజర్లు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది విధులను బాధ్యతగా నిర్వహించాలని, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు అయ్యే విధంగా ప్రోత్సహించాలన్నారు. 30 ఏళ్లు దాటిన వారికి రక్తపోటు, మధుమేహం, కేన్సర్ వ్యాధులను గుర్తించేందుకు పరీక్షలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో వైద్య సిబ్బంది సాధించిన లక్ష్యాలపై సమీక్షించారు. పబ్లిక్ హెల్త్ సీనియర్ ఆఫీసర్ డాక్టర్ శశికళ, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గాడి తప్పుతోంది

● విద్య అందరికీ సమానంగా అందాలి

● ప్రొఫెసర్ జి. రాంరెడ్డి స్మారకోపన్యాసంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం గాడితప్పుతోందని ఇది దేశ ప్రజలకు చాలా ప్రమాదకరమని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దూరవిద్య పితామహుడు ప్రొఫెసర్ జి.రాంరెడ్డి 95వ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా స్మారకోపన్యాస కార్యక్రమాన్ని అంబేడ్కర్ వర్సిటీలో సోమవారం నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి "గాడితప్పుతోన్న లౌకికవాదం" అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సంస్థలే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాయన్నారు. దేశంలో నేరాలు పెరిగి పోయాయయని, మహిళలపై జరిగే అఘాయిత్యాల పట్ల న్యాయస్థానాలు వ్యవహరిస్తున్న తీరు బాధగా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. విద్య అందరికీ సమానంగా అందాలన్నారు. ఉన్నత విద్య వ్యాప్తికి ప్రొఫెసర్ జి. రాంరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ట్రస్ట్ కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య వ్యాప్తిలో రాంరెడ్డి ఆలోచనా విధానం భవిష్యత్ తరాలకు అందించేలా ట్రస్ట్ ద్వారా స్మారకోపన్యాసాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. లౌకిక వాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదపు అంచున ఉన్నాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సతీమణి ప్రమీలా రాంరెడ్డి, ఆయన కుమార్తె జ్యోతి, విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతులు ప్రొఫెసర్ వి.ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ సీతారామారావు, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కె. శ్రీనివాస్, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

మేనబావను కడతేర్చిన బాలుడు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మేనబావను హతమార్చాడు ఓ బాలుడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన మేడ్చల్ పట్టణంలో జరిగింది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణలోని కిష్టాపూర్ రోడ్డు పక్కన అద్దె ఇంట్లో ఓ వ్యక్తి (30) తల్లి, సోదరుడు(మానసిక దివ్యాంగుడు), మేనమామ కుమారుడు(16)తో నివసిస్తున్నాడు. సదరు వ్యక్తి అర్చక వృత్తిని మానేసి తాగుడుకు బానిసయ్యాడు. తరచూ తాగొచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. దీంతో బాలుడు విసిగిపోయాడు. ఆదివారం రాత్రి మేనబావతో కలిసి గదిలో నిద్రపోయాడు.

మేనబావ నిద్రలో ఉండగా బాలుడు కత్తితో మెడపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గదిలో నుంచి ఎలాంటి చప్పుడు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా సదరు వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పలు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో

ఇష్టారాజ్యంగా ఇంటర్ ప్రాక్టికల్స్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో కొంతమంది ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని మొత్తం 118 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తుండగా పలు ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సికింద్రాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, ఖైరతాబాద్, నాంపల్లి, మెహిదీపట్నం, అమీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో విద్యార్థులు నామమాత్రంగా పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. పలుచోట్ల లైబ్రరీల్లో తూతూ మంత్రంగా నిర్వహిస్తూ నూటికి నూరుశాతం మార్కులు వేయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2 వేలు..

ప్రాక్టికల్స్ నేపథ్యంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.2వేలు వసూలు చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న వారి నుంచి కూడా రూ.500 వసూలు చేసినట్లు సమాచారం.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

ఈనెల 2న ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కాగా.. రెండు, మూడు రోజులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు అధికారులు వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. తర్వాత అటువైపు చూడకపోవడంతో కొందరు నిర్వాహకులు తమకు తామే మార్కులు వేసుకునే విధంగా వ్యవహరిస్తున్నారు.

20, 21 తేదీల్లో విప్లవ విద్యార్థి ప్రస్థానంపై సదస్సు



విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం, వేణుగోపాల్ తదితరులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు నానాటికీ దిగజారిపోతున్నాయని తెలంగాణ జన సమితి(టీజేఎస్)అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలుగు నేలపై విప్లవ విద్యార్థి సంఘాలు ఏర్పడి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మరోసారి అప్పటి పోరాటాలను గుర్తు చేసుకుంటూ, ప్రస్తుత విద్యారంగ సవాళ్లపై చర్చించడానికి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో తెలుగు నేలపై 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానంపై ఈ నెల 20, 21 తేదీల్లో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు సదస్సు జరగనుంది.

సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సదస్సు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ ఎన్. వేణుగోపాల్, పూర్వ విద్యార్థులతో కలిసి 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలే ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేస్తాయన్నారు. విద్యార్థి ఉద్యమాలు చాలా కీలకమన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. వేణుగోపాల్ మాట్లాడుతూ.. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగే సదస్సులో విద్యార్థి అమరవీరుల కుటుంబాల పరిచయం, అప్పటి విద్యార్థి సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు విష్ణువర్ధన్‌రావు, సురేష్ కుమార్, భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులా.. అయితే మాకేంటి..?

(5వ పేజీ తరువాయి)


ఫిర్యాదు చేసింది. అధికారులు వినియోగిస్తున్న వాహనాలు, ఏ ట్రావెల్ ఏజెన్సీల పేరిట బిల్లులు తీసుకుంటున్నారనే ఆధారాలనూ సమర్పించినట్టు తెలిసింది. దీనిని తీవ్రంగా పరిగణించిన పురపాలక శాఖ నివేదిక ఇవ్వాలని జీహెచ్ఎంసీకి సూచించింది. దీంతో బల్దియాలోని రవాణా విభాగం అదనపు కమిషనర్ ఆయా విభాగాల్లోని 26మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదుపై ప్రభుత్వం నివేదిక కోరిందని, మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొంది. గడువు ముగిసినా.. ఇప్పటి వరకు మెజార్టీ అధికారులు వివరణ ఇవ్వలేదని సమాచారం. వివరణ ఇచ్చిన కొందరు.. డీసీఓల పనితీరు బాగా లేదని, తరచూ సెలవులు పెట్టడం, సమయానికి రాకపోవడం, మార్గమధ్యంలో వదిలేయడం, డీజిల్‌కు డబ్బులు అడగడం వంటి కారణాల వల్ల ఇతర వాహనాలు వినిగిస్తున్నామని పేర్కొన్నట్టు సమాచారం. నోటీసుల జారీతో కొందరు డీసీఓల వాహనాలు వినియోగిస్తున్నట్టు తెలిసింది. సొంత కార్లు అద్దె వాహనాలుగా వినియోగంపై త్వరలో పురపాలక శాఖకు నివేదిక పంపాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. వివరణ ఇవ్వని వారి విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తామని ఓ అధికారి చెప్పారు.

మల్టీ.. పల్టా

(5వ పేజీ తరువాయి)

గోల్డ్ స్కీంల్లోనూ పెట్టుబడులు పెట్టిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. చాలామంది ఆసక్తి చూపే రియల్ ఎస్టేట్ రంగంలోనూ ఇలాంటి మోసాలు పెరుగుతున్నాయి. రియల్ ఎస్టేట్ సంస్థలు సైతం తమ ప్లాట్లను అమ్మేందుకు ఈ విధానాన్నే అనుసరిస్తున్నాయి. మా వెంచర్‌లో ప్లాట్ కొంటే మీకు మంచి లాభాలతో పాటు మీరు తీసుకువచ్చే వారి నుంచి మీకు కమిషన్ వస్తుందని చెప్పి నమ్మిస్తుంటారు. ఇటీవల కాలంలో బై బ్యాక్ స్కీం పేరుతోనూ రియల్ ఎస్టేట్ సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయి.

డాక్టర్ నలిమెల భాస్కర్‌కు సిటీ కాలేజ్ జాతీయ పురస్కారం



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ సాహితీ వేత్త, ప్రముఖ అనువాదకులు, పరిశోధకులు, కవి, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌ను సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారానికి (2025) ఎంపిక చేసినట్లు అవార్డు కమిటీ అధ్యక్షుడు, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

20 నుంచి బాహా సే ఇండియా చాలెంజ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య వాహన, విమానయాన రంగాలలో ప్రసిద్ధి చెందిన ఇంజనీర్ల సంఘం సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ (ఎస్ఏఈ), శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో అంతర్ కళాశాలల 'బాహా సే ఇండియా -2025' చాలెంజ్‌ను నిర్వహిస్తోంది. ఈ నెల 20 నుంచి నాలుగు రోజులపాటు మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గల బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో ఈ చాలెంజ్‌ను నిర్వహిస్తున్నామని బాహా సే ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాలరాజ్ సుబ్రమణియం తెలిపారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

WANTED

H Senior Accountant, Jewellery Sales Executive, Collection Executive, Marketing Executive for Hotel, Interested CPersons 9246597374. Interviews on 17.02.2025, 18.02.2025, 19.02.2025. Address: Divine Jewels, Near Mandir Showroom, Banjara Hills, Road No.Hyd. AJH

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

మీకు తెలుసా?

విషాల్ని హరించే కాఫీ

కాఫీతో కొన్ని ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. వాటిని పొందాలంటే కాఫీ తాగడానికి కచ్చితమైన పద్ధతిని అనుసరించాలి. అదెలాగంటే...

కాఫీని సరైన మోతాదులో తీసుకుంటే శరీరంలోని విషాలు హరిస్తాయి. దాంతో కాలేయ పనితీరు మెరుగు పడుతుంది. కాఫీ గింజల్లోని క్లోరోజెనిక్ యాసిడ్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీర్యాడికల్స్‌ను స్థిరీకరిస్తాయి. దాంతో మూత్రపిండాల పనితీరు మెరుగై, మూత్రం ద్వారా శరీరంలోని విషాలు బయటకు వెళ్లిపోతాయి. అయితే ఈ ప్రయోజనాలు పొందాలంటే సరైన కాఫీ దినుసులను, సరైన విధానంలో వాడుకుని, సరైన సమయాల్లో, సరైన మోతాదుల్లో కాఫీ తయారుచేసుకుని తాగాలి. అందుకోసం, పురుగు మందులు ఉపయోగించకుండా పండించిన, సేంద్రీయ కాఫీ విత్తనాలను వాడుకోవాలి. అలాగే డికాక్షన్‌కు చక్కెర జోడించకూడదు. బ్లాక్ కాఫీ లేదా దాల్చిన చెక్క జోడించిన కాఫీ తాగాలి. నచ్చినవాళ్లు ఆరోగ్యకరమైన కొబ్బరి నూనె, లేదా వెన్నలను కాఫీకి జోడించి బుల్లెట్‌ప్రూఫ్ కాఫీ తాగొచ్చు. రాత్రిపూట కాఫీ తాగితే విషాలు హరించే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అయితే ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదకొండున్నర మధ్య సమయం కాఫీకి అనువైన సమయం. కానీ



ఉదయాన్నే నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకునే ముందు కాఫీ తాగకూడదు. వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీ తాగితే, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతుంది. వ్యాయామంతో శరీరం చురుగ్గా మారడం వల్ల విషాలు శరీరంలో నుంచి సునాయాసంగా బయటకు వెళ్లిపోతాయి. అయితే కాఫీ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలంటే రోజుకు రెండు నుంచి మూడు కప్పులకే పరిమితం కావాలి.

పౌష్టికాహారం

పిల్లలు బలంగా

పిల్లలు బలంగా ఎదగాలంటే బలవర్థకమైన పోషకాహారాలను ఎంచుకుని, వాటికి భోజనంలో స్థానం కల్పించాలి. ప్రత్యేకించి పిల్లలకు తినిపించవలసిన పౌష్టికాహారం ఎలా ఉండాలంటే...

రాగులు: క్యాల్షియం, ఇనుము పుష్కలంగా కలిగి ఉండే రాగులు ఎముకలకు బలాన్నిచ్చి, హీమోగ్లోబిన్ మోతాదును పెంచుతాయి. వీటితో జావ, దోస, లడ్లు తయారుచేసి పిల్లలకు అందించవచ్చు.

ఉసిరి: విటమిన్ సి ఎక్కువగా ఉండే ఉసిరి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది. జీర్ణశక్తిని మెరుగు పరిచి, చర్మం, వెంట్రుకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. కాబట్టి ఉసిరి రసం, చట్నీ, మురబ్బా రూపంలో అందించవచ్చు.

నెయ్యి: ఆరోగ్యకరమైన కొవ్వుల భాండాగారమిది. జీర్ణశక్తిని పెంచి, మెదడు అభివృద్ధికి తోడ్పడుతుంది. కాబట్టి అన్నంతో, చపాతీల్లో నెయ్యి జోడిస్తూ ఉండాలి.

పసుపు: పసుపుకు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. రోగనిరోధకశక్తిని పెంచే పసుపు గాయాలను త్వరగా మాన్పుతుంది. కాబట్టి తరచూ పాలు లేదా సూప్‌లో పసుపు కలిపి అందిస్తూ ఉండాలి.

మఖ్‌నా: ప్రొటీన్, క్యాల్షియం సమృద్ధిగా దొరికే మఖనాలు ఎముకల దృఢత్వాన్ని పెంచుతాయి. వీటిని తింటే పిల్లలు రోజంతా చురుగ్గా ఉంటారు.

ఖర్జూరం: సహజసిద్ధ చక్కెరలను కలిగి ఉండే ఖర్జూరాలు శక్తినిస్తాయి. స్మూదీలు, పండ్ల రసాలు, ఎనర్జీ బాల్స్ రూపంలో ఖర్జూరాలను తినిపిస్తూ ఉండాలి.



బెల్లం: శుద్ధి చేసిన చక్కెరకు ప్రత్యామ్నాయమైన బెల్లంలో ఇనుము ఎక్కువగా దొరుకుతుంది. కాబట్టి పిల్లల కోసం తయారుచేసే తీపి వంటకాల్లో చక్కెరకు బదులుగా బెల్లం వాడుతూ ఉండాలి.

పచ్చి కొబ్బరి: కొబ్బరినీళ్లతో డీహైడ్రేషన్ తొలగిపోతే, కొబ్బరితో ఆరోగ్యకరమైన కొవ్వులు దక్కుతాయి. కాబట్టి కూరలు, స్మూదీలలో పచ్చి కొబ్బరి కోరు కలుపుతూ ఉండాలి. కొబ్బరి చట్నీలు విరివిగా వాడుకోవాలి.

మొలకలు: పెసర మొలకల్లో ప్రొటీన్లు ఎక్కువ. ఇవి తేలికగా అరుగుతాయి కూడా. కాబట్టి సలాడ్స్, వేపుళ్లలో వీటిని కలిపి పిల్లలకు తినిపిస్తూ ఉండాలి.

చిలకడదుంపలు: వీటిలో పీచుకు కొదవ ఉండదు. విటమిన్ ఎ కూడా పుష్కలంగా ఉంటుంది. వీటిని ఉడకబెట్టి, వేయించి, నిప్పుల్లో కాల్చి పిల్లలకు తినిపించవచ్చు.



ఆడపిల్లల్లో పిసిఒడి అత్యంత సాధారణమైన సమస్యగా మారిపోయింది. అధిక బరువు, అవాంఛిత రోమాలతో వేధించే ఈ సమస్యను సులభంగా పరిష్కరించుకునే వీలు లేకపోలేదు. లక్షణాల ఆధారంగా ఈ సమస్యను ఎలా గుర్తించాలో, ఏ జాగ్రత్తలతో నెలసరిని గాడిలో పెట్టుకోవాలో వైద్యులు వివరిస్తున్నారు.

నెలసరి నత్త నడకన..

8 నుంచి 13 ఏళ్లు... ఆడపిల్లలు యుక్తవయసులోకి అడుగు పెట్టే వయసిది. ఆ తర్వాత పిల్లలు శారీరకంగా పూర్తి స్థాయికి ఎదగడానికి రెండేళ్ల సమయం పడుతుంది. అయితే 15 ఏళ్లు దాటిన తర్వాత యుక్తవయసులోకి అడుగుపెట్టే పిల్లలుంటారు. 8 ఏళ్ల కంటే ముందే కౌమారంలోకి ప్రవేశించే పిల్లలుంటారు. అయితే పిసిఒడిని, యుక్తవయసుకు చేరుకున్న తర్వాత ఆడపిల్లల్లో తలెత్తే ప్రధాన సమస్యగా పరిగణించవచ్చు. సాధారణంగా తొలి నెలసరి మొదలైన ప్రారంభంలో, ఆరు నెలల నుంచి రెండేళ్ల పాటు నెలసరి క్రమం అవకతవకలకు గురవుతూ, నెమ్మదిగా గాడిలో పడుతుంది. ఆ తర్వాత కూడా ఆడపిల్లల్లో నెలసరి క్రమం తప్పుతూనే ఉన్నా, ఆగిపోయినా దాన్ని పిసిఒడిగానే అనుమానించాలి. ఆడపిల్లల్లో పిసిఒడి తలెత్తడానికి ప్రధాన కారణం హార్మోన్ల అసమతౌల్యం.

పిసిఒడి ఎందుకు?

నెలసరి మొదలైన తర్వాత ప్రతి నెలా అండం విడుదల కావాలి. ఈస్ట్రోజన్ హార్మోన్ ఉచ్ఛ స్థాయిలో ఉన్నప్పుడు, నెలలో 14 రోజు నాటికి అండాశయం నుంచి అండం విడుదల అవుతుంది. సాధారణంగా ఆడపిల్లల్లో స్త్రీ, పురుష హార్మోన్లు రెండూ ఉంటాయి. అయితే స్త్రీ హార్మోను ఈస్ట్రోజన్ కంటే పురుష హార్మోన్ టెస్టోస్టెరాన్ మోతాదు తక్కువగా ఉండాలి. కానీ కొందర్లో ఈ పురుష హార్మోన్ ఉండవలసిన పరిమాణం కంటే ఎక్కువగా ఉన్నప్పుడు, ఈస్ట్రోజన్ హార్మోన్ ఉధృతంగా లేకపోవడం వల్ల, పాలీ సిస్టిక్ ఓవరీ డిసీజ్, పిసిఒడి సమస్య తలెత్తి, అండం విడుదల ఆగిపోతుంది. దాంతో అవి అండాశయాల్లో సిస్టులు ఏర్పడతాయి. అయితే హార్మోన్ అసమతౌల్యానికి ఇతరత్రా కారణాలేవీ లేవని నిర్ధారించుకున్న తర్వాతే పిసిఒడిగా నిర్ధారించవలసి ఉంటుంది. నాన్ క్లాసిక్ సిఎహెచ్ (నాన్ క్లాసికల్ కంజెనైటల్ హైపర్‌ప్లేసియా) అనే సమస్యలో కూడా హార్మోన్లు క్రమం తప్పి నెలసరిలో అంతరాయం ఏర్పడుతుంది. కాబట్టి నెలసరిలో అవకతవకలకు ఈ సమస్య కారణం కాదని నిర్ధారించుకోవాలి. అలాగే కొందర్లో ప్రొల్యాక్టిన్ హార్మోన్ ఎక్కువగా ఉన్నా, నెలసరి క్రమం తప్పుతుంది. కార్టిసాల్ హార్మోన్ ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా ఇదే సమస్య తలెత్తుతుంది. ఇవేవీ కారణం కాదని నిర్ధారించుకున్న తర్వాతే పిసిఒడిగా నిర్ధారించుకోవాలి.

ప్రధాన లక్షణాలు ఇవే!

పిసిఒడికి గురైన అమ్మాయిల్లో, టెస్టోస్టిరాన్ ఎక్కువగా ఉండడానికి ప్రధాన కారణం, ఇన్సులిన్ సమర్థమైన ప్రభావాన్ని కనబరచకపోవడమే! పురుష హార్మోన్ టెస్టోస్టిరాన్ ఈస్ట్రోజన్ హార్మోన్‌గా మారడానికి ఈ ఇన్సులిన్ రెసిస్టెన్స్ అడ్డుపడడం మూలంగా పిసిఒడి తలెత్తుతుంది. ఈ సమస్య కొన్ని ప్రధాన లక్షణాల రూపంలో బయల్పడుతుంది. అవేంటంటే...

- పైపెదవి, ఛాతీ, చేతులు, కాళ్ల మీద అవాంఛిత రోమాలు పెరగడం
- గరుకుగా ఉండే, మందపాటి రోమాలు
- మొటిమలు తలెత్తడం
- నెలసరి క్రమం తప్పడం
- బరువు పెరగడం

పరీక్షలున్నాయి

నెలసరి క్రమం తప్పిన ఆడపిల్లలకు రక్త పరీక్ష, పొత్తికడుపు అల్ట్రాసౌండ్‌తో, నాన్ క్లాసిక్ సిఎహెచ్, కార్టిసాల్, ప్రొలాక్టిన్ మోతాదు, ఫాస్టింగ్ గ్లూకోజ్, పిసిఒడి సమస్యలను నిర్ధారించుకోవాలి. ఈ పరీక్షల్లో బయల్పడిన ఫలితాల ఆధారంగా సమస్యను కచ్చితంగా అంచనా వేసి, తగిన చికిత్సతో సమస్యను సరిదిద్దుకోవాలి. పిసిఒడిని సరిదిద్దడం కోసం ప్రధానంగా వ్యాయామానికీ, ఆహార నియమాలకూ ప్రాధాన్యమివ్వాలి. కనీసం ఐదు శాతం బరువు తగ్గినా పరిస్థితి అదుపులోకొస్తుంది. ఇలా మందులతో పనిలేకుండా సహజసిద్ధంగా పిసిఒడిని సరిదిద్దుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాలి. ఇన్ని నియమాలు పాటించినా పరిస్థితి అదుపులోకి రానప్పుడు మాత్రమే, చికిత్స అవసరమవుతుంది. చికిత్సలో భాగంగా హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వవలసి ఉంటుంది.





సన్నగా ఉన్నవాళ్లకు 'లీన్ పిసిఒడి'

కేవలం అధిక బరువు కలిగి ఉన్న పిల్లల్లోనే పిసిఒడి తలెత్తుతుందనుకుంటే పొరపాటు. బరువు తక్కువగా ఉండే నాజూకు ఆడపిల్లల్లో కూడా పిసిఒడి తలెత్తవచ్చు. అదే 'లీన్ పిసిఒడి'. దీనికి కారణం... జన్యుపరమైన ఇన్సులిన్ రెసిస్టెన్స్. జన్యుపరంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను కలిగి ఉన్న ఆడపిల్లల్లో పిసిఒడి చికిత్స కొంత క్లిష్టమవుతుంది. సన్నగా ఉంటారు కాబట్టి బరువు తగ్గడం వల్ల అదనపు ప్రయోజనం దక్కదు. అయితే వ్యాయామం చేయడం తప్పనిసరి. దీంతో ప్రయోజనం కనిపించనప్పుడు మాత్రమే వైద్యులు నోటి మాత్రలు సూచిస్తారు. పెళ్లి కాని అమ్మాయిల విషయంలో ఇలా మాత్రలు వాడుకోవచ్చు. కానీ పిల్లల కోసం ప్రయత్నిస్తున్న మహిళల్లో ఈ సమస్య ఉన్నప్పుడు ఇన్‌ఫెర్టిలిటీ చికిత్సలను ఆశ్రయించాల్సి ఉంటుంది.

ఈ నియమాలు తప్పనిసరి

ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్ ఇంజెక్షన్లతో నాలుగైదు నెలల పాటు నెలసరి క్రమం తప్పకుండా కనిపిస్తే, వైద్యులు ఆ చికిత్సను ఆపి, కొన్ని నెలల పాటు నెలసరి క్రమాన్ని పరీక్షిస్తారు. ఆలోగా పరిస్థితి గాడిలో పడి నెలసరి గాడిలో పడుతుంది. ఈ నాలుగు నెలలూ వ్యాయామం కూడా కొనసాగిస్తే, ఫలితం మరింత మెరుగు పడుతుంది. అయితే హార్మోన్ ఇంజెక్షన్లతో పని లేకుండా సహజసిద్ధంగా శరీర హార్మోన్లను దారికి తెచ్చుకోవడం కోసం కొన్ని నియమాలను అనుసరించవచ్చు. అవేంటంటే...

- క్రమం తప్పక ఏరోబిక్ వ్యాయామాలు చేయాలి
- నడక వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది
- సమతులాహారం తీసుకోవాలి
- ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అలవరుచుకోవాలి
- కనీసం 5% మేరకు శరీర బరువు తగ్గించుకోవాలి.

డాక్టర్ రాకేష్ బోపన్న
డాక్టర్ రాకేష్ ఎండోక్రైన్ అండ్ డయాబెటిస్ సెంటర్,
ల్యాంకో హిల్స్, మణికొండ, హైదరాబాద్.



కాలానుగుణ ఇన్‌ఫెక్షన్

ఆ రెండూ ఒకటి కావు

ఓ పక్క బర్డ్ ఫ్లూ కొనసాగుతోంది. మరో పక్క ఫారింగ్జయిటిస్ లాంటి శ్వాసకోస ఇన్‌ఫెక్షన్లు వేధిస్తున్నాయి. ఒకే లక్షణాలను కలిగి ఉండే ఈ రెండు ఆరోగ్య సమస్యల్లో ప్రధాన వ్యత్యాసాలు లేకపోలేదు. ఆ వ్యత్యాసాల ఆధారంగా సమస్యను కచ్చితంగా ఎలా గుర్తించాలో, ఎలా సరిదిద్దుకోవాలో వైద్యులు వివరిస్తున్నారు.

చల్లని చలికాలం నుంచి వేడిగా ఉండే వేసవి కాలంలోకి అడుగుపెడుతున్నాం. అటు చలి, ఇటు వేసవి కాని ఈ మధ్యస్థ కాలంలో, రోజు మొత్తంలో వాతావరణం భిన్నమైన ఉష్ణోగ్రతలకు లోనవుతూ ఉంటుంది. పొద్దున్న చలి ఎక్కువగా, మధ్యాహ్నం వేడి ఎక్కువగా, సాయంత్రానికి మళ్లీ చలి పెరుగుతూ ఇలా శరీరం భిన్నమైన ఉష్ణోగ్రతలకు బహిర్గతమవుతూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితులకు శరీరం అలవాటు పడే క్రమంలో వాతావరణంలోని పలురకాల వైరస్‌ల వల్ల వేర్వేరు ఇన్‌ఫెక్షన్లు సోకుతూ ఉంటాయి. వాటిలో ప్రధానమైనది... 'ఫారింగ్జయిటిస్'. ముక్కు, నోరు, శ్వాస నాళిక వెనక భాగంలో ఉండే ఫారింగ్స్‌కు వాతావరణంలో విజృంభించే చిన్నపాటి వైరస్‌లు సోకుతూ ఉంటాయి. ప్రధానంగా బడికెళ్లే పిల్లలకు సోకే ఈ ఇన్‌ఫెక్షన్ క్రమేపీ కుటుంబానికీ, ఇతరులకూ వ్యాపిస్తూ ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఇది తీవ్రంగా పరిగణించవలసిన సమస్య కాకపోయినప్పటికీ, స్వల్పకాలిక మందులతో లక్షణాలను అదుపులోకి తెచ్చుకోవాలి. అంతిమంగా జ్వరం వరకూ సమస్య ముదిరిపోకుండా ఉండడం కోసం ముందు నుంచే జాగ్రత్త పడాలి. ప్రధానంగా అలర్జీ ప్రతిస్పందన, వైరస్ విజృంభణ మూలంగా ఫారింగ్జయిటిస్ వేధిస్తుంది కాబట్టి అలర్జీని తగ్గించే మందులతో, ఉపశమనాన్నిచ్చే గృహ వైద్యాలతో చికిత్స మొదలుపెట్టాలి. అందుకోసం....

- యాంటీబయాటిక్స్ వాడకూడదు
- రోజుకు మూడు సార్లు ఆవిరి పట్టాలి
- చల్లని పదార్థాలు, ద్రవాలకు దూరంగా ఉండాలి
- గోరువెచ్చని నీళ్లలో ఉప్పు కలిపి నోరు పుక్కిలించాలి
- చల్లని గాలికి బహిర్గతం కాకుండా చూసుకోవాలి
- యాంటీ ఎలర్జిక్ మందులు పరిమితంగా వాడుకోవాలి
- వీలైనంత తక్కువ మోదాదులో పారాసిటమాల్ వాడుకోవాలి



బర్డ్ ఫ్లూలో కూడా ఇవే లక్షణాలు

జ్వరం, ఎగువ శ్వాసకోస ఇన్‌ఫెక్షన్, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, వాంతులు బర్డ్ ఫ్లూ ప్రధాన లక్షణాలు. అయితే ఇవి ఫారింగ్జయిటిస్‌ను పోలినట్టే కనిపించినా, బర్డ్ ఫ్లూలో జ్వరం, ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉంటాయి. వీటితోనే ఈ వ్యాధి మొదలవుతుంది. ఫారింగ్జయిటిస్‌లో, ముక్కు దిబ్బెడ, గొంతునొప్పితో మొదలై అంతిమంగా జ్వరం కనిపిస్తుంది. కానీ బర్డ్ ఫ్లూ ఏకంగా జ్వరంతో మొదటి రోజే ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు వేధిస్తాయి. వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులకు వినహా బర్డ్‌ఫ్లూ తీవ్రమైన పరిణామాలకు దారి తీయదు. అయితే బర్డ్ ఫ్లూ సోకినప్పుడు, లక్షణాల ఆధారంగా చికిత్స ఇవ్వవలసి ఉంటుంది. అవసరాన్ని బట్టి వైద్యులు మాత్రమే తగిన యాంటీబయాటిక్స్ సూచించగలుగుతారు. దగ్గు, జలుబులను తగ్గించుకోవడం కోసం వేడి నీటి ఆవిరి, గోరువెచ్చని నీటితో నోరు పుక్కిలించడం లాంటి చిట్కాలు పాటించవచ్చు.

ఫారింగ్జయిటిస్‌ను, ఎటువంటి వైద్య చికిత్స అవసరం లేకుండా, రోగనిరోధకశక్తి సహాయంతో ఐదు రోజుల్లోనే అదుపులోకి తెచ్చుకోవచ్చు. కానీ బర్డ్ ఫ్లూకు వైద్య చికిత్స అవసరమవుతుంది. అయినప్పటికీ లక్షణాల తీవ్రతను బట్టి వైద్యులను సంప్రతించడం అవసరం.

డాక్టర్ సుధీర్ రెడ్డి, ఇఎన్‌టి సర్జన్,
శ్రీ సెన్సెస్,
హబ్సిగూడ, హైదరాబాద్.



అసలు నకిలీ

కల్తీ పన్నీర్‌ను కనిపెట్టేద్దాం!

పన్నీర్ ఆరోగ్యకరం. క్యాల్షియం, విటమిన్ ఎ సమృద్ధిగా దొరికే పన్నీర్‌తో ఎముకలు దృఢపడతాయి. అయితే మార్కెట్లో మనకెన్నో రకాల పన్నీర్ అందుబాటులో ఉంటోంది. వాటిలో నకిలీ పన్నీర్ కూడా ఉంటుంది. దాన్నెలా గుర్తించాలో తెలుసుకుందాం!

ఇటీవలి కాలంలో వంటనూనెలతో కూడా పన్నీర్‌ను తయారు చేస్తున్నారు. అనలాగ్ పన్నీర్ అనే పేరుతో దొరుకుతున్న ఈ పన్నీర్‌లో పోషకాలు తక్కువ. అసలైన పన్నీర్ మృదువుగా, చిదిమితే విరిగిపోతూ, పాల వాసనను వెలువరిస్తూ ఉంటుంది. కానీ అనలాగ్ పన్నీర్, రబ్బరులా గట్టిగా ఉంటుంది. వేడిచేసినప్పుడు పాలతో తయారైన పన్నీర్ పాల కొవ్వును విడుదల చేస్తే, అదనపు నీళ్లను విడుదల చేస్తుంది. అలాగే ఈ నకిలీ పన్నీర్‌ను పరీక్షించడం కోసం, నీళ్లలో ఉడకబెట్టి, చల్లారిన తర్వాత కొన్ని చుక్కల అయొడిన్ టింక్చర్‌ను జోడించాలి. అప్పుడు పన్నీర్ నీలం రంగులోకి మారితే, దాన్లో స్టార్చ్ ఉందనీ, నకిలీదని అర్థం. అలాగే పన్నీర్‌ను నీళ్లలో ఉడకబెట్టి, చల్లారిన తర్వాత దాని మీద కందిపప్పు పొడి లేదా సోయాబీన్ పొడి చల్లాలి. పది నిమిషాల తర్వాత అది లేత ఎరుపు రంగులోకి మారితే ఆ పన్నీర్‌లో డిటర్జెంట్ లేదా యూరియా కలిసిందని అర్థం. మన దేశంలో అనలాగ్ పన్నీర్ విక్రయం చట్టబద్ధం. అయితే లేబుల్ మీద 'నాన్ డైరీ' అని స్పష్టంగా పేర్కొనాలి. కాబట్టి పన్నీర్ కొనేటప్పుడు ఆ అక్షరాల కోసం వెతకాలి. అనలాగ్ పన్నీర్ సింథటిక్ కాబట్టి దాంతో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుందనీ, జీర్ణకోశ సమస్యలు వేధిస్తాయనీ, ట్రాన్స్‌ఫ్యాట్స్ ఎక్కువగా ఉండే ఈ పన్నీర్‌తో గుండెజబ్బులు పెరుగుతాయనీ వైద్యులు హెచ్చరిస్తున్నారు.



అవగాహన

బరువు తగ్గించే 'మోనో డైట్'

బరువు తగ్గడానికి ఎన్నో కొత్త కొత్త పోకడలు వాడుకలోకొస్తూనే ఉన్నాయి. తాజా 'మోనో డైట్' విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. దీంతో ఒరిగే లాభనష్టాల గురించి తెలుసుకుందాం!

బరువు తగ్గడం కోసం ఒకే రకమైన పదార్థాలను తినడమే... మోనోట్రోపిక్ డైట్. ఈ తరహా డైట్‌తో బరువు తగ్గినా అది తాత్కాలికం కావచ్చు. దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని నష్టపరచవచ్చు. ఈ డైట్‌ను అనుసరించడం కోసం ఒకే పదార్థానికి దీర్ఘకాలం పాటు కట్టుబడి ఉండాలి. అరటిపండ్లు ఎంచుకునే అరటిపండే తినాలి. కొందరు బంగాళాదుంపలు,



గుడ్లు కూడా ఎంచుకుంటూ ఉంటారు. అవి తప్ప వేరే పదార్థాలేవీ తినకూడదు. ఇలా క్యాలరీల మీద కోత విధించే మోనో డైట్ వల్ల బరువు తగ్గే ప్రక్రియ వెంటనే మొదలైపోతుంది. అయితే ఒంట్లో నీటి శాతం తగ్గడం, కండర క్షీణత వల్ల కూడా బరువు తగ్గే అవకాశం ఉందనే విషయం గుర్తుంచుకోవాలి. బరువు తగ్గడంతో కూడా నీరసం, నిస్సత్తువలు కూడా వేధిస్తాయి.

దుష్ప్రభావాలు

మోనో డైట్‌లో భాగంగా పోషకాల కొరత ఏర్పడడం వల్ల ఆహారం మీద వ్యామోహం పెరుగుతుంది. దాంతో అవసరానికి మించి తినే ప్రమాదం ఉంటుంది. పోషక లోపం వల్ల గాల్‌స్టోన్స్, ఎలక్ట్రొలైట్ అసమతౌల్యం, మలబద్ధకం, తలనొప్పి, నీరసం, పోషకలోపాలు, కండర క్షీణతలు వేధిస్తాయి. మరీ ముఖ్యంగా అధిక రక్తపోటు, మధుమేహం, హృద్రోగాలు లాంటి ఆరోగ్య సమస్యలున్నవారు వైద్యులను సంప్రతించకుండా మోనో డైట్‌ను అనుసరించకూడదు.

రూ.250తో నెలవారీ 'సిప్'

జననివేశ్ పథకం కింద ప్రారంభం .. ఎస్‌బీఐ ఎంఎఫ్

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ (ఎస్‌బీఐ ఎంఎఫ్) మరింత సులభతరం చేసింది. తన 'జననివేశ్ సిప్' పథకం కింద మదుపరులు నెలనెలా క్రమానుగత పెట్టుబడుల పథకం (సిప్)లో పెట్టే కనీస పెట్టుబడి పరిమితిని రూ.250కు కుదించింది. సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ సమక్షంలో ఎస్‌బీఐ ఎంఎఫ్ ఈ పథకాన్ని ప్రారంభించింది. ఎస్‌బీఐ యోనో యాప్‌తో పాటు పేటీఎం, జీరోధా, గ్రో వంటి ఫిన్‌టెక్ కంపెనీల ద్వారానూ మదుపరులు ఈ సిప్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు. ఈ సిప్ పెట్టుబడుల కోసం బ్యాంకు ద్వారా చేసే చెల్లింపులను ఎస్‌బీఐ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చింది. సిప్ ద్వారా ఎంఎఫ్ పథకాల్లో తొలిసారిగా మదుపు చేసే మదుపరులు, చిన్న పొదుపరులు, అసంఘటిత రంగంలోని మదుపరులను దృష్టిలో ఉంచుకుని ఈ రూ.250 సిప్ పథకం ప్రారంభించాం' అని ఎస్‌బీఐ ఎంఎఫ్ ఎండీ, సీఈఓ నంద కిశోర్ చెప్పారు. ఆర్థిక అభివృద్ధిలో వినూతనత్వం, సమ్మిళితం కూడా కీలకం. అందులో భాగంగానే ఈ పథకం తీసుకొచ్చాం' అని ఎస్‌బీఐ చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి తెలిపారు.

భేషైన పథకం :సెబీ చీఫ్

'సిప్' ద్వారా ఎస్‌బీఐ ఎంఎఫ్ పథకాల్లో పెట్టే కనీస పెట్టుబడిని రూ.250కి తగ్గించడంపై కార్యక్రమంలో పాల్గొన్న సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది తన చిరకాల కల అన్నారు. అంతర్జాతీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు గిట్టుబాటు కాదని వదిలేసిన ఈ ప్రతిపాదనను ఎస్‌బీఐ ఎంఎఫ్ ప్రారంభించాడాన్ని ఆమె అభినందించారు.

ఫ్యూచర్ బెస్ట్ బ్రాండ్లలో

రిలయన్స్‌కు రెండో స్థానం

- 2023తో పోలిస్తే 11 స్థానాలు పైకి..
- ఆర్ఐఎల్ ముందు యాపిల్, మైక్రోసాఫ్ట్ సైతం దిగదుడుపే..
- 'ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్ 2024' విడుదల



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద, అత్యంత విలువైన కార్పొరేట్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మరో ఘనత సాధించింది. 2024 సంవత్సరానికి గాను విడుదల చేసిన 'ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్'లో రిలయన్స్ ప్రపంచంలోని రెండో అత్యుత్తమ బ్రాండ్‌గా నిలిచింది. 2023లో 13వ స్థానంలో ఉన్న రిలయన్స్.. ఈసారి ఏకంగా 11 స్థానాలు ఎగబాకి ద్వితీయ ర్యాంక్‌ను దక్కించుకుంది. ఈ విషయంలో అంతర్జాతీయ దిగ్గజ బ్రాండ్లైన యాపిల్, మైక్రోసాఫ్ట్, నైకీ, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, ఇంటెల్, టయోటా కంటే ముందుండటం గమనార్హం. ఈ జాబితాలోని ఏకైక భారత బ్రాండ్ రిలయన్సే కావడం మరో విశేషం. కాగా, దక్షిణకొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ ఈసారి ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది.

మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మారుతూనే బ్రాండ్ లక్ష్యం, అనుభవాన్ని సమతుల్యం చేసుకోగలిగే సామర్థ్యం ఆధారంగా ఫ్యూచర్‌బ్రాండ్ కంపెనీల మదింపును చేపట్టింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా పీడబ్ల్యూసీ లిస్ట్ చేసిన ప్రపంచ టాప్-100 కంపెనీలను పరిశీలించి, కంపెనీల ఆర్థిక పనితీరుకు బదులు బ్రాండ్ అనుభవం ఆధారంగా ర్యాంకింగ్‌లు కేటాయించింది. అత్యుత్తమ ఫ్యూచర్ బ్రాండ్లు తమ ప్రధాన గుర్తింపును కాపాడుకుంటూనే మారుతున్న వినియోగదారుల అంచనాలు, సాంకేతిక పురోగతులు, మార్కెట్ స్థితిగతులను చాకచక్యంగా ఒడిసిపట్టుకోగలుగుతాయి. మేమేంటి.. మా మనుగడ ఏంటి అనే అంశాలపై వాటికి స్పష్టమైన అవగాహన ఉందని ఫ్యూచర్ బ్రాండ్ ఇండెక్స్ రిపోర్టు పేర్కొంది.

టీసీఎస్ సిబ్బందికి 4-8% జీతం పెంపు!

ముంబై: దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఈ ఏప్రిల్ నుంచి సిబ్బంది వార్షిక వేతనాన్ని 4-8 శాతం వరకు పెంచనున్నట్లు తెలిసింది. మంచి పనితీరు కనబరిచిన వ్యాపార విభాగాల వారికి అధిక పెంపు లభించనుంది. అయితే, గతంతో పోలిస్తే పెంపు శాతం తగ్గడంపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కాగా, ఇన్ఫోసిస్ సైతం ఉద్యోగుల జీతాన్ని 5-8% వరకు పెంచనున్నట్లు తెలియవచ్చింది.

'కిమ్స్' చేతికి సాంగ్లీ హాస్పిటల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కిమ్స్ హాస్పిటల్స్ మహారాష్ట్రలో మరింత పట్టు పెంచుకుంటోంది. ఇందులో భాగంగా సాంగ్లీలోని ఉషాకాల్ అభినవ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (యూఏఐఎంఎస్ హాస్పిటల్)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ భాస్కర రావు, యూఏఐఎంఎస్ హాస్పిటల్ యజమాని విఠలింద్ పారిఖ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా యూఏఐఎంఎస్ హాస్పిటల్ కార్యకలాపాలు, నిర్వహణ కిమ్స్ హాస్పిటల్ చేపడుతుంది. కిమ్స్ హాస్పిటల్ ఇప్పటికే మహారాష్ట్రలోని నాసిక్, నాగపూర్‌ల్లో 2 హాస్పిటల్స్ నిర్వహిస్తోంది. వీటికి తోడు థానేలో 300 పడకలతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తోంది.

జెన్ టెక్నాలజీస్ గూటికి రెండు కంపెనీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్.. అప్లైడ్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్ఐపీఎల్), ఏఆర్ఐ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎల్‌పీఎల్)ను రూ.130 కోట్లకు కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఇందులో ఏఆర్ఐపీఎల్‌కు మెరైన్, ఆఫ్‌షోర్, నౌకలు, రేవులు, టెర్మినల్స్, నిర్మాణ రంగం, మైనింగ్ కంపెనీలకు అవసరమైన సిమ్యులేషన్, అసెస్‌మెంట్స్ టూల్స్ అందించడంలో మంచి పట్టుంది. కాగా ఏఎల్‌పీఎల్‌కు సముద్ర, నౌకా రంగానికి అవసరమైన సిమ్యులేషన్, అసెస్‌మెంట్ టూల్స్ అందించడంలో మంచి పట్టుందని జెన్ టెక్నాలజీస్ తెలిపింది.

మార్కెట్లోకి బీవైడీ సీలయన్ 7



న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ కంపెనీ బీవైడీ ఇండియా తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్ 'సీలయన్ 7'ను సోమవారం మార్కెట్లోకి అధికారికంగా విడుదల చేసింది. ప్రీమియం, పెర్ఫార్మెన్స్ వేరియంట్లలో లభించనున్న ఈ కొత్త కారు ప్రారంభ ధర రూ.48.9 లక్షలు. బీవైడీ ఈ కారును గతనెల 18న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలోనే ఆవిష్కరించి, బుకింగ్ సదుపాయాన్నీ ప్రారంభించింది. గడిచిన నెల రోజుల్లో ఈ కారుకు 1,000కి పైగా బుకింగ్స్ లభించినట్లు బీవైడీ తెలిపింది.

8 రోజుల తర్వాత లాభాల్లోకి..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో 8 రోజుల వరుస నష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. సోమవారం ట్రేడింగ్‌లోనూ ఆరంభం నుంచి నష్టాల్లోనే కొనసాగిన ప్రామాణిక సూచీలు.. ఆఖరి గంటలో కొనుగోళ్లతో స్వల్ప లాభాలను నమోదు చేయగలిగాయి. సెన్సెక్స్ 57.65 పాయింట్ల వృద్ధితో 75,996.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30.25 పాయింట్ల పెరుగుదలతో 22,959.50 వద్ద ముగిసింది. పరస్పర సుంకాల భారాన్ని తగ్గించుకునే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా, భారత ప్రతినిధులు త్వరలోనే సమావేశం కానున్నారన్న వార్తల నేపథ్యంలో మెటల్, ఫార్మా, ఆర్థిక సేవల రంగ షేర్లలో మదుపరులు కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది.

జనవరిలో తగ్గిన ఎగుమతులు

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం జనవరిలో నిరాశావహమైన పనితీరు ప్రదర్శించింది. 2.38 శాతం క్షీణతతో ఎగుమతుల విలువ 3,643 కోట్ల డాలర్లకే (రూ.3.13 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. పెట్రోలియం ధరల్లో ఆటుపోట్లు, ప్రపంచ అస్థిరతలు ఇందుకు దారి తీశాయి. ఫలితంగా వాణిజ్య లోటు 2,299 కోట్ల డాలర్లకు (రూ.1.89 లక్షల కోట్లు) పరిమితమైంది. దిగుమతులు 10.28 శాతం వృద్ధితో 5,942 కోట్ల డాలర్లుగా (రూ.5.11 లక్షల కోట్లు) నమోదయ్యాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	468	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	90
కరీంనగర్	80	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	75
కర్నూలు	80	నెల్లూరు	80
విశాఖపట్నం	83	అనంతపురం	80
గోదావరి	91		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,620 ▲	79,400 ▲	1,08,000 ▲
విజయవాడ	88,500 ▲	82,500 ▲	98,500 ▲
విశాఖపట్నం	85,140 ▲	78,050 ▲	96,020 ▲
రాజమండ్రి	86,662 ▲	79,400 ▲	98,700 ▼
ప్రొద్దుటూరు	87,650 ▲	81,160 ▲	97,000 ▼
ముంబై	85,254 ▼	78,093 ▼	95,946 ▼



ఆడి సరికొత్త ఆర్ఎస్ క్యూ8

ధర రూ.2.49 కోట్లు

న్యూఢిల్లీ: ఆడి ఇండియా పూర్తిగా కొత్త హంగులతో తయారుచేసిన ఆర్ఎస్ క్యూ8 పెర్ఫార్మెన్స్ ఎస్‌యూవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.49 కోట్లు. దేశంలో ఆడి బ్రాండ్‌ను నిర్మించడమే ఆర్ఎస్ క్యూ8 మోడల్ కార్ల ప్రధాన లక్ష్యమని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ ధిల్లాన్ అన్నారు. ఇది అత్యంత శక్తివంతమైన ఆడి ఎస్‌యూవీ అని చెప్పారు. అలాగే భారీ సంఖ్యలో అమ్ముడుపోయే కారు కాదని, ప్రత్యేకతను కోరుకునే వారి కోసం ఉద్దేశించినదని ఆయన తెలిపారు. ఆర్ఎస్ మోడల్ కార్లకు దేశంలో స్పందన అద్భుతంగా ఉన్నదంటూ ఆడి ఆర్ఎస్ క్యూ8 కార్ల యజమానుల్లో సగం మంది యువ కస్టమర్లేనని బల్బీర్ చెప్పారు.

రూ.400 కోట్లతో కంపెనీల కొనుగోళ్లు

- మాజిల్లానిక్ క్లౌడ్ ఎండీ జోసెఫ్ సుధీర్
- రెండేళ్లలో 3,500 నియామకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఐటీ సేవల సంస్థ మాజిల్లానిక్ క్లౌడ్ భారీ ఎత్తున కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సుమారు రూ.400 కోట్లతో కంపెనీల కొనుగోళ్లు చేపట్టేందుకు రెడీ అవుతున్నట్లు సంస్థ ఎండీ, గ్లోబల్ సీఈఓ జోసెఫ్ సుధీర్ తుమ్మా సోమవారం నాడిక్కడ తెలిపారు. ఐటీ, డ్రోన్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డెవ్‌ఆప్స్, ఈ-సర్వియలెన్స్ వంటి విభాగాల్లో ఈ కొనుగోళ్లు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఏప్రిల్-మే నెల నాటికల్లా అమెరికాలో రూ.200 కోట్లతో ఒక కంపెనీని కొనుగోలు చేయనుండగా జూలై నాటికి మరో రూ.150 కోట్లతో మరో కొనుగోలును చేపట్టనున్నట్లు సుధీర్ తెలిపారు. వీటితో పాటు మిగిలిన మొత్తంతో మరో నాలుగైదు చిన్న కంపెనీలను చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీకి చెందిన అన్ని విభాగాల్లో దాదాపు 1,600 మంది ఉద్యోగులు ఉన్నారని, వచ్చే రెండేళ్లలో కొత్తగా 3,500 నియామకాలు చేపట్టటం ద్వారా మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,000కు చేరుకోనుందని సుధీర్ వెల్లడించారు. కాగా కంపెనీ అనుబంధ సంస్థ స్కాన్‌డ్రోన్..ఈ మధ్యనే కార్గోమ్యాక్స్ 200కేహెచ్‌సీ డ్రోన్‌ను ఆవిష్కరించిందని సుధీర్ తెలిపారు. ఈ డ్రోన్ 200 కిలోల వరకు పేలోడ్ సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు.

డిపాజిట్ ఇన్సూరెన్స్ పరిమితి పెంపు?

ముంబై: బ్యాంకు డిపాజిట్ ఇన్సూరెన్స్ పథకం పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల నుంచి మరింత పెంచే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) కార్యదర్శి నాగరాజు ఈ విషయం వెల్లడించారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే ఆ విషయాన్ని నోటిఫై చేస్తామన్నారు. ముంబై కేంద్రంగా ఉన్న న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ స్కామ్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తున్నట్టు భావిస్తున్నారు.

- ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ప్రకటించిన గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో దేశంలో ప్రీమియర్ బిజినెస్ స్కూల్‌గా ఐఎస్‌బీ తొలి స్థానాన్ని మరోసారి కైవసం చేసుకుంది. అలాగే ప్రపంచంలో తన ర్యాంకింగ్‌ను 31 నుంచి 27వ స్థానానికి పెంచుకుంది. ఆసియాలో 5వ స్థానాన్ని నిలబెట్టుకుంది.
- ప్యాకేజింగ్ సేవలు అందించే అమెరికా సంస్థ సొనోకో ప్రొడక్ట్స్ హైదరాబాద్‌లో పెర్ఫార్మెన్స్ హబ్ పేరుతో తన గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేసింది. రూ.86 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 300 మంది టెక్నాలజిస్టులు పని చేయనున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

'మదరాసి'గా శివకార్తికేయన్



'అమరన్'తో ఘన విజయాన్ని అందుకున్నారు తమిళ నటుడు శివ కార్తికేయన్. ఆ తర్వాత ఆయన హీరోగా, దర్శకుడు ఏ.ఆర్. మురుగదాస్ కలయికలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. శ్రీ లక్ష్మీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ కథానాయిక. సోమవారం శివ కార్తికేయన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా పేరును 'మదరాసి' అని ప్రకటిస్తూ నిర్మాణ సంస్థ గ్లింప్స్ విడుదల చేసింది. ఇందులో శివ కార్తికేయన్ పూర్తిగా పవర్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. సినిమాలోని ఇతర పాత్రలను కూడా గ్లింప్స్‌లో పరిచయం చేశారు.

సినిమాలకు లాజిక్‌తో పని లేదు



కరణ్ జోహార్

కొన్ని సినిమాలకు లాజిక్‌తో పని లేదని, దర్శకుడు ప్రేక్షకులను నమ్మించగలిగితే ఆ చిత్రం సూపర్ హిట్ అవుతుందని అన్నారు బాలీవుడ్ దర్శకనిర్మాత కరణ్ జోహార్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ సినిమా నచ్చితే లాజిక్‌ను ఎవరూ పట్టించుకోరని, టాలీవుడ్ దర్శకుడు రాజమౌళి తీసే సినిమాల్లో లాజిక్స్ గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటారా? లేదు కదా అని ప్రశ్నించారు. రాజమౌళికి కథపై పూర్తి పట్టు ఉంటుందని, ఆయన ఎలాంటి సన్నివేశాన్నైనా ప్రేక్షకులకు నమ్మకం కలిగేలా తెరకెక్కిస్తారని వివరించారు. యానిమల్, ఆర్‌ఆర్‌ఆర్, గదర్... ఈ సినిమాలన్నీ ఇదే ఫార్ములాపై విజయవంతమయ్యాయని కరణ్ జోహార్ చెప్పారు. కాగా, కరణ్ జోహార్ ప్రస్తుతం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమా నిర్మిస్తున్నారు. శశాంక్ ఖైతాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వరుణ్ ధావన్, జాన్వీ కపూర్, సన్య మల్హోత్రా, రోహిత్ శరఫ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 18న విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు.

సూర్య సినిమాలో ఛాన్స్?

'మిస్టర్ బచ్చన్'తో తెలుగు ప్రేక్షకులను పలకరించిన బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం రామ్ పోతినేనితో 'రాపో 22' (వర్కింగ్ టైటిల్), దుల్కర్ సల్మాన్‌తో 'కాంత' వంటి వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఆమెకు మరో క్రేజీ ఆఫర్ దక్కినట్టు తెలుస్తోంది. 'లక్కీ భాస్కర్' సినిమాతో సూపర్‌హిట్ కొట్టిన దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌లోకి కథానాయికగా భాగ్యశ్రీని సంప్రదించగా, దానికి ఆమె పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. మే నుంచి ఈ సినిమాను పట్టాలెక్కించడానికి ప్లాన్ చేస్తున్నారు.





ఈ ప్రయాణంలో ఎన్నో జ్ఞాపకాలు

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ఇటీవలె తన తల్లి మాధవితో కలసి మహాకుంభమేళాకు వెళ్లిన సంగతి తెలిసిందే. వారిద్దరూ ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర స్నానం చేసిన ఫొటోలు అభిమానులతో పంచుకున్నారు. అనంతరం కాశీనాథుని ఆలయాన్ని కూడా వీరు సందర్శించారు. తాజాగా మహాకుంభమేళాకు చెందిన మరికొన్ని ఫొటోలను విజయ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సందర్భంగా తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ పోస్టు పెట్టారు. ఈ ప్రయాణం ఎన్నో జ్ఞాపకాలను అందించిదని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండతో పాటు అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, దర్శకుడు వంశీ పైడిపల్లి, మరికొందరు స్నేహితులు ఉన్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

పెద్ద హిట్ కొట్టబోతున్నాం

సందీప్ కిషన్



సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మజాకా'. 'మన్మథుడు' ఫేమ్ అన్షు, రావు రమేశ్ కీలక పాత్రలు పోషించారు. త్రినాథరావు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 26న విడుదలవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్,పాటలకు మంచి స్పందన వస్తోంది. తాజాగా, ఈ సినిమాలో 'రావులమ్మ' పాట చిత్రీకరణను లైవ్‌గా చూపించారు. తెలుగులో ఒక సినిమా షూటింగ్‌ను లైవ్‌లో అందించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ "ఈ సినిమాతో పెద్ద హిట్ కొట్టబోతున్నాం. సినిమా కచ్చితంగా అందరికీ విందు భోజనంలా ఉంటుంది" అని చెప్పారు. "మజాకా'లో ఇది సెకండ్ మాస్ సాంగ్ హీరో సందీప్ కిషన్, హీరోయిన్ రీతూ వర్మ ఇరగదీశారు. సాంగ్ అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ పాటతో థియేటర్లు దద్దరిల్లిపోతాయి. బ్లాక్‌బస్టర్ కొట్టబోతున్నాం" అని దర్శకుడు త్రినాథరావు చెప్పారు. "సినిమా చాలా బాగా వచ్చింది" అని నిర్మాత రాజేశ్ దండా అన్నారు. "ఇది థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాల్సిన సినిమా" అని రీతూ వర్మ అన్నారు.



ప్రతీ కుటుంబం కనెక్ట్ అయ్యే చిత్రం

ధనరాజ్

కామెడీ నటుడు ధనరాజ్ కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. 'అల వైకుంఠపురం', 'పుష్ప' చిత్రాలతో తెలుగు వారికి చేరువైన నటుడు సముద్రఖని కీలక పాత్రలో నటించారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వి పోలవరపు నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. హీరో ధనరాజ్ మాట్లాడుతూ "ఈ సినిమా ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తుంది. ప్రతీ కుటుంబానికి కనెక్ట్ అయ్యే కథాంశమిది" అని చెప్పారు. నటుడు సముద్రఖని మాట్లాడుతూ "ఇది నాకు చాలా బాగా నచ్చిన కథ. సినిమా విజయంపై నమ్మకముంది. దర్శకుడు చాలా జెన్యూన్‌గా ఈ కథను రాయడంతో పాటు అంతే నిజాయితీగా సినిమాను తెరకెక్కించారు" అని చెప్పారు. చిత్ర నిర్మాత పృథ్వి మాట్లాడుతూ "ఈ సినిమా ఒక అద్భుతమైన ఎమోషనల్ జర్నీ. ఈ సినిమాతో ధనరాజ్ మరో స్థాయికి చేరుకుంటారు" అని తెలిపారు.

అప్పుడు ఉరి.. ఇప్పుడు ఛావా

- బాలీవుడ్‌కు తొలి బోణి
- మూడు రోజుల్లో రూ. వంద కోట్లు



బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌కు రెండు అక్షరాల టైటిల్స్ కలసి వస్తున్నట్లు కనిపిస్తోంది. ఆయన నటించిన తాజా చిత్రం 'ఛావా' అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. ఇంతకుముందు చారిత్రక కథాంశాలతో వచ్చిన 'తానాజీ', 'కేసరి' చిత్రాలకంటే ఈ నెల 14న విడుదలైన 'ఛావా' కలెక్షన్లు భారీ స్థాయిలో ఉండడం దర్శకనిర్మాతల్లో ఉత్సాహాన్ని పెంచింది. అజయ్ దేవగన్, సైఫ్ అలీఖాన్ నటించిన 'తానాజీ' చిత్రం తొలి రోజున కేవలం రూ. 15 కోట్లే వసూలు చేసింది. అలాగే అక్షయ్‌కుమార్, పరిణీతి చోప్రా నటించిన 'కేసరి' చిత్రం మొదటి రోజున రూ. 21.06 కోట్లకే పరిమితం కాగా, 'ఛావా' తొలి రోజు రూ. 31 కోట్లు వసూలు చేసి ముందు వరుసలో నిలిచింది.

బాలీవుడ్‌కు కొత్త ఊపిరి

కొత్త సంవత్సరంలో తొలి నెల బాలీవుడ్‌కు అంతగా కలసి రాలేదనే చెప్పాలి. అక్షయ్‌కుమార్ నటించిన 'స్కై ఫోర్స్', కంగనా రనౌత్ 'ఎమర్జెన్సీ', సోనూ సూద్ నటించిన 'ఫతే' చిత్రాలు పరవాలేదనిపించాయి కానీ 'అబ్బో' అని గొప్పగా చెప్పుకొనేంత విజయాలు అందించలేకపోయాయి. ఆ తర్వాత వచ్చిన మూడు చిత్రాలు 'దేవా', 'లవ్ యాపా', 'ఆజాద్' సినిమాలు కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయాయి. వరుస అపజయాలతో నిరాశలో మునిగిన బాలీవుడ్‌కు 'ఛావా' చిత్రానికి వస్తున్న వసూళ్లు కొత్త ఊపిరినిచ్చాయి. కొత్త సంవత్సరంలో బిగ్గెస్ట్ ఓపెనర్ ఇదేనని బీ టౌన్ వర్గాలు పేర్కొంటున్నాయి. బాలీవుడ్‌లో మొదటి నాలుగు రోజుల వసూళ్లలో అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' చిత్రమే ఇప్పటికి టాప్. 'ఛావా' సినిమా ఆ వసూళ్లను అధిగమించి ముందు వరుసలో నిలిచింది. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ జీవిత కథ ఆధారంగా రూపుదిద్దుకున్న 'ఛావా' చిత్రంలో విక్కీ శంభాజీ పాత్ర పోషించారు. ఆయన భార్యగా రష్మిక నటించారు. అందరూ ఊహించినట్లుగానే మహారాష్ట్ర సర్క్యూట్‌లో ఈ సినిమా దుమ్ము దులుపుతోంది. రూ. 130 కోట్ల బడ్జెట్‌తో తయారైన ఈ చిత్రం తొలి రెండు రోజుల్లో రూ. 60 కోట్లు వసూలు చేసింది. మూడో రోజుకే రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరి రూ. 108 కోట్లు కలెక్ట్ చేసి సరికొత్త రికార్డ్ నెలకొల్పింది. కలెక్షన్ల ఉధృతి ఇలాగే కొనసాగితే పీరియడ్ డ్రామా చిత్రాల్లో 'ఛావా' హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయి.

సినిమా మీద మొదటి నుంచి సోషల్ మీడియాలో పాజిటివ్ పబ్లిసిటీ జరగడం, అక్షయ్ ఖన్నా, రష్మిక, అషుతోష్ రాణా, దివ్య దత్తా వంటి స్టార్స్ నటించడం వంటి అంశాలు 'ఛావా' సినిమాకు కలిసొచ్చి ప్రేక్షకులను థియేటర్లకు లాక్కెళ్లాయి. భారీ ఓపెనింగ్స్ తెచ్చి పెట్టాయి.

విక్కీకి ఇది రెండో హయ్యెస్ట్ గ్రాసర్

హీరో విక్కీ నటించిన 'ఉరి.. ద సర్జికల్ స్ట్రైక్' దాదాపు రూ. 240 కోట్లు వసూలు చేసింది. అలియా భట్‌తో కలసి నటించిన 'రాజీ' చిత్రం అటుఇటుగా రూ. 123 కోట్లు వసూలు చేసి ఆయనకి రెండో హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలించింది. కానీ సోమవారం సాయంత్రానికే 'ఛావా' రూ. 124 కోట్లు వసూలు చేసి, 'రాజీ'ని దాటేసి రెండో స్థానంలో నిలిచింది. ఈ వారం 'ఛావా' చిత్రానికి పోటీగా వచ్చే కొత్త సినిమాలు ఏవీ లేకపోవడంతో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.



రష్మికకు మరో భారీ హిట్

'పుష్ప' చిత్రంతో ఉత్తరాదిలో అలజడి సృష్టించి, ఆలిండియా క్రష్‌గా మారిన రష్మిక ఖాతాలో ఇప్పుడు మరో భారీ హిట్ పడింది. కాలికి గాయమైనప్పటికీ వీల్ ఛైర్‌లో కూర్చుని 'ఛావా' ప్రమోషన్స్‌కు ఆమె హాజరు కావడం కూడా ప్రేక్షకుల్ని కదిలించిందనే చెప్పాలి. శంభాజీ భార్య యేసు బాయిగా సినిమాలో ఆమె పాత్ర పరిధి తక్కువే అయినా ఉన్నంత కాసేపు బాగా నటించిందనే పేరు రష్మికకు వచ్చింది.

ఆ రోజు మరో రూ.యాభై కోట్లు వచ్చేనా?

బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి. మహారాష్ట్రలో దీన్ని చాలా ఘనంగా జరుపుతారు. శివాజీ తనయుడు శంభాజీ కథతో రూపొందిన చిత్రం 'ఛావా' కనుక ఆ రోజు కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. ఆ ఒక్క రోజే రూ. 50 కోట్లు వసూలు చేస్తే ఇక 'ఛావా'కు తిరుగే లేదు.



మొదలైంది.. సందడి

కరాచీ: దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ ప్రధాన టోర్నమెంట్ జరుగుతుండడంతో పాకిస్థాన్‌లో ఎటు చూసినా క్రికెట్ సందడి కనిపిస్తోంది. 1996 వన్డే వరల్డ్‌కప్ తర్వాత భద్రతా కారణాల రీత్యా ఇక్కడ ఎలాంటి ఐసీసీ టోర్నీలు జరుగలేదు. మళ్లీ ఇన్నాళ్లకు ఈనెల 19 నుంచి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి పాక్ ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. ఇందు కోసం కరాచీ, లాహోర్, రావల్పిండిలోని స్టేడియాలను ఆధునీకీకరించారు. ఇక ఎప్పుడెప్పుడా అని పాక్ క్రికెట్ అభిమానులు టోర్నీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తుండగా, బుధవారం ఆరంభ పోరులో పాక్-కివీస్ కరాచీలో తలపడనున్నాయి. అయితే టీమిండియా పాక్‌కు రాకపోవడంతో అభిమానుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. తమ దేశంలో భారత జట్టును కూడా ఇష్టపడతారని, అలాగే విరాట్‌కు పెద్ద ఎత్తున ఫ్యాన్స్ ఉన్నారంటూ స్థానిక దుకాణం యజమాని మొయిజ్ తెలిపాడు. అందుకే తమ దుకాణంలో పాక్‌తో పాటు భారత జెర్సీలు కూడా అమ్ముడుపోతాయని, గత మూడు రోజుల్లో ఈ రెండింటిని 5000 వరకు అమ్మినట్టు తెలిపాడు. ఇతర మ్యాచ్‌ల సమయాల్లోనూ కోహ్లీ ఫొటోలను ప్రదర్శించేందుకు, అతడి పేరున్న షర్ట్‌లను వేసుకునేందుకు ఇష్టపడతారన్నాడు. మరోవైపు టోర్నీ సందర్భంగా పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

చాంపియన్స్ ట్రోఫీ రేపటినుంచే



బుమ్రా లోటును భర్తీ చేస్తాడా?

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందే పేస్ దళపతి బుమ్రా గాయం కారణంగా దూరమవడంతో టీమిండియాకు గట్టి ఝలక్ తగిలినట్టయింది. ప్రాథమిక జట్టులో బుమ్రా పేరును చేర్చినా వెన్నునొప్పితో బాధపడుతుండడంతో అతడికి విశ్రాంతినివ్వడమే మేలని బీసీసీఐ భావించింది. దీంతో ఇప్పుడు బౌలింగ్ భారమంతా వెటరన్ స్టార్ పేసర్ మహ్మద్ షమిపై పడింది. మరిప్పుడు కీలకమైన ఈ టోర్నీలో బుమ్రా లోటును భర్తీ చేస్తూ షమి జట్టుకు అండగా నిలుస్తాడా?

రెండేళ్ల క్రితం భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్ తర్వాత గాయం కారణంగా షమి ఏడాదిపాటు క్రికెట్‌కు దూరమయ్యాడు. గతేడాది చివర్లో దేశవాళీతో మళ్లీ బంతి పట్టిన షమి.. ఆ టోర్నీల్లో అద్భుత ప్రదర్శనతో సత్తా చాటాడు. అంతే కాదు.. ఇటీవల జాతీయ జట్టులోకి పునరాగమనం చేసి ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనూ ఆకట్టుకున్నాడు. అయితే బుమ్రా లేని వేళ.. జట్టు 12 ఏళ్ల చాంపియన్స్ ట్రోఫీ కలను నెరవేర్చడంలో షమి కీలకంగా వ్యవహరిస్తాడా? అనే సందేహం అందరి మదిలోనూ ఉంది. కానీ, షమి ప్రదర్శనపై అనుమానాలు అవసరం లేదనీ, అతడు కచ్చితంగా మెగా ఈవెంట్‌లో సత్తా చాటుతాడని టీమిండియా మాజీ పేసర్ లక్ష్మీపతి బాలాజీ విశ్వాసం వ్యక్తం చేశాడు. అపార అనుభవమున్న షమి.. కచ్చితంగా బుమ్రాను మరిపిస్తాడన్నాడు. 'వాస్తవానికి షమి 2019లోనూ, అలాగే చివరి వన్డే వరల్డ్‌కప్‌లోనూ బుమ్రాకు మించి ప్రదర్శన కనబర్చాడు. అన్ని ఫార్మాట్లలోనూ బుమ్రా చాంపియన్ బౌలర్. కానీ బుమ్రా జట్టులోకి రాకముందు భారత బౌలింగ్‌ను షమినే ముందుకు నడిపించిన విషయం గుర్తుంచుకోవాలి. భారత్ విశేషంగా రాణించాలంటే.. షమి కొత్త బంతితో తొలి ఆరు ఓవర్లలో ప్రభావం చూపాల్సి ఉంటుంది. గాయం నుంచి కోలుకున్నాక అతడి బౌలింగ్‌లో వేగం స్వల్పంగా తగ్గిన మాట వాస్తవం. కానీ షమి తన మణికట్టు సహాయంతో వైవిధ్యమైన బంతులను వేయగలడు. అతడి సీమ్‌ను అంచనా వేయడం బ్యాటర్లకు అంత సులువు కాదు. దుబాయ్‌లో పరిస్థితులు కూడా భారత్‌లో మాదిరే ఉంటాయి. కాబట్టి షమి ప్రణాళికలకు తగ్గట్టు బౌలింగ్ చేస్తే చాలు' అని బాలాజీ సూచించాడు. షమి బాధ్యత వికెట్లు తీయడమే కాదని, జట్టులో యువ పేసర్లు అర్ష్‌దీప్, హర్షిత్ రాణాలకు మార్గనిర్దేశకుడిగా ఉండాల్సిన అవసరం ఉందన్నాడు.



షమి

'బ్లాక్' టిక్కెట్లకు భారీ డిమాండ్!

ఒక్కోటి రూ. 5 లక్షలు

భారత్ x పాక్ పోరు

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో అన్ని మ్యాచ్‌లూ ఓ ఎత్తయితే.. భారత్-పాకిస్థాన్ మధ్య జరిగే లీగ్ పోరు మరో ఎత్తు. ఆ క్రమంలోనే ఈనెల 23న దుబాయ్‌లో జరిగే మ్యాచ్ టిక్కెట్లకోసం డిమాండ్ అలా ఇలా లేదు. దానిని బ్లాక్‌మార్కెటీర్లు పూర్తిగా 'క్యాష్' చేసుకుంటున్నారు! దాంతో మ్యాచ్ టిక్కెట్ రేట్ అమాంతం రూ. 4 లక్షలకు చేరింది. ఇది గ్రాండ్‌స్టాండ్‌లో ఉండేసీటు ఖరీదు. మామూలుగా అయితే ఈ టిక్కెట్ ధర రూ. 1.80 లక్షలు మాత్రమే. ఇదే స్టాండులో కొంత ప్రత్యేకంగా ఉండే సీటు కావాలంటే రూ. ఐదు లక్షలు వెచ్చించాల్సిందే. కాగా.. మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాలను ఈనెల మూడునే ప్రారంభించారు. విక్రయాలు ప్రారంభమైన నిమిషాల్లోనే అన్ని టిక్కెట్లూ అమ్ముడవడంతో 25వేల సీట్ల సామర్థ్యం కలిగిన దుబాయ్ స్టేడియంలో..ఇండో-పాక్ మ్యాచ్‌కు మరో దఫా టిక్కెట్లను విక్రయించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి నిర్ణయించింది. దాంతో ఆదివారం (16న)నాడు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30కు రెండోసారి టిక్కెట్ల అమ్మకాలు మొదలవగా..కొద్ది సేపటికే అయిపోయాయి. దరిమిలా..బ్లాక్ టిక్కెట్లకు బాగా డిమాండ్ ఏర్పడింది. మరోవైపు భారత్-న్యూజిలాండ్ మ్యాచ్‌తో పాటు సెమీఫైనల్ టిక్కెట్లు కూడా అందుబాటులో ఉండడం గమనార్హం.

వీఐపీ బాక్సు వద్దు

ఆ టిక్కెట్లను అమ్మి పీసీబీకివ్వండి ● చైర్మన్ నఖ్వీ సూచన



కరాచీ: అసలే పాకిస్థాన్ ఆర్థిక ఇక్కట్లలో కూరుకుపోయింది. ఈ తరుణంలో చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి దక్కింది. దాంతో కరాచీ, లాహోర్, రావల్పిండి స్టేడియాలను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాల్సి వచ్చింది. ఇందుకోసం పీసీబీ దాదాపు 600 కోట్ల రూపాయలు వెచ్చించిందని సమాచారం. ఫలితంగా పీసీబీ కూడా ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటోంది. ఇకపోతే..టోర్నీ బ్లాక్‌బస్టర్ భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఈనెల 23న దుబాయ్‌లో జరగనుంది. ఈ పోరును పీసీబీ చీఫ్‌గా మొహిసీన్ నఖ్వీకి దుబాయ్ స్టేడియంలో రూ. 3.47 కోట్ల ఖరీదైన వీఐపీ బాక్సు నుంచి చూసే అవకాశం ఉంది. ఇందులో 30 సీట్లుంటాయి. అయితే నఖ్వీ ఆ బాక్సునుంచి మ్యాచ్‌ను చూసేందుకు నిరాకరించాడు. సాధారణ ఎన్‌క్లోజర్ నుంచే తాను పోటీని వీక్షిస్తానని స్పష్టంజేశాడు. అంతేకాదు..తనకు కేటాయించిన వీఐపీ బాక్సు టిక్కెట్లను అమ్మడం ద్వారా వచ్చిన మొత్తాన్ని పీసీబీ ఖాతాకు జమ చేయాలని ఎమిరేట్స్ క్రికెట్ బోర్డుతోపాటు అంతర్జాతీయ క్రికెట్ మండలికి అతడు సూచించాడు.

కరాచీ స్టేడియంలో కనిపించని భారత జెండా

పీసీబీ తీరుపై విమర్శలు



మరో 24 గంటల్లో ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుండగా.. ఆతిథ్య పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీరుపై పెద్ద ఎత్తున వివాదం రేగింది. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ సహా ఎనిమిది జట్లు పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఈమేరకు కరాచీలోని నేషనల్ స్టేడియంలో టోర్నీలో తలపడుతున్న దేశాల పతాకాలను ఎగుర వేశారు. వాటిలో భారత జెండా లేకపోవడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్టేడియంలో మువ్వన్నెల పతాకం లేని వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. భారతీయులు, ఇతర నెటిజన్లు పీసీబీ తీరును ఎండగడుతున్నారు. అంతకుముందు లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. చాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి అక్కడ ఓ కార్యక్రమం జరిగింది. ఆ సందర్భంగా కూడా..భారత్ పతాకం తప్ప టోర్నమెంట్‌లో పాల్గొంటున్న మిగిలిన ఏడు జట్ల దేశాల జెండాలు ఆ స్టేడియంలో కనిపించాయి.

అందుకే భారత జెండా లేదు...

అయితే స్టేడియాల్లో భారత జెండా పెట్టకపోవడానికి కారణం ఆ దేశం పాకిస్థాన్ రాకపోవడమేనని పీసీబీ స్పష్టం చేసింది. తమ దేశంలో ఆడే జట్లకు సంబంధించిన జెండాలను మాత్రమే స్టేడియాల్లో ఎగురవేశామని తెలిపింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని పీసీబీ వెల్లడించింది.



వ్యక్తిగత చెఫ్ లేకపోయినా..

దుబాయ్: ఫిట్‌నెస్, డైట్ విషయంలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కచ్చితంగా ఉంటాడు. అందుకే క్రికెట్ పర్యటనల్లోనూ వ్యక్తిగత చెఫ్‌ను వెంట తీసుకెళ్లేవాడు. కానీ ఇప్పుడు సీన్ మారింది. బీసీసీఐ కొత్త నిబంధనల ప్రకారం ఏ ఆటగాడైనా తమ కుటుంబ సభ్యులతో పాటు సొంత చెఫ్‌ను వెంట తీసుకెళ్లడానికి వీల్లేదు. దీంతో చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్‌లో ఉన్న విరాట్ తనకిష్టమైన ఆహారం కోసం భలే ప్లాన్ వేశాడు. ఆదివారం ప్రాక్టీస్‌కు వచ్చిన కాసేపటికే స్థానిక మేనేజర్‌ను పిలిచి తనకు ఎలాంటి ఆహారం కావాలో పూర్తిగా వివరించాడు. వెంటనే అతడు స్థానిక రెస్టారెంట్ నుంచి ప్రత్యేక ఫుడ్ ప్యాకెట్లను తెప్పించాడు. సెషన్ పూర్తయ్యాక ఇతర ఆటగాళ్లంతా తమ కిట్లను సర్దుకునే సమయంలోనే.. కోహ్లీ తన భోజనాన్ని అక్కడే కానిచ్చాడు. అలాగే మిగిలిన ప్యాకెట్లను ప్రయాణంలో తినేందుకు దాచుకున్నాడు.

ఖేలో ఇండియా శీతాకాల క్రీడలు వాయిదా

గుల్మార్గ్ (జమ్మూ కశ్మీర్): ఖేలో ఇండియా శీతాకాల క్రీడల రెండో అంచె పోటీలు వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం శనివారమే ఈ క్రీడలు ఆరంభమవ్వాలి. అయితే గుల్మార్గ్‌లో క్రీడల నిర్వహణకు అనుకూల వాతావరణం లేకపోవడంతో పాటు హిమపాతం తక్కువగా ఉండడంతో వాయిదా వేసినట్టు కేంద్ర క్రీడాశాఖ తెలిపింది. వాతావరణం మెరుగయ్యాక పరిస్థితులను అంచనా వేసి కొత్త తేదీలను ప్రకటిస్తామని క్రీడాశాఖ వెల్లడించింది.



మనూ భాకర్‌కు బీబీసీ అవార్డు

'జీవిత సాఫల్యా'నికి మిథాలీ ఎంపిక

న్యూఢిల్లీ: ప్రఖ్యాత షూటర్ మనూ భాకర్ బీబీసీ అవార్డుకు ఎంపికైంది. ఆమెను బీబీసీ 'స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ఇండియా'గా సోమవారం ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చినందుకుగాను భాకర్‌కు ఈ అవార్డు లభించింది. మనూతోపాటు గోల్ఫర్ అదితి అశోక్, పారా షూటర్ అవని లేఖారా, టీమిండియా వైస్-కెప్టెన్ స్మృతీ మంధాన, స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ ఈ అవార్డుకు పోటీపడ్డారు. అయితే ప్రఖ్యాత క్రీడా పాత్రికేయులు, రచయితలతో కూడి జ్యూరీ మనూ భాకర్‌ను ఎంపిక చేసింది. 22 ఏళ్ల భాకర్ పారిస్ ఒలింపిక్స్ 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాలలో కాంస్య పతకాలు నెగ్గిన సంగతి తెలిసిందే. ఇంకా.. పారా ఆర్చర్ శీతల్ దేవి (బీబీసీ ఎమర్జింగ్ ప్లేయర్), భారత మహిళల జట్టు మాజీ సారథి మిథాలీ రాజ్ (జీవిత సాఫల్య), పారా షూటర్ అవని (పారా స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ద ఇయర్) పురస్కారాలకు ఎంపికయ్యారు. ఇక..చెస్ క్రీడాకారిణి తానియా సచ్‌దేవ్‌ను 'చేంజ్ మేకర్' అవార్డు వరించింది.

విదర్భ 308/5

ముంబైతో రంజీ సెమీస్

నాగ్‌పూర్: డానిష్ మలివార్ (79), ధ్రువ్ షోరె (74) రాణించడంతో.. డిఫెండింగ్ చాంప్ ముంబైతో సోమవారం ఆరంభమైన రంజీ సెమీస్‌లో విదర్భ భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 308/5 స్కోరు చేసింది. యశ్ రాథోడ్ (47), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (13) క్రీజులో ఉన్నారు. కరుణ్ నాయర్ (45) ఫర్వాలేదనిపించాడు. శివం దూబే, షామ్స్ ములాని చెరో 2 వికెట్లు పడగొట్టారు.



డానిష్ (79)

ఆదుకొన్న సచిన్ బేబీ... కేరళ 206/4: సచిన్ బేబీ (69 బ్యాటింగ్) అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. గుజరాత్‌తో మొదలైన రంజీ సెమీస్ మ్యాచ్‌లో కేరళ కోలుకొంది. టాస్ గెలిచి బరిలోకి దిగిన కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. మొదటి రోజు ఆట చివరకు బేబీతోపాటు అజరుద్దీన్ (30) క్రీజులో ఉన్నారు. రోహన్ కున్నుమ్మల్ (30), అక్షయ్ చంద్రన్ (30), జలజ్ సక్సేనా (30) ఫర్వాలేదనిపించారు.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
గుజరాత్ x ముంబై
రాత్రి 7.30 నుంచి



స్మృతి మంధాన (81)

మెరిసిన మంధాన

ఢిల్లీపై బెంగళూరు విజయం

వడోదర: కెప్టెన్ స్మృతి మంధాన (47 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 81) ధనాధన్ అర్ధ శతకంతో.. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. తొలుత ఢిల్లీ 19.3 ఓవర్లలో 141 పరుగులకు కుప్పకూలింది. జెమీమా రోడ్రిగ్స్ (34), సారా బ్రైస్ (23) టాప్ స్కోరర్లు. రేణుక, జార్జియా వేర్హమ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 16.2 ఓవర్లలో 146/2 స్కోరు చేసి గెలిచింది.

ఆరంభం నుంచే జోరు..: ఓ మాదిరి లక్ష్యం కోసం బరిలోకి దిగిన చాలెంజర్స్‌కు ఓపెనర్ స్మృతి మంధాన అదిరే ఆరంభాన్నిచ్చింది. తొలి ఓవర్‌లోనే రెండు బౌండ్రీలు బాదిన మంధాన.. ఆ తర్వాత మరో రెండు ఫోర్లు కొట్టింది. మరో ఓపెనర్ డానీ వ్యాట్ (42) కూడా రెండు బౌండ్రీలతో టచ్‌లోకి రావడంతో స్కోరు బోర్డు ఊపందుకొంది. ఐదో ఓవర్‌లో అరుంధతి బౌలింగ్‌లో మంధాన సిక్స్ బాదగా.. శిఖా వేసిన ఆరో ఓవర్‌లో వ్యాట్ రెండు ఫోర్లు సాధించింది. దీంతో పవర్‌ప్లేను బెంగళూరు 57/0తో ముగించింది. తొమ్మిదో ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టిన మంధాన.. సింగిల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొంది. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి బెంగళూరు స్కోరు సెంచరీ దాటింది. అయితే, 11వ ఓవర్‌లో వ్యాట్‌ను అరుంధతి అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 9 పరుగులు కావల్సి ఉండగా.. స్మృతిని పాండే అవుట్ చేసింది. కానీ, పెర్రీ (7 నాటౌట్), రిచా (11 నాటౌట్) మరో 22 బంతులు మిగిలుండగానే జట్టును గెలుపు గీత దాటించారు.

రోడ్రిగ్స్ మినహా..: షఫాలీ వర్మ (0)ను రేణుక డకౌట్ చేసినా.. కెప్టెన్ మెగ్ లానింగ్ (17) సహకారంతో జెమీమా రోడ్రిగ్స్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. పవర్‌ప్లేను ఢిల్లీ 55/1తో ముగించింది. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లోనే వేర్హమ్ బౌలింగ్‌లో రోడ్రిగ్స్ స్టంపౌట్ కావడంతో.. రెండో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో రెండు పరుగుల తేడాతో లానింగ్ కూడా వెనుదిరగడంతో ఢిల్లీ బ్యాటింగ్ ఒక్కసారిగా కుదుపులకు గురైంది. ధాటిగా ఆడే ప్రయత్నం చేస్తున్న సదర్లాండ్ (19)ను రేణుక పెవిలియన్ చేర్చగా.. జొనాసెన్ (1), కాప్ (12)ను ఏక్తా బిస్త్ అవుట్ చేయడంతో ఢిల్లీ 105/6తో ఇబ్బందుల్లో పడింది. అయితే, డెత్ ఓవర్లలో బ్రైస్, పాండే (14) ఏడో వికెట్‌కు 25 పరుగులు జోడించడంతో.. టీమ్ స్కోరు 140 మార్క్ దాటింది.

సంక్షిప్తస్కోర్లు

ఢిల్లీ: 19.3 ఓవర్లలో 141 ఆలౌట్ (జెమీమా రోడ్రిగ్స్ 34, సారా బ్రైస్ 23; రేణుకా సింగ్ 3/23, వేర్హమ్ 3/25, కిమ్ గార్త్ 2/19, ఏక్తా బిస్త్ 2/35).
బెంగళూరు: 16.2 ఓవర్లలో 146/2 (స్మృతి మంధాన 81, డానీ వ్యాట్ 42; అరుంధతి 1/25, శిఖా పాండే 1/27).

రెండు బెయిల్స్ పడితేనే..

రెండురోజుల క్రితం ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ నెగ్గడం వివాదాస్పదమైంది. గెలుపు రన్ తీసే క్రమంలో ఢిల్లీ బ్యాటర్ అవుటైనా.. థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడాన్ని ఫ్యాన్స్ తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో డబ్ల్యూపీఎల్‌లో నిబంధనల సవరణపై బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. జింగిల్ బెయిల్స్ సరిగా పని చేయడం లేదని గుర్తించిన నేపథ్యంలో.. ఎల్‌ఈడీ లైట్లు వెలిగితే అవుట్‌గా పరిగణించడంలేదని తెలిపింది. రెండు బెయిల్స్ పడిపోతేనే అవుటైనట్టుగా ప్రకటించింది. మ్యాచ్ రోజు ఉదయమే అంపైర్లకు ఈ విషయం తెలిపినా.. జట్లకు మాత్రం మ్యాచ్ తర్వాత వివరించారు.

దీప్తి, రవిపై పతక అంచనాలు

నేటి నుంచి జాతీయ పారా అథ్లెటిక్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పారిస్ పారా ఒలింపియన్లు జీవాంజి దీప్తి (వరంగల్), రొంగలి రవి (అనకాపల్లి) పతక అంచనాలతో బరిలోకి దిగుతున్నారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా మంగళవారం నుంచి జరగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి 37 మంది క్రీడాకారులు 48 ఈవెంట్లలో, తెలంగాణ నుంచి 28 మంది క్రీడాకారులు 50 ఈవెంట్లలో పోటీ పడుతున్నారు. మూడ్రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 1,476 మంది పారా అథ్లెట్లు 155 ఈవెంట్లలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సన్నద్ధమయ్యారు.

హార్దిక్ మూడేళ్లు మ్యాగీ తిని బతికాడు!



న్యూఢిల్లీ: పేద కుటుంబం నుంచి వచ్చిన హార్దిక్ పాండ్యా..ప్రస్తుతం భారత క్రికెట్ జట్టులో అంతర్భాగం. తొలినాళ్లలో అతడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ విషయాన్ని ప్రస్తుతం హార్దిక్ కెప్టెన్‌గా ఉన్న ఐపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ యజమానురాలు నీతా అంబానీ ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. 'ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలికి తీసే మా బృందం పదేళ్ల కిందట హార్దిక్, క్రునాల్ పాండ్యా సోదరులను నా వద్దకు తీసుకొచ్చింది. వారితో మాట్లాడాను. డబ్బు లేకపోవడం వల్ల తాము మూడేళ్లుగా మ్యాగీ మాత్రమే తిని జీవించామని హార్దిక్ అప్పట్లో నాకు చెప్పాడు' అని ఆమె వెల్లడించారు. ఇక తమ జట్టు స్టార్ పేసర్ బుమ్రా గురించి చెబుతూ 'ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ బౌలింగ్ యాక్షన్ ఉన్న కుర్రాడిని మా బృందం తీసుకొచ్చింది. అతడు నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు చూస్తే..బంతితో మాట్లాడుతున్నాడనిపించేది. ఆ బౌలరే ఇప్పుడు ప్రపంచం గర్వించదగ్గ పేసరయ్యాడు' అని నీతా వివరించారు.



ప్రతిభకేదీ గుర్తింపు?

అంతర్జాతీయ అథ్లెట్ యర్రాజి జ్యోతి ఆవేదన

ఒలింపిక్స్, ఆసియా క్రీడలు.. రెండింటిలోనూ పాల్గొన్న తొలి తెలుగు ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ ఆమె. విశాఖ ఎక్స్‌ప్రెస్‌గా దేశం మొత్తం గుర్తింపు తెచ్చుకున్న ఆ తెలుగమ్మాయికి స్వరాష్ట్రంలో మాత్రం చిన్నచూపే. ఆసియా క్రీడలు మొదలు జాతీయ క్రీడల వరకు ఎన్ని పతకాలు, రికార్డులు సాధించినా సరైన గుర్తింపు లభించక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. రైల్వేస్‌లో వచ్చే చాలీచాలని జీతం, వయసు మీద పడిన తల్లిదండ్రుల బాధ్యత, రెండు గదుల ఇరుకైన ఇంట్లో కనీసం పడుకోడానికి చోటు కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్న భారత స్టార్ అథ్లెట్ యర్రాజి జ్యోతి కష్టాలు ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

విశాఖపట్నంలోని కైలాసపురం, మధుసూదన్ నగర్‌లో రెండు గదుల ఇరుకైన ఇంట్లో మేము నివాసముంటున్నాం. ఇంట్లోని సామాన్ల మధ్యే ఐదుగురం రెండు గదుల్లో ఇరుక్కొని పడుకుంటాం. నాన్న సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా రూ.ఆరు వేల జీతానికి పనిచేస్తాడు. అమ్మ.. కుమారి కొద్ది నెలల కిందటి వరకు నాలుగిళ్లలో పనిచేసేది. ఆమె ఆరోగ్యం బాగుండకపోవడంతో పని మాన్పించాం. అన్నయ్య సురేష్ పోర్టులో చిన్న ఉద్యోగం. పడుకోవడానికి తగినంత చోటు లేక అన్నయ్య ఎక్కువ నైట్ డ్యూటీలకు వెళ్తుంటాడు. నేను ప్రస్తుతం రైల్వేస్‌లో జూనియర్ క్లర్క్‌గా రూ.25 వేలకు ఉద్యోగం చేస్తున్నా. నాన్న, అన్నయ్య సంపాదనతో ఇల్లు గడుస్తోంది. నాకొచ్చే జీతం నా శిక్షణ ఖర్చులకు కూడా సరిపోవు. ఇంతటి దయనీయ పరిస్థితుల్లో ఉన్న మమ్మల్ని పట్టించుకునేవారే కరవయ్యారు.

క్రికెటర్ల కంటే ఏం తక్కువ..



క్రికెట్‌కు, క్రికెటర్లకు భారీస్థాయిలో పురస్కారాలు, నజరానాలు ఇస్తున్నారు. కానీ నాలాంటి అథ్లెట్లపై ఎందుకింత వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదు. ప్రపంచంలో ఒలింపిక్స్ కంటే ప్రతిష్ఠాత్మకమైన క్రీడా పోటీలు ఏం ఉంటాయి? అలాంటి ఒలింపిక్స్‌లో నేను గత ఏడాది గాయాన్ని కూడా లెక్క చేయకుండా పాల్గొన్నా. ఆసియా క్రీడల్లో (2022) 100 మీటర్ల హర్డిల్స్‌లో రజతం సాధించిన తొలి భారత, తెలుగు అథ్లెట్‌గా చరిత్ర సృష్టించినా నా కష్టాన్ని గుర్తించిన వారు లేరు. ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో (2023) 100 మీటర్ల హర్డిల్స్ స్వర్ణం, 200 మీటర్ల హర్డిల్స్ రజత పతకాలు అందించా. ఈ పోటీల్లో స్వర్ణం నెగ్గిన తొలి భారత, తెలుగు అథ్లెట్‌ను కూడా నేనే. వరసగా మూడు జాతీయ క్రీడల్లో పసిడి, రజత పతకాలు కైవసం చేసుకున్నా. ఐదుసార్లు జాతీయ రికార్డులు నెలకొల్పా. ఇన్ని సాధించినా గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నన్ను సరైన రీతిలో గుర్తించలేదు. ఉద్యోగం, ఇంటి స్థలం కోసం ఎన్ని దరఖాస్తులు పెట్టినా అవి బుట్టదాఖలే అవుతున్నాయి. నా విజ్ఞప్తి ఒక్కటే క్రికెటర్లతో పాటు ఇతర క్రీడాకారులను కూడా సమానంగా చూడండి. అయితే నాలాంటి పేదింటి క్రీడాకారిణులను కూడా ప్రోత్సహించాలని మాత్రమే కోరుతున్నా. వారిలానే నాకు కూడా ప్రభుత్వ ఉద్యోగం, ఇంటిస్థలం, మెరుగైన శిక్షణకు ఆర్థిక సాయం చేస్తే నాపైన కుటుంబ బాధ్యతల ఒత్తిడి తగ్గి, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటేందుకు అవకాశముంటుంది.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

ఎల్బీ నగర్ డీసీపీకి ఉద్యోగం పార్ట్‌టైం..

ల్యాండ్ సెటిల్మెంట్లు ఫుల్‌టైం

» మీడియాతో చిట్‌చాట్‌లో మధుయాష్కీగౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అధికారుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పింది నిజమని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఎల్బీనగర్ డీసీపీ ఫుల్ టైం ల్యాండ్ సెటిల్మెంట్లు.. పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడని ఆరోపించారు. ఓ భూ వివాదంలో తలదూర్చి.. సెటిల్‌మెంట్ చేస్తానంటూ ఒత్తిడి తెస్తున్నారన్నారు. భూ వివాదాల్లో జోక్యం చేసుకోవడానికి పోలీసులకు ఏం పని అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తాను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఆ అధికారి మారితే మంచిదని, లేనిపక్షంలో ఆయనపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్.. గాడి తప్పిన బండిలాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేశారని కితాబునిచ్చారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో దోపిడీ

» టీలో మత్తు మందు కలిపి ఇద్దరు ప్రయాణికుల డబ్బు, నగలు దోచుకున్న తోటి ప్రయాణికుడు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇద్దరు ప్రయాణికులను తోటి ప్రయాణికుడు మోసం చేశాడు. దాంతో బాధితులు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్‌కు చెందిన సత్యవతి అనే మహిళ కుమారుడు శశికుమార్‌తో కలిసి ఓ శుభకార్యం కోసం వారం రోజుల క్రితం రాజమండ్రికి వెళ్లారు. ఈనెల 15వ తేదీ రాత్రి వారు సికింద్రాబాద్‌కు వచ్చేందుకు రాజమండ్రిలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగిలోఎక్కారు. రైలు ప్లాట్‌ఫాంపై ఉండగానే చాయ్(టీ) అమ్ముకుంటూ ఓ వ్యక్తి వచ్చాడు. అప్పుడు 45 ఏళ్ల వయసున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి సత్యవతి వాళ్ల ఎదురుగా కూర్చుని, టీ తాగాలని సత్యవతి, శశికుమార్‌కు ఇచ్చాడు. దాంతో ఆ వ్యక్తితో కలిసి వారు టీ తాగారు. ఆ తర్వాత సత్యవతి, శశికుమార్ స్పృహ కోల్పోయారు. 16వ తేదీ ఉదయం రైలు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకోకముందే వారిద్దరూ స్పృహలోకి వచ్చారు. బ్యాగులు చూసుకోగా తమ బ్యాగులో ఉండాల్సిన 25 గ్రాముల బంగారు గొలుసు, రూ 6 వేలు నగదు కనిపించలేదు. మోసపోయామని గ్రహించిన సత్యవతి, శశికుమార్ సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో జరిగింది కాబట్టి ఈ కేసును రాజమండ్రి జీఆర్‌పీ పోలీసులకు బదిలీ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫిరాయింపులపై నేడు సుప్రీం కోర్టులో విచారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరగనుంది. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, టి.ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై చర్యలు తీసుకునేలా అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా మరికొందరు రిట్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిలపైనా చర్యలకు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా రెండు స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ మూడు పిటిషన్లపై మరోసారి విచారణ జరగనుంది. 'తగిన సమయం'లో స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని ఇంతకుముందు అధికారులు చెప్పడంతో దానికి ఎలాంటి నిర్వచనం ఇస్తారనేదానిపై ఆసక్తి నెలకొంది.

సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలపై జేఎన్‌టీయూ కొరడా

» రీయింబర్స్‌మెంట్ మంజూరైనా విద్యార్థులకు వేధింపులు

» అదనపు ఫీజు వసూళ్లపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

» షోకాజ్ నోటీసులు జారీ చేసిన జేఎన్‌టీయూ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వర్సిటీ అఫిలియేటెడ్, అటానమస్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కళాశాలలపై కొరడా ఝుళిపించేందుకు జేఎన్‌టీయూ సన్నద్ధమైంది. తాజాగా గోకరాజు గంగరాజు కళాశాలకు యూనివర్సిటీ అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఈ కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరైనప్పటికీ ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదులందాయి. దీంతో విద్యార్థులకు తక్షణమే సర్టిఫికెట్లు ఇవ్వాలని వర్సిటీ రిజిస్ట్రార్ ఫోన్ ద్వారా ఇచ్చిన ఆదేశాలను గోకరాజు కళాశాల యాజమాన్యం పెడచెవిన పెట్టడంతో షోకాజ్ నోటీసు జారీచేశారు. సరైన వివరణ ఇవ్వకుంటే కఠినచర్యలు తీసుకుంటామని, అవసరమైతే అఫిలియేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని కళాశాలలను ఉపేక్షించే ప్రసక్తే లేదని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు చెప్పారు. సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలపై విద్యార్థులు జేఎన్‌టీయూ వెబ్‌సైట్ పోర్టల్ నుంచి కానీ, పీఏటూరిజిస్ట్రార్‌కు ఇ-మెయిల్ ద్వారాగానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నిర్వహణ పనులతో పలు రైళ్ల రద్దు

సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలోని పలు సెక్షన్లలో నిర్వహణ పనుల కారణంగా కొన్ని రైళ్లను రద్దు చేశామని, మరికొన్ని రైళ్లను రీషెడ్యూల్ చేశామని దక్షిణ మధ్య రైల్వే అధికారి సీపీఆర్‌ఓ శ్రీధర్ ప్రకటించారు. ఆలేరు-పెంబర్తి స్టేషన్ల మధ్య ట్రాక్ మరమ్మతులు జరుగుతున్నందున ఈ నెల 17న సికింద్రాబాద్-భద్రాచలం,18న భద్రాచలం-సికింద్రాబాద్ (17659/17660) రైళ్లు రద్దయ్యాయని తెలిపారు. మరోవైపు సోమవారం గోరఖ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ మీదుగా యశ్వంత్‌పూర్ వెళ్లాల్సిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు, నిజాముద్దీన్ నుంచి సికింద్రాబాద్ రావాల్సిన దురంతో ఎక్స్‌ప్రెస్‌ను గంటన్నర పాటు రీషెడ్యూల్ చేసినట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్ డివిజన్ పరిధిలో చేపట్టనున్న నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 23న సిద్దిపేట్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-సిద్దిపేట్ (77656/77653) రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు.

నేడు రాజస్థాన్‌కు మంత్రులు ఉత్తమ్, సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కేంద్ర జలశక్తి శాఖకు చెందిన నేషనల్ వాటర్ మిషన్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారం జరిగే ఆలిండియా వాటర్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్‌కు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క హాజరవుతున్నారు. రాష్ట్రంలో సుస్థిర తాగునీటి సరఫరా వ్యవస్థపై మంత్రి సీతక్క ప్రజెంటేషన్ ఇస్తారు. బుధవారం మంత్రి ఉత్తమ్ తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాల కోసం తీసుకున్న చర్యలపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

ధర 'పుంజు'కొనె

(మొదటిపేజీ తరువాయి)

పిస్తా పప్పులు, ఉడికించిన గుడ్లు, మటన్ కీమా వగైరా వగైరాలన్నీ పెడుతూ కొత్తగా పందెం కోళ్లను సిద్ధం చేసే బదులు.. ఇదివరకే మంచి తర్ఫీదు పొంది.. బరి కోసం రెడీగా ఉన్న ఈ కోళ్లు కొనడమే మేలు కదా! అందుకేనేమో.. వేలం 'కూత' అదిరిపోయి.. లక్షల్లో డబ్బులు రాల్చింది! ఇక ఈ పుంజులన్నీ కూడా ఇటీవల రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం తోలుకట్టలోని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫామ్‌హౌస్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నవే!. ఈ 81 పుంజులకు సోమవారం రాజేంద్రనగర్ 13వ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి వేలంపాట వేశారు. తొమ్మిది కోళ్లను ఒక గ్రూపు చొప్పున మొత్తంగా తొమ్మిది గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూపులోని కోళ్ల కనీస ధర రూ.14వేలుగా నిర్ణయించారు. వేలంపాట మొదలైన వెంటనే కోళ్లన్నీ అమ్ముడైపోయాయి. ఆ డబ్బును కోర్టులో డిపాజిట్ చేశారు. వాస్తవానికి ఆ ఫాంహౌస్ నుంచి 84 కోళ్లను స్వాధీనం చేసుకున్నామని, మూడు కోళ్లు చచ్చిపోయాయని పోలీసులు చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో.. ఊడుతుందో?

» మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆ పార్టీలో చీలిక

» ప్రతీ పనికి కమీషన్ దండుకుంటున్న కొందరు మంత్రులు

» బీసీల్లో ముస్లింలను చేర్చి బిల్లు పంపితే ఆమోదించం: సంజయ్

కరీంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో.. ఊడుతుందో.. అర్థం కాని పరిస్థితి ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని బీజేపీ మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందని, ప్రభుత్వం ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. కొందరు మంత్రులు ప్రతీ పనికి 15 శాతం కమీషన్ దండుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి కొరివితో తలగోక్కుంటోందని వ్యాఖ్యానించారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి కేంద్రానికి బిల్లు పంపుతామంటే ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. ముస్లింలను తొలగించి బీసీ జాబితా పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తమదేనని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్ అని విమర్శించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా, యువతులకు స్కూటీ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు, రెండో పీఆర్సీ, విద్యార్థి, కళాశాల యజమానులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఓల్డ్ పెన్షన్ స్కీం, జీపీఎఫ్ డబ్బులు ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్ర ప్రజలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ఉందన్నారు. బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను కూడా నిలబెట్టలేక పోయిందని ఎద్దేవా చేశారు. ఇక రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం పాత్ర పోషించేది బీజేపీయే అన్నారు. క్రైస్తవుల్లో చాలా మంది ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకుంటూ ఎస్సీలను మోసం చేస్తున్నారని, బీసీల్లో ముస్లింలను చేర్చి బీసీలను మోసం చేస్తున్నారన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీకి కొమ్ము కాయడమే కుల సంఘాల పనా? అని ప్రశ్నించారు. మేధావులు ఆలోచించి బీజేపీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

అక్రమ క్రమబద్ధీకరణపై కొరడా ఏదీ!?

(మొదటిపేజీ తరువాయి)

అన్నట్లు మారింది. ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకుని.. ఎప్పటి నుంచో అక్కడ నివాసం ఉంటున్న వారికి క్రమబద్ధీకరణ చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం జీవో 59 జారీ చేసిన విషయం తెలిసిందే. క్రమబద్ధీకరణలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. భూముల విలువ ఆకాశాన్ని అంటడంతో గ్రేటర్ పరిధిలో జీవో 59 ముసుగులో అక్రమాలు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ అక్రమ క్రమబద్ధీకరణకు అనుమతులిస్తూనే ఉన్నారన్న ఆరోపణలూ వచ్చాయి. విలువైన భూములున్న జిల్లాల పరిధిలో అనేక అవకతవకలు జరిగాయి. ఒకే వ్యక్తి ఎకరాలకు ఎకరాలు క్రమబద్ధీకరించుకున్న సంఘటనలు వెలుగు చూశాయి. నిబంధనల ప్రకారం.. క్రమబద్ధీకరించుకునే స్థలంలో కనీసం ఓ గది లేదా చిన్న నిర్మాణమైనా ఉండాలి. కానీ, అవేమీ లేకుండానే ఉన్నట్లు సృష్టించి కథ నడిపించారు. గజం దాదాపు రెండు లక్షల వరకూ ఉండే బోయినపల్లి, ఫిల్మ్‌నగర్, ఎంఎస్ మక్తా వంటి ప్రాంతాల్లో చాలా మంది జీవో 59 కింద క్రమబద్ధీకరణకు అనుమతులు పొందారు. ఈ అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాలను ప్రచురించింది కూడా. ఈ నేపథ్యంలో.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 25న సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో క్రమబద్ధీకరణ కింద అనుమతి పొందిన వారిపై ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నాయని, అందువల్ల.. 17-8-2023కి ముందు, ఆ తర్వాత కన్వెయెన్స్ డీడ్స్‌కు సంబంధించిన తదుపరి లావాదేవీలను నిలిపి వేయాలని ఆదేశించారు. అంటే, ఆ స్థలాలను వేరొకరికి అమ్మడం కానీ, వాటిలో ఎలాంటి భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం కానీ లేకుండా కట్టడి చేశారు. రిజిస్ట్రేషన్లు ఆపేయాలని, తదుపరి విచారణ జరిగే వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని దానిలో పేర్కొన్నారు. ఆ 3 జిల్లాల్లో క్రమబద్ధీకరణ దరఖాస్తులను మళ్లీ పరిశీలించాలని నిర్దేశించారు. అయితే ఆ తర్వాత ఫిర్యాదులపై ఎలాంటి విచారణ చేపట్టలేదు. ఈ అంశం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. నిబంధనలను పట్టించుకోకుండా, ఇష్టారాజ్యంగా క్రమబద్ధీకరించిన అధికారులపైనా ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం.

సక్రమంగా ఉన్నా..

ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకున్న వారి స్థలాల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వ హయాంలో 2022 ఫిబ్రవరి 14న జీవో నంబరు 59 జారీ చేశారు. దీంతో తమ ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జీవో లక్ష్యం నెరవేరలేదు. సిబ్బంది కొరత సాకుతో తాను చేయాల్సిన సర్వే పనిని రెవెన్యూ శాఖ ఇతర శాఖలకు అప్పగించింది. రెవెన్యూయేతర శాఖల సిబ్బంది సర్వే చేయడంతో రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి వంటి జిల్లాల్లో వేలాది గజాల భూములు అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న దాఖలాలున్నాయి. 1000, 2000 గజాల్లో చిన్నపాటి గుడిసె ఉన్నా క్రమబద్ధీకరణకు అనుమతించారు. రంగారెడ్డి జిల్లాలో ఈ తరహా కేసులు అధికంగా వెలుగు చూశాయి. దీంతో, తొలి సారి సర్వేలో గుర్తించిన జాబితాలను పక్కన పెట్టి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆర్డీవో, తహసీల్దార్ నేతృత్వంలోని కమిటీలు మరోసారి క్షేత్ర స్థాయి సర్వే చేపట్టాయి. ఈ సర్వే ద్వారా కొంత వరకూ క్రమబద్ధీకరణ జరిగినా అత్యధిక దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. కేవలం ఆ మూడు జిల్లాలనే ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. మిగిలిన జిల్లాల్లోనూ క్రమబద్ధీకరణ ముందుకు సాగలేదు. అన్నీ సక్రమంగా ఉన్న వారి దరఖాస్తులనూ పరిష్కరించలేదు. వీరంతా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం

ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేసి ఇల్లు నిర్మించుకున్న వారి దరఖాస్తుల క్రమబద్ధీకరణ ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం లేకపోలేదు. 125 గజాల కంటే ఎక్కువ స్థలం ఉంటే మార్కెట్ విలువలో కనీస మొత్తం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది. ఆ స్థలంలో 50% ఇంటి నిర్మాణం పూర్తయి ఉండాలనే నిబంధనా ఉంది. ఇక 250 గజాల కంటే ఎక్కువ ఉంటే 50% కనీస ధర, 251-500 గజాల మధ్య ఉంటే 75%; 500-1000 గజాల మధ్య ఉంటే వంద శాతం కనీస ధర చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి. 250 గజాలపైన స్థలం క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుదారుల నుంచి ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై మరోసారి క్షేత్ర స్థాయి విచారణ చేసి దరఖాస్తుదారులకు పరిష్కారం చూపుతుందని ఆశించినా ఎలాంటి పురోగతి లేకపోవడం విశేషం.

రాత్రికి రాత్రే హైదరాబాద్‌ను మార్చలేరు!

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. వారాంతాల్లో కూల్చివేతలు చేపట్టరాదన్న తీర్పులను హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సైతం ఇచ్చామని వాటిని చదువుకోవాలని చెప్పామని పేర్కొంది. హైడ్రా ఇస్తున్న 24 గంటల నోటీసులు, ఆదివారం కూల్చివేతలపై హైకోర్టులో ఇప్పటికే చాలా పిటిషన్‌లు దాఖలయ్యాయని తెలిపింది. రెండో శనివారం విచారణ చేపట్టి టైటిల్ ఉందా? లేదా? అని నిర్ణయించి.. మరుసటి రోజు ఆదివారం కూల్చివేతలు చేపట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. చట్టవిరుద్ధమైన పనులకు హైడ్రా పాల్పడుతున్న నేపథ్యంలో ఆ సంస్థ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఈనెల 20న ఈ కోర్టు ప్రత్యక్షంగా హాజరై ఆయన చేపట్టిన కూల్చివేతలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ విషయాన్ని ప్రత్యక్షంగా రాజశేఖర్‌కు వివరించి చెప్పాలని హైడ్రా తరపు న్యాయవాదికి సూచించింది. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. అప్పటివరకు వివాదంలో ఉన్న ఆస్తికి సంబంధించి యథాతథస్థితి కొనసాగించాలని స్పష్టంచేసింది.

అలగారి ప్రవీణ్ అనే వ్యక్తి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామపరిధిలో సర్వే నెంబర్ 296లో రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా ఇంటిస్థలం కొనుగోలు చేశారు. అన్ని అనుమతులతో నిర్మాణాలు చేపట్టారు. పార్కు స్థలంలో షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ఆయనపై స్థానిక డెవలపర్స్ ఫిర్యాదు చేయడంతో హైడ్రా ఇన్‌స్పెక్టర్ ఆదివారం వచ్చి కూల్చివేతలు చేపట్టారు. ఆ ఆస్తికి సంబంధించి సివిల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో బాధితుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం ప్రత్యక్షంగా హాజరు కావాలని హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను ఆదేశించింది.

మళ్లీ కేసీఆరే రావాలని జనం కోరుకుంటున్నారు

» బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కారణ జన్ముడు కేసీఆర్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మళ్లీ కేసీఆరే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఆయనకు కొడుకుగా పుట్టడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. ఆయన తనకే కాక, యావత్ తెలంగాణ జాతికే హీరో అని కేటీఆర్ అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలను సోమవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన ఉద్యమ ప్రస్థానం, రాజకీయ జీవితంలోని ముఖ్యమైన అంశాలు ప్రతిబింబించేలా తలసాని ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీ వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు. శాసనమండలిలో విపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి కేటీఆర్ భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం బీఆర్‌ఎస్ అధినేత నడుం బిగించిన రోజు ఆయనకు ఏ మద్దతూ లేదన్నారు. మీడియా, మనీ, మజిల్ పవర్ లేకుండా తెలంగాణను సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. మళ్లీ ఆయన సీఎం కావాలనే లక్ష్యంతో అందరం కలిసి పనిచేద్దామని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

కేసీఆర్ అంటే 4 కోట్ల మంది భావోద్వేగం

ఉద్యమ నాయకుడు కేసీఆర్ అంటే నాలుగు కోట్ల మంది ప్రజల భావోద్వేగమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్‌కు తెలంగాణకు ఉన్న బంధం పేగు బంధమని తెలిపారు. 1969 మలిదశ ఉద్యమ సమయంలో కేసీఆర్ వయసు 15 ఏళ్లని అప్పుడే జై తెలంగాణ అని నినదించారని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ లాంటి ఎంతోమంది మేధావులు ఉద్యమంలో ఆయన వెంట నడిచారన్నారు. తెలంగాణ జైత్రయాత్రనో, కేసీఆర్ శవయాత్రనో అని ఆమరణ దీక్షకు దిగారని.. దాంతో కేంద్రం ప్రత్యేక రాష్ట్ర ప్రకటించిందని చెప్పారు. రేవంత్‌రెడ్డి తీరుతో ప్రజలు విసిగిపోతున్నారని, మా కేసీఆరే మళ్లీ రావాలని కోరుకుంటున్నారని హరీశ్ పేర్కొన్నారు. తెలంగాణను ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లిన నాయకుడు కేసీఆర్ అని మధుసూదనాచారి అన్నారు.

మార్చి మొదటి వారంలో గ్రూప్-1 ఫలితాలు..!

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1, 2, 3 పరీక్షల ఫలితాల విడుదలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) సిద్ధమైంది. లక్షల మంది నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫలితాలను మరో రెండు వారాల్లో ప్రకటించేందుకు చేస్తున్న కసరత్తు తుది దశకు చేరుకుంది. మార్చి మొదటి వారంలో గ్రూప్-1 మెయిన్స్ జనరల్ ర్యాంకింగ్ జాబితాను ప్రకటించి.. ఆ తర్వాత గ్రూప్-2, ఆపైన గ్రూప్-3 ఫలితాలను విడుదల చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఒకే అభ్యర్థి రెండుమూడు పోస్టులకు ఎంపికై.. ఆ తర్వాత ఖాళీలు మిగలకుండా ఉండేలా వ్యూహాత్మకంగా ఒకదాని తర్వాత మరో పరీక్ష ఫలితాలకు సిద్ధమైంది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు మార్చి మొదటి వారంలో గ్రూప్-1 ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలు విడుదలవుతాయి. ఈ మూడు పరీక్షలకు సంబంధించి 2,734 పోస్టులకు గాను 5,51,247 మంది అభ్యర్థులు పోటీపడ్డారు.

రాష్ట్రంలో తొలి గ్రూప్-1

తెలంగాణ ఆవిర్భావం తర్వాత.. ఎన్నో బాలారిష్టాలను దాటుకుని మొదటి సారి గ్రూప్-1 పరీక్షలు సజావుగా జరిగాయి. ఈ నేపథ్యంలో ఫలితాలను పారదర్శకంగా విడుదల చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. నిజానికి 2022లో 503 పోస్టుల భర్తీకి తొలిసారి గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలవ్వగా.. అదే ఏడాది అక్టోబరులో ప్రిలిమ్స్ పరీక్షలు జరిగాయి. జనవరిలో పేపర్ లీకేజీ వ్యవహారం బయటకు రావడంతో.. ఆ పరీక్షను రద్దుచేసి, 2023 జూన్‌లో నిర్వహించారు. అయితే.. బయోమెట్రిక్ తీసుకోలేదనే కారణంతో హైకోర్టు ఆ పరీక్షను రద్దు చేసింది. 2023 డిసెంబరులో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక.. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా జాబ్‌క్యాలెండర్‌కు కసరత్తు జరిగింది. అయితే.. అప్పటికే గ్రూప్-1 ప్రిలిమ్స్ రెండుసార్లు రద్దవ్వడంతో.. 2024 ఫిబ్రవరిలో మరో 63 పోస్టులను కలిపి.. మొత్తం 563 ఉద్యోగాలకు గాను తాజా నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 9న రాష్ట్రవ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష జరగ్గా.. 3.02 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. మెయిన్స్‌కు 31,382 మంది అర్హత సాధించగా.. అక్టోబరు 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించారు. టీజీపీఎస్సీ నిబంధనల ప్రకారం.. అన్ని పరీక్షలకు హాజరైన వారి పత్రాలనే వాల్యుయేషన్‌కు పరిశీలిస్తారు. ఇలా 21,093 మంది మాత్రమే అన్ని పరీక్షలను రాశారు. అంటే.. పోటీ 1:50 నుంచి 1:37కు తగ్గినట్లయింది. మెయిన్స్ జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి మొదటి వారంలో విడుదల చేసి.. 1:2 ప్రాతిపదికన అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారని సమాచారం.

గ్రూప్-2లో తగ్గిన హాజరుశాతం

తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2016లో గ్రూప్-2 పరీక్షలు జరిగినా.. ఫలితాలు ఆలస్యంగా వచ్చాయి. గత సర్కారు హయాంలోనే 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలైనా.. పేపర్‌లీకేజీల గందరగోళంతో ఒకసారి.. నిరుద్యోగుల డిమాండ్‌తో మరోసారి పరీక్షలు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు గత ఏడాది డిసెంబరు 15, 16 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,358 కేంద్రాల్లో ఈ పరీక్షల(నాలుగు పేపర్లు)ను నిర్వహించారు. రెండేళ్లుగా వాయిదాలు పడడంతో.. 5,51,855 మందికి గాను 74.96% మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. అయితే.. నాలుగు పరీక్షలకు 2,57,981(46%) మంది మాత్రమే హాజరయ్యారు. ఈ లెక్కన గ్రూప్-2లో మొత్తం 783 పోస్టుల్లో ఒక్కోదానికి 329 మంది పోటీ పడుతున్నారు. గ్రూప్-3 నోటిఫికేషన్ కూడా గత ప్రభుత్వ హయాంలోనే విడుదలవ్వగా.. పరీక్షల తేదీలను వెంటనే ప్రకటించలేదు. గత ఏడాది నవంబరులో ఈ పరీక్షలు(మూడు పేపర్లు) జరగ్గా.. 6,15,503 మంది అభ్యర్థులకు గాను.. 2,72,173 మంది హాజరయ్యారు. ఈ లెక్కన 1,388 పోస్టుల్లో ఒక్కోదానికి 196 మంది పోటీపడుతున్నారు. గ్రూప్-1 తర్వాత.. వరుసగా గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలను విడుదల చేయనున్నారు.

వ్యూహాత్మకంగా ఫలితాలు

గ్రూప్స్ పరీక్షల్లో ప్రభుత్వం ప్రకటించిన కొలువులన్నీ భర్తీకావడం ఓ సవాల్‌గా ఉండడం ఆనవాయితీ. ఇందుక్కారణం గ్రూప్-4, 3 వంటి వాటి ఫలితాలను ముందుగా ప్రకటించి, ఆ తర్వాత పెద్ద కొలువుల ఫలితాలను ప్రకటించడమే.! తొలుత ప్రకటించిన ఫలితాల్లో చిన్న పోస్టుల్లో చేరిన వారు.. ఆ తర్వాత గ్రూప్-2 లేదా గ్రూప్-1కు ఎంపికై.. పాత కొలువలను వీడుతున్నారు. దీంతో.. మళ్లీ ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఈ సారి ఆ సమస్య లేకుండా ఉండేందుకు టీజీపీఎస్సీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. అందుకే.. తొలుత గ్రూప్-1 ఫలితాలను విడుదల చేయాలని నిర్ణయించింది. ఆ తర్వాత గ్రూప్-2, 3 ఫలితాలను ప్రకటించడం వల్ల ఖాళీల సమస్య ఉండకపోవచ్చని భావిస్తోంది.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

» బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు

» కేసీఆర్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు



కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న కేటీఆర్, హరీశ్ తదితరులు

మర్కుక్/సిద్దిపేట టౌన్/హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజును సోమవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో నేతలు కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలన్నీ కార్లతో నిండిపోయాయి. బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, నాయకులు వచ్చి కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పాములపర్తిలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి కేసీఆర్ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు కూడా దండలు మార్చుకున్నారు. మార్గమధ్యంలో కేసీఆర్ కాన్వాయ్‌పై బీఆర్‌ఎస్ కార్యకర్తలు గులాబీల వర్షం కురిపించారు. మరోవైపు కేసీఆర్ దత్తత గ్రామం ఎర్రవల్లిలో ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించినట్లే ఆయుష్షు హోమం, సుదర్శన యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా సిద్దిపేటలో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన జట్లకు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మళ్లీ గెలుస్తుందని, వరుసగా మూడుసార్లు కేసీఆర్, ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని అన్నారు.

'వందేళ్ల ముందుచూపు' పుస్తకం ఆవిష్కరణ..

'వందేళ్ల ముందుచూపు' పేరిట కేసీఆర్ పదేళ్లపాలన, అభివృద్ధి అంశాలపై రచయిత జూలూరు గౌరీ శంకర్ వెలువరించిన పుస్తకాన్ని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం ఆవిష్కరించారు. ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు మహమూద్ అలీ, వద్దిరాజు రవిచంద్ర, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, రవీందర్‌రావు, వి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు.. కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్‌కు ఆరోగ్యవంతమైన జీవితాన్ని ప్రసాదించాలని ఆ దేవుడిని కోరుకుంటున్నట్టు 'ఎక్స్'లో పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా 'ఎక్స్' వేదికగా కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని హస్తినాపురం డివిజన్ నందనవనంలోని మూసానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో నినాదాలు చేయించారని అభ్యంతరం తెలిపారు.

కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం కార్యాలయం సోమవారం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపింది. అదేవిధంగా కేసీఆర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఫోన్‌చేసి స్వయంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో జీవిస్తూ.. ప్రజల సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితోపాటు పలువురు పార్టీ నేతలు కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలో సీఈజీఐఎస్‌తో ఎంఓయూ పునరుద్ధరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో డేటా ఆధారిత పాలనను మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం, వ్యయాలను క్రమబద్ధీకరించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ (సీఈజీఐఎస్)తో అవగాహన ఒప్పందాన్ని(ఎంఓయూ) పునరుద్ధరించుకుంది. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సీఈజీఐఎస్ వ్యవస్థాపకులు ప్రొ.కార్తీక్ మురళీధరన్, ప్రాజెక్టు డైరెక్టర్ హరినారాయణ్, ప్లానింగ్ డైరెక్టర్ ఓం ప్రకాశ్ ఎంఓయూపై సంతకాలు చేశారు. 2019 నుంచి 2024 వరకు కొనసాగిన ఎంఓయూను మరో ఐదేళ్ల వరకు పొడిగించారు.

హిందూ సంప్రదాయం ప్రకారమే రాజీవ్, సోనియా గాంధీల పెళ్లి: శ్రీధర్‌బాబు


పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ, రాజీవ్ గాంధీల గురించి కేంద్రమంత్రి బండి సంజయ్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, హిందూ సంప్రదాయం ప్రకారమే సోనియాగాంధీతో రాజీవ్ గాంధీ వివాహం జరిగిందని, ఆ తర్వాత సోనియాకు గాంధీ పేరు చేర్చారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాలు జరిగాయి. వీటికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు భర్తీ కాలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్‌ను రూపొందించామని, ఇప్పటివరకు 55 వేల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు.

బీఏలోనూ కృత్రిమ మేధ

- డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టులు కూడా..
- సిలబస్ మార్చాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి అత్యాధునిక టెక్నాలజీ సబ్జెక్టులు ఇకపై సాధారణ డిగ్రీలోని ఆర్ట్స్, కామర్స్, సోషల్ సైన్సెస్ విభాగాల్లోనూ అందుబాటులోకి రానున్నాయి. అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) స్థాయిలో అన్ని ఆర్ట్స్, కామర్స్ సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విభాగాలకు సంబంధించి కొత్త సిలబస్‌ను రూపొందించాలని ఉన్నత విద్యామండలి ఇప్పటికే నిర్ణయించింది. దీనికోసం వేర్వేరు యూజీ కోర్సులకు ప్రత్యేకంగా కమిటీలను వేశారు. సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆర్ట్స్ కోర్సుల సిలబస్ మార్పుపై ప్రధానంగా చర్చించారు. ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. బీఏ ప్రస్తుత సిలబస్‌లో 20%-30% పాఠ్యాంశాలను మార్చాలని నిర్ణయించారు. వీటిస్థానంలో కృత్రిమ మేధ(ఏఐ), డేటా సైన్స్ సైబర్ సెక్యూరిటీ పాఠ్యాంశాలను చేర్చనున్నారు. బీఏ(ఆనర్స్) లాంటి సాహిత్య ప్రధానమైన కోర్సుల్లోనూ ఈ టెక్నాలజీ సబ్జెక్టులను తప్పనిసరి చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. సిలబస్ మార్పు వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి రానుంది.

ఏప్రిల్ 19న నీట్ ఎండీఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మాస్టర్స్ ఆఫ్ డెంటల్ సర్జరీ(ఎండీఎస్)లో ప్రవేశాల కోసం జాతీయ అర్హత పరీక్ష(నీట్)ను ఏప్రిల్ 19న నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎమ్ఎస్) ప్రకటించింది. నీట్ ఎండీఎస్-2025ను ఎన్‌బీఈఎమ్ఎస్ నిర్వహిస్తోంది. అభ్యర్థులు మంగళవారం నుంచి మార్చి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్‌బీఈఎమ్ఎస్ తెలిపింది. ఫలితాలను మే 19న వెల్లడిస్తామని చెప్పింది.

రాత్రి చలి.. పగలు ఎండ..

హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పగటిపూట ఎండలు దంచికొడుతుంటే.. కొన్ని ప్రాంతాల్లో రాత్రివేళ చలి తీవ్రత కనిపిస్తోంది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37 డిగ్రీలపైనే నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం రాత్రి 20 జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 11-14 డిగ్రీల మధ్య నమోదయ్యాయని వెల్లడించింది. సోమవారం కామారెడ్డి జిల్లా పిట్లంలో 37.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయిందని పేర్కొంది. ఇక మంగళ, బుధవారాల్లోనూ ఎండలు దంచికొట్టే అవకాశం ఉందని తెలిపింది. మెజారిటీ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

బెంగళూరు మార్గంలో 10% రాయితీ: ఆర్టీసీ

బెంగళూరు మార్గంలో వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ 10% రాయితీ ప్రకటించింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు నడిచే సూపర్ లగ్జరీ నుంచి ఏసీ స్లీపర్ వరకు అన్ని సర్వీసులకు ఈ రాయితీ వర్తిస్తుందని ఆర్టీసీ అధికారులు సోమవారం తెలిపారు.

బావ పేరిట 30 లక్షల లోన్‌తో పొక్లెయిన్

- అలాగే పాలసీ తీసుకొని నామినీగా తన పేరు
- ఆ డబ్బు, పొక్లెయినర్ కోసం బావ హత్య..
- పోలీసుల అదుపులో బావమరిది

అమీన్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్‌లో ఇన్సూరెన్స్ డబ్బులతో పాటు పొక్లెయిన్‌ను సొంతం చేసుకునేందుకు సొంత బావను హత్య చేసిన బావమరిది కేసులో విస్తుపోయే నిజాలు బయట పడుతున్నాయి. సోమవారం నిందితుడు నరేశ్‌ను అతని మేనమామ దేవీసింగ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు వివరాలు వెల్లడించారు. నరేశ్ తన బావ పేరిట రూ.30 లక్షల లోన్ తీసుకుని పొక్లెయిన్ కొనుగోలు చేయడంతో పాటు దానికి రిస్క్ ఇన్సూరెన్స్ చేయించాడని, అలాగే రూ.29 లక్షల పోస్టల్ పాలసీ తీసుకుని తన పేరును నామినీగా చేర్చుకున్నాడని పోలీసులు తెలిపారు. అతడు మరణిస్తే పొక్లెయిన్‌తో పాటు ఇన్సూరెన్స్ డబ్బులను సొంతం చేసుకోవచ్చని హత్యకు పథకం రచించాడని తెలిపారు. పథకంలో భాగంగా శనివారం గోపాల్‌నాయక్‌ను అమీన్‌పూర్ శివారులోకి తీసుకెళ్లి మేనమామ దేవీసింగ్‌తో కలిసి గొంతునులిమి హతమార్చాడని వెల్లడించారు. అనంతరం గోపాల్‌నాయక్ మద్యం తాగి అనారోగ్యంతో చనిపోయినట్లు కుటుంబసభ్యులను నమ్మించాడని తెలిపారు. అయితే మెడ చుట్టూ కమిలిన గాయాలను చూసి గోపాల్‌నాయక్ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో నరేశ్ గుట్టు రట్టయిందన్నారు. నరేశ్‌తో పాటు దేవీసింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తలసరి ఆదాయంలో తెలంగాణ టాప్

జీఎస్‌డీపీలో దేశంలోనే ఏడో స్థానం.. గతేడాదికంటే 14.5% వృద్ధి రేటు

జీడీపీలో రాష్ట్ర వాటా 5.1 శాతం.. 'తెలంగాణ గణాంకాల సంగ్రహం-2024'లో వెల్లడి

ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్ర భాగాన నిలిచింది. 2023-24 ప్రాథమిక అంచనాల ప్రకారం... రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,56,564గా నమోదైందని ప్రభుత్వం వెల్లడించింది. సిక్కిం, ఢిల్లీ, గోవా, ఛండీగఢ్ వంటి చిన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మినహా పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ మొదటి స్థానంలో నిలుస్తోంది. ఈమేరకు రాష్ట్ర ప్రణాళిక శాఖ, తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్)... అధికారిక వినియోగం కోసం 2024 సంవత్సరానికిగాను 'తెలంగాణ రాష్ట్ర గణాంకాల సంగ్రహం(అట్లాస్)'ను రూపొందించాయి. ఈ అట్లాస్‌ను సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సచివాలయంలో ఆవిష్కరించారు. జాతీయ సగటు తలసరి ఆదాయం రూ.1,84,205గా ఉందని, దానికంటే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,72,359 ఎక్కువని వివరించింది. తెలంగాణ తలసరి ఆదాయం 2022-23 నుంచి 2023-24 మధ్య కాలంలో 14.1 శాతం పెరిగిందని, దక్షిణాది రాష్ట్రాలన్నిటినీ అధిగమించిందని తెలిపింది. ఇక రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ) వృద్ధి రేటు విషయంలో తెలంగాణ దేశంలోనే ఏడో రాష్ట్రంగా నిలిచిందని ప్రభుత్వం వెల్లడించింది. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)కి తెలంగాణ 5.1 శాతం వాటాను అందిస్తుందని వివరించింది. 2023-24 సంవత్సరానికిగాను జీఎస్‌డీపీ ప్రస్తుత ధరల వద్ద రూ.15,01,981 కోట్లుగా ఉందని అట్లాస్ వివరించింది. రాష్ట్ర జీఎస్‌డీపీ 14.5 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని తెలిపింది. ఇతర పెద్ద రాష్ట్రాల జీఎస్‌డీపీలతో పోలిస్తే రాష్ట్ర జీఎస్‌డీపీపరంగా తెలంగాణ దేశంలో ఏడో స్థానంలో నిలుస్తోందని వివరించింది. మొదటి స్థానంలో మహారాష్ట్ర, ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, కర్నాటక, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. 2022-23లో ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.13,11,823 కోట్లు ఉండగా.. 2023-24 సంవత్సరంలో 14.5 శాతం పెరిగి రూ.15,01,981 కోట్లకు చేరింది. 2022-23లో 14.2 శాతంగా ఉన్న జీడీపీ 2023-24లో 9.6 శాతానికి పడిపోయిందని తెలిపింది. 2014-15 నుంచి 2023-24 మధ్య కాలంలో తెలంగాణ జీఎస్‌డీపీ సగటు వృద్ధి రేటు 12.9 శాతంగా ఉంటే... జాతీయ జీడీపీ సగటు వృద్ధి రేటు 10.3 శాతంగా ఉందని వివరించింది.

ఏపీ నీటి తరలింపును అడ్డుకోవాలి

కృష్ణా నీటిని వాటాకు మించి తరలిస్తోంది.. కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదు చేయాలి

- టెలిమెట్రీ యంత్రంతో నీటిని లెక్కగట్టాలి
- పంటలకు ప్రణాళిక ప్రకారం విడుదల చేయాలి
- రాబోయే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలి
- తాగు, సాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం


హైదరాబాద్‌లో సివిల్ సప్లయ్, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి ఆంధ్రప్రదేశ్ వాటాకు మించి నీటిని తరలిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దీనిని అడ్డుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి తరలింపును వ్యతిరేకిస్తూ కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర జలవనరుల సంఘానికి లేఖలు రాయాలన్నారు. కృష్ణా నీటి పంపిణీపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ జరుపుతున్నందున.. ఈలోగా వాటాకు మించి నీటిని ఏపీ తరలించకుండా అడ్డుకునే బాధ్యత కేంద్రానిదేనని తెలిపారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, ఆయా ప్రాజెక్టుల కింద పంటల సాగు వంటి అంశాలపై సోమవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా బేసిన్‌కు తరలించే ప్రతి నీటి చుక్కనూ లెక్కగట్టడానికి ఆధునిక టెలిమెట్రీ విధానమే ముఖ్యమన్నారు. కచ్చితమైన లెక్కలతోనే నీటి తరలింపును అడ్డుకోగలమన్నారు. అయితే టెలిమెట్రీ యంత్రాలు పెట్టడానికి అయ్యే ఖర్చులో తమ వాటా చెల్లించేందుకు ఏపీ సర్కారు ముందుకు రావడం లేదని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. దాంతో ఆయా టెలిమెట్రీ యంత్రాలు పెట్టడానికి అయ్యే వ్యయాన్ని తెలంగాణ ప్రభుత్వమే భరిస్తుందని రేవంత్ అన్నారు. ఈ మేరకు సమ్మతి తెలుపుతూ కృష్ణాబోర్డుకు లేఖ రాయాలని నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు.

సాగు ప్రణాళిక ప్రకారమే నీటి విడుదల..

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల కింద సాగవుతున్న పంటలకు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎండలు పెరిగేకొద్దీ నీటి అవసరాలు పెరిగే అవకాశాలున్నందున.. ముందస్తుగా అంచనా తీసుకొని, పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేయాలన్నారు. రాబోయే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలించాలని, ప్రతి పంటకూ నీరందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా, పంటలు ఎండిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిర్దేశించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీతోపాటు ప్రధాన ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, వినియోగం వంటి వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. కాగా, శ్రీశైలంలో 83 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 187.70 టీఎంసీలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో40.58 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. దీంతో ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని, సాగు, తాగునీటికి ఎక్కడా ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని సీఎం అన్నారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రమంతటా సాగునీరు, తాగునీరు, విద్యుత్తు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరు, సాగునీటిని అందించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు.

కలెక్టర్లు స్వయంగా పరిశీలించాలి..

నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు పంటలకు నీటి విడుదలపై ఆయా జిల్లాల కలెక్టర్లు సంబంధిత నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో తక్షణమే సమీక్షలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాజెక్టులు, కాల్వలు, ఆయకట్టులో పంటలు, నీటి విడుదల తీరును కలెక్టర్లు స్వయంగా పరిశీలించాలన్నారు. నిర్దేశిత ఎజెండాను ఖరారు చేసుకొని అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, తగిన ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్డులు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను ప్రశ్నించారు. అయితే దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ చేసుకుంటున్నాయని, అందుకే రద్దీ ఉంటోందని అధికారులు చెప్పారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. దరఖాస్తు వచ్చిన వెంటనే కార్డులు జారీ చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా వెంటనే కొత్త కార్డుల జారీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్త కార్డులకు సంబంధించి పౌరసరఫరాల విభాగం రూపొందించిన పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం: రేవంత్

రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు, ఎస్పీలు ఇసుక రీచ్‌లను తనిఖీ చేయాలని, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఓవర్ లోడ్, అక్రమ రవాణాపై విజిలెన్స్ విభాగం దాడులు నిర్వహించాలని, అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కాగా, "ఇసుక రీచ్‌ల్లో ఇష్టారాజ్యం" శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

హైదరాబాద్ నుంచి నేరుగా మదీనాకు విమాన సేవలు

- 20 నుంచి ప్రారంభించనున్న ఇండిగో

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కృషితో తెలంగాణ ముస్లింలు ఇక హైదరాబాద్ నుంచి నేరుగా మదీనాకు వెళ్లవచ్చని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ అన్నారు. ఈ నెల 20 నుంచి విమానయాన సంస్థ ఇండిగో హైదరాబాద్ నుంచి మదీనాకు నేరుగా విమాన సేవల ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఇండిగో సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డి కృషితో ఇండిగో సంస్థ నేరుగా మదీనాకు విమాన సేవలను అందించేందుకు అంగీకరించిందని ఫహీమ్ ఖురేషీ చెప్పారు.


జాతీయ స్థాయిలో సాధించిన ప్రతిష్ఠాత్మక స్కోచ్ సిల్వర్ అవార్డును మంత్రికి చూపిస్తున్న కె.లక్ష్మి

మరో 3 చోట్ల పురుగు మందుల పరీక్షా కేంద్రాలు

- డీలర్లకు కంపెనీలు అందించే స్టాక్ వివరాలకు వెబ్‌సైట్: తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో రెండు, మూడు చోట్ల పురుగు మందుల పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం అగ్రో కెమికల్స్ అసోసియేషన్, న్యూఢిల్లీ ప్రతినిధులు సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కలుపు, పురుగు, తెగుళ్ల మందుల విక్రయాల గురించి, నకిలీ మందుల సరఫరా నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా వారు అభినందించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో పురుగు మందుల విక్రేతలకు ఇచ్చే లైసెన్స్‌ల విధానాన్ని ఆన్‌లైన్ చేశామని, రానున్న కాలంలో మరో 2-3 కేంద్రాలను ఏర్పాటు చేసి ఎక్కువ నమూనాలను పరీక్షించే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు. డీలరు విక్రయించిన పురుగు మందుల వివరాలు, కంపెనీలు డీలర్లకు అందించిన స్టాక్ వివరాలను తెలిపే విధంగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కాగా, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక స్కోచ్ సిల్వర్ అవార్డు పొందడంపై సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎండీ కొర్ర లక్ష్మిని.. మంత్రి తుమ్మల అభినందించారు. రాష్ట్రంలోని గిడ్డంగుల నిర్వహణ వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేసినందుకు సంస్థ 2024 స్కోచ్ అవార్డును సాధించింది. సచివాలయంలో అవార్డును మంత్రికి అందించారు.

రహదారుల మరమ్మతులకు బకాయిల గ్రహణం!

ఆర్‌అండ్‌బీలో 2,010కోట్లు పెండింగ్.. మరమ్మతుల బిల్లులు 100కోట్ల విడుదలకూ ఇక్కట్లు

- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు
- తాజాగా రూ.వెయ్యి కోట్లతో మరమ్మతు పనులకు ఆర్‌అండ్‌బీ సిద్ధం
- బకాయిలను చెల్లిస్తేనే కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనే పరిస్థితి!!

మహబూబ్‌నగర్ జిల్లాలోని దండు-ముస్టిపల్లి రోడ్డు దగ్గర ఉన్న కల్వర్టు డ్యామేజ్ పనులను ఒక కాంట్రాక్టరు చేశారు. ఈ పనికి సంబంధించిన బిల్లుకు 2018లో టోకెన్ నంబరు వచ్చింది. కానీ, ఇంతవరకూ బిల్లు మంజూరు కాలేదు. ఇంతకీ ఆ బిల్లు ఎంతో తెలుసా..? రూ.5,227!!

ఎమర్జెన్సీ రిపేర్ల కింద హనుమకొండ జిల్లాలోని కాజీపేట-పెద్దమ్మగడ్డ దగ్గర పనులు నిర్వహించారు. వీటికి 2024 డిసెంబరు 24న టోకెన్ వచ్చింది. కాంట్రాక్టర్‌కు రూ.7,641 చెల్లించాలి. ఇప్పటికీ చెల్లించలేదు.

రంగారెడ్డి జిల్లాలోనూ గత ఏప్రిల్ నుంచి రూ.16,880 బిల్లు పెండింగ్‌లో ఉంది. ఇలా చిన్నాచితకా బిల్లులే రూ.100 కోట్ల వరకు ఉంటాయి. పెద్ద పనులను కలుపుకొంటే మొత్తం 2,010 కోట్లుగా ఉంది.

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారుల మరమ్మతు పనులకు బకాయిల గ్రహణం పట్టింది.! రూ.5వేల నుంచి రూ.5లక్షల వరకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా.. చిన్నాచితకా మరమ్మతులు, పనులు, రోడ్ల నిర్మాణాలు, విస్తరణ పనులకు సంబంధించి రోడ్లు భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ)లో రూ.2,010.70కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. వీటిలో మరమ్మతులు, సాధారణ రిపేర్లకు సంబంధించిన బకాయిలు రూ.100 కోట్ల దాకా ఉన్నాయి. ఈ బకాయిల ప్రభావం కొత్త పనులపై తీవ్రంగా కనిపిస్తోంది. పనులు చేసినా ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో కొత్త పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడంలేదు. కొంత మంది టెండర్లు వేసినా.. పాత బిల్లులు ఇచ్చాకే.. కొత్త పనులు మొదలుపెడతామని తేల్చిచెబుతున్నారు. వెరసి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ వద్ద డబ్బులు లేక రోడ్లకు మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొత్త రోడ్లువేయడం కాదుకదా.. ఉన్న రోడ్లపై పడిన గుంతలను కూడా పూడ్చలేని దుస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆందోళన నెలకొంటోంది.

టోకెన్ నంబరిచ్చినా..

ఆర్‌అండ్‌బీలో పలువురు కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసేందుకు టోకెన్ నంబర్లు ఇచ్చినా.. నిధులను విడుదల చేయడం లేదు. వర్షాలు, వరదల సందర్భంగా దెబ్బతినే రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించాల్సి ఉంటుంది. ఇలాంటి పనులకు కూడా నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు బేజారవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన మరమ్మతులతోపాటు.. కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక పూర్తిచేసిన పనులకూ బిల్లులివ్వడం లేదని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. టెండర్లు రాగానే.. అప్పులు చేసి మరీ పనులు పూర్తి చేశామని, బిల్లుల చెల్లింపుకోసం ఏళ్లతరబడి ఎదురు చూస్తూ.. వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. కొత్తపనులు చేసేందుకు చాలా మంది కాంట్రాక్టర్లు వెనుకంజ వేస్తున్నట్లు చెబుతున్నారు.

రూ.1000 కోట్లతో కొత్త పనులు..

ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్లపై పడిన గుంతలు, ఇతర మరమ్మతులను నిర్వహించేందుకు శాఖ రూ.1,051కోట్లతో కొత్త పనుల జాబితాను రూపొందించింది. వీటిలో అత్యవసరంగా చేయాల్సిన పనులు, రెగ్యులర్ రిపేర్ల వారీగా జాబితాను సిద్ధం చేశా రు. రాష్ట్రవ్యాప్తంగా 82 నియోజకవర్గాల్లో ఈ రెండు రకాల పనులను చేపట్టాల్సి ఉందని పేర్కొంటూ అంచనాలను రూపొందించారు. బకాయిల ప్రభావంతో టెండర్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మరోవైపు హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్(హ్యామ్) కింద రాష్ట్రంలోని 96 నియోజకవర్గాల్లో 12 వేల కిలోమీటర్లను 3 దశల్లో రహదారులను అభివృద్ధి చేయాలని శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వీటికి రూ.కోట్లలో ఖర్చు కానుంది. అయితే.. బకాయిల గ్రహణం వీడితేగానీ, కొత్త పనులను ప్రారంభించలేని పరిస్థితులు నెలకొన్నాయి.



ఎమ్మెల్యేల లేఖలు

రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల పరిధిలోని రోడ్ల మరమ్మతులు, విస్తరణలు, కొత్త రహదారుల కోసం ఆర్‌అండ్‌బీకి లేఖలు రాస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలప్పుడూ ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాలకు రోడ్లను మంజూరు చేయాలంటూ వేడుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఒక్క ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించిన బకాయిలే రూ.2,035కోట్లు ఉండగా పంచాయతీరాజ్‌శాఖలోనూ ఆ మొత్తం రూ.కోట్లలో ఉంటుందని తెలుస్తోంది.

ఇసుక అక్రమాలకు పాల్పడితే లైసెన్సుల రద్దు

కాంట్రాక్టు సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెడతాం.. మైనింగ్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ స్పష్టీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమాలకు పాల్పడే కాంట్రాక్టర్ల లైసెన్సులను రద్దు చేస్తామని, కాంట్రాక్టు సంస్థలను బ్లాక్ లిస్టులో పెడతామని గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ హెచ్చరించారు. రాబోయే నెల రోజుల్లోగా రీచ్‌లు, స్టాక్ యార్డుల్లో సీసీ కెమెరాలు, వే బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తామని, వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంను అమలు చేస్తామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా నిరోధానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. ఇసుక అక్రమాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం, ఇతర మీడియాల్లో వస్తోన్న వార్తలపై స్పందిస్తూ సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "గతంలో మూడు షిఫ్టుల్లో మాత్రమే ఆన్‌లైన్ బుకింగ్‌కు అవకాశముండేది. ఇప్పుడు ఇసుక అక్రమాలకు తావు లేకుండా 24 గంటలపాటు ఆన్‌లైన్ బుకింగ్ అవకాశం కల్పించాం. మైనింగ్, పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల బృందాలు నిరంతరం స్టాక్ యార్డులు, రీచ్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రీచ్‌లలో ఇదివరకు రోజుకు 50 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండేది. ఇప్పుడు దానిని లక్ష మెట్రిక్ టన్నులకు పెంచాం" అని వివరించారు. అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టడానికి ఎక్కువ మొత్తంలో ఇసుకను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈనెల 10న ఇసుక లభ్యతపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి.. సరఫరాను పెంచాలని, పేదలకు తక్కువ ధరకే విక్రయించాలని, ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా సరఫరా చేయాలని, అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని, ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. ఇసుక ఎక్కువగా హైదరాబాద్‌కే వస్తుంటుందని, ఈ దృష్ట్యా నగర పోలీసు కమిషనర్, హైడ్రా కమిషనర్, రవాణా శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో నిఘాను పెంచామన్నారు. ఈనెల 10 నుంచి ఇప్పటి వరకు 1,529 వాహనాలను తనిఖీ చేశామని, ఓవర్ లోడ్, వే బిల్లులు లేకుండా వెళ్లే వాహనాలపై 162 కేసులు నమోదు చేశామని, 131 వాహనాలను సీజ్ చేశామని, రూ.26 లక్షల జరిమానాను వసూలు చేశామని పేర్కొన్నారు. "కొంతమంది టన్ను ఇసుకను రూ.3000 నుంచి రూ.5000 వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. కానీ, టన్నును రూ.1,600కు మించి విక్రయించడానికి వీల్లేదు. అధిక ధరలను నియంత్రించడానికే ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఇసుకను అందుబాటులో ఉంచుతోంది" అని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇసుక విక్రయాల ద్వారా ఈనెల 16వ తేదీ వరకు రూ.628 కోట్ల రాబడి వచ్చిందని, గత ఏడాది ఇదే కాలానికి రూ.567 కోట్లు వచ్చాయని. కాంట్రాక్టర్లకు దాదాపు రూ.570 కోట్ల వరకు ఉన్న పెండింగ్ బిల్లులను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఇసుక అక్రమాలకు సంబంధించి ఎలాంటి సమాచారమైనా టీజీఎండీసీలో ఏర్పాటు చేస్తున్న ఫోన్ నంబర్లు 98480 94373 లేదా 70939 14343లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో గనులు, భూగర్భ వనరుల శాఖ కమిషనర్ శశాంక్, టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

డోర్నకల్ ఎమ్మెల్యేపై కేసు నమోదు

» సూర్యాపేట భూమి విషయంలో వివాదం నేపథ్యంలో..

సూర్యాపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓ భూమి వివాదంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్‌నాయక్‌పై కేసు నమోదైంది. రాంచందర్‌నాయక్ సూర్యాపేటలో వైద్యుడిగా ఉన్న సమయంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో సర్వే నెం.356లో 1000 గజాల స్థలాన్ని 2010 సంవత్సరంలో కొనుగోలు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన గుండపనేని లక్ష్మీనర్సింహారావు అదే ప్రదేశంలో సర్వే నెం.232లోని 50 గుంటల స్థలం కొనుగోలు చేశాడు. ఈ సర్వే నెం.232, 356లోని భూమి విషయంలో రామచందర్‌నాయక్, లక్ష్మీనరసింహారావుల మధ్య 2015 నుంచి వివాదం నెలకొంది. రాంచందర్‌నాయక్ 1000 గజాలు తనదేనని అంటుండగా.. లక్ష్మీనరసింహారావు మాత్రం ఈ స్థలం మొత్తం తనదేనని, విక్రేత డాక్యుమెంట్లు సైతం రద్దు చేయించానని వాదిస్తున్నారు. కాగా సూర్యాపేటలోని 356 సర్వే నెంబర్‌లో ఉన్న 1000 గజాల స్థలాన్ని విక్రయించేందుకు ఈ ఏడాది జనవరి 8వ తేదీన రాంచందర్‌నాయక్ స్థలాన్ని చదును చేయిస్తున్న క్రమంలో సూర్యాపేటకు చెందిన కొంతమంది అడ్డుకున్నారు. దీంతో చదును చేస్తున్న వ్యక్తి లక్ష్మీనరసింహారావుకు సంబంధించిన వ్యక్తులపై సూర్యాపేట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా 9వ తేదీన కేసు నమోదైంది. జనవరి 12వ తేదీన లక్ష్మీనరసింహారావుకు చెందిన వ్యక్తులు ఫిర్యాదు చేయగా రాంచందర్ రావుకు సంబంధించిన ఎనిమిది మంది వ్యక్తులపై కేసు నమోదైంది. ఈ ఘటనపై ఇరు వర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేసి, ఎవరూ ఆ భూమిలోకి వెళ్లవద్దని ఆర్డీవోకు నివేదిక పంపారు.

హైకోర్టులో పిటిషన్

సివిల్ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకుంటున్నారని సూర్యాపేట జిల్లా ఎస్పీ, డీఎస్పీ, పట్టణ సీఐలను ప్రతివాదులుగా రాంచందర్‌నాయక్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో లక్ష్మీనరసింహారావు సైతం రాంచందర్‌నాయక్ పదవిని అడ్డుపెట్టుకుని భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు సూర్యాపేట జిల్లా పోలీసులకు నోటీసులు ఇచ్చింది. కాగా రాంచందర్‌నాయక్ చెప్పడంతోనే తాము ఈ పనిచేశామని ఆయన అనుచరుడు బాషిపంగు భాస్కర్ అంగీకరించటంతో రాంచందర్‌నాయక్‌పై కేసు నమోదు చేస్తూ సంబంధిత నివేదికను హైకోర్టుకు సమర్పించినట్లు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపారు.

శ్రీవారి ఎస్వీ అన్నదానం ట్రస్టుకు 11 కోట్లు విరాళం


టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి డీడీ అందజేస్తున్న దాత తుషార్ కుమార్

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.11 కోట్లు విరాళం అందింది. ముంబైలోని ప్రసిద్ యునో ఫ్యామిలీ ట్రస్టుకు చెందిన తుషార్ కుమార్ అనే భక్తుడు సోమవారం ఈ విరాళం అందజేశారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి ఈమేరకు డీడీ అందజేశారు.

నేడు మే నెల శ్రీవారి టికెట్ల కోటా విడుదల

తిరుమల శ్రీవారి ఆర్జితసేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన టికెట్ల మే నెల కోటాను ఆన్‌లైన్‌లో టీటీడీ మంగళవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. ఈ లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం 18 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటలకు వరకు ఆన్‌లైన్‌లో భక్తులు నమోదు చేసుకోవచ్చు. 21వ తేదీన ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను కూడా విడుదల చేస్తారు. 22న ఉదయం 11 గంటలకు శ్రీవాణిటికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న భక్తులకు టోకెన్లను జారీ చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి, తిరుమలలో గదుల కోటాను విడుదల చేయనున్నారు. భక్తులు వీటిని టీటీడీ అధికార వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా బుక్ చేసుకోవచ్చు.

ఆర్మీలో ఎన్‌సీసీ అధికారి పోస్టులు

ఎన్‌సీసీ అధికారి పోస్టులకు భారత సైన్యం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇండియన్ ఆర్మీ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 58వ కోర్సు ద్వారా అవివాహితులైన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. పురుషులకు 70 పోస్టులు, మహిళలకు 6 పోస్టులున్నాయి. ఇందులో 8 పోస్టులను యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు. 50 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసిన వారే ఈ ఉద్యోగాలకు అర్హులు. అలాగే ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్‌లో కనీసం బీ గ్రేడ్ సాధించాలి. ఆర్మీ అమరుల పిల్లలకు సీ సర్టిఫికెట్ అవసరం లేదు. అభ్యర్థుల వయసు 2025 జూలై 1 తేదీ నాటికి 19 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. అర్హత కలిగిన అభ్యర్థులు మార్చి 15వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాల కోసం https://joinindianarmy.nic.in/default.aspx వెబ్‌సైట్ సందర్శించవచ్చు.

నేవీలో 270 ఉద్యోగాలు

కేరళ ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో 2026 జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్‌సీ) కోర్సులో 270 ఖాళీలకు అవివాహిత యువతీ, యువకుల నుంచి భారత నౌకాదళం దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(హైడ్రో కేడర్) పోస్టులు 60, పైలెట్ పోస్టులు 26, నేవీ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్(అబ్జర్వర్) పోస్టులు 22, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ పోస్టులు 18 పోస్టులు, లాజిస్టిక్స్ పోస్టులు 28, ఎడ్యుకేషన్ పోస్టులు 15, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) పోస్టులు 38, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) పోస్టులు 45, నేవీ కన్‌స్ట్రక్షన్ పోస్టులు 18 ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం https://www.joinindiannavy.gov.in వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎయిర్‌పోర్ట్ అథారిటీలో 83 ఖాళీలు

న్యూఢిల్లీలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) 83 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనుంది. వాటిలో జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్ సర్వీసెస్) పోస్టులు 13, జూనియర్ ఎగ్జిక్యూటివ్(హ్యూమన్ రిసోర్సెస్) పోస్టులు 66, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (అఫీషియల్ లాంగ్వేజ్) పోస్టులు 4 ఉన్నాయి. సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ, ఎంబీఏ, పీజీ పాసై, అనుభవం ఉన్నవారు మార్చి 18లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం వివరాల కోసం https://www.aai.aero వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎన్‌టీపీసీలో 400 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన 400 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. 40 శాతం మార్కులతో బీఈ, బీటెక్(మెకానికల్, ఎలక్ట్రికల్) పాసై 35 ఏళ్ల లోపు వయసున్న వారు ఈ పోస్టులకు అర్హులు. అయితే రిజర్వేషన్లు అనుసరించి గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు మార్చి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాల కోసం https://careers. ntpc.co.in/recruitment వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

'ఔటర్ ఆకతాయిల' అరెస్టు, రిమాండ్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని పెద్దగోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్-13 వద్ద ప్రమాదకర విన్యాసాలు చేసిన ఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కె. శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ నెల 9వ తేదీ తెల్లవారుజామున 3గంటల సమయంలో నగరానికి చెందిన మహ్మద్ ఓబ్బెదుల్లా అన్సారీ డీఎల్ 1 సీఏఎఫ్ 2878, మహ్మద్ జహీర్ సిద్దిఖీ, డీఎల్ 1 సీఎం8267 రెండు కార్లలో పెద్దగోల్కొండ ఎగ్జిట్ 13 వద్ద స్టంట్లు నిర్వహించారు. దీంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

బూతులే బంగారు బాతులు!

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతోంది!! ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో కొనసాగుతున్న విపరీత పోకడ!! యూట్యూబ్‌లోనే కాదు.. యువత ఎక్కువగా వినియోగించే ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా అశ్లీల, బూతు వీడియోలు, షార్ట్‌లు కోకొల్లలు. ఓ రియాల్టీ షోలో రణ్‌వీర్ అలహాబాదియా వ్యాఖ్యల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనం, విపరీతమైన స్వేచ్ఛ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో పాటు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మన రాష్ట్రం సంగతేంటి..? తెలంగాణలో ఎప్పుడో హద్దులు దాటేసిన తెలుగు యూబ్యూబర్ల సంగతేంటి..? వీరి విచ్చలవిడితనాన్ని ప్రశ్నించేది ఎవరు..? వారికి అడ్డుకట్ట వేసేవారే లేరా..? రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోలేదా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వేల సబ్‌స్క్రైబర్లు.. లక్షల 'వ్యూస్'లు..



దేశంలో లక్షలాది మంది యూట్యూబ్ వేదికగా భారీగానే ఆర్జిస్తున్నారు. విద్య, వైద్యం, స్వయం ఉపాధి, మోటివేషన్, యోగా, ధ్యానం, ఆధ్యాత్మికత, ఎంటర్‌టైన్‌మెంట్ వీడియోలు రూపొందించి ప్రతినెలా లక్షల్లో ఆర్జిస్తున్నవారు ఎంతో మంది ఉన్నారు. యూట్యూబ్ వీడియోలకు వ్యాపార సంస్థలు భారీ ప్రకటనలు ఇస్తుండడం, ఎంత ఎక్కువ లైక్‌లు, సబ్‌స్క్రైబర్లు ఉంటే అంత ఎక్కువ ఆదాయం వస్తుండడంతో ఇప్పుడు ఆన్‌లైన్లో ఇదో పెద్ద వ్యాపారంగా మారింది. అనేకమంది ఉద్యోగాలు వదిలి పూర్తిస్థాయి యూట్యూబ్ చానళ్లు నిర్వహిస్తున్నారు. కానీ, ఇటీవలి కాలంలో ఈ వ్యాపారం పూర్తిగా గాడితప్పింది. తక్కువ సమయంలో భారీగా సబ్‌స్క్రైబర్లను పెంచుకోవాలంటే, వీక్షకులు, ఫాలోవర్లను పొందాలంటే దేనికైనా తెగించే యూట్యూబర్లు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఉదాహరణకు.. 'శ్రీ..' అనే మహిళ, గతంలో ఓ చానల్‌లో పనిచేసి, ఆనక ఓ పార్టీకి మద్దతుదారుగా మారిపోయి.. జననావయవాలకు సంబంధించిన పచ్చిబూతులను వాడుతూ అనర్గళంగా మాట్లాడే వీడియోలకు లక్షల్లో వ్యూస్ వస్తున్నాయి! 'సా...' అనే మరో యూట్యూబర్ ఆడపిల్లలను ఇంటర్వ్యూ చేసే పేరుతో.. ఆసాంతం బూతునే నమ్ముకుని రూపొందించే వీడియోలకూ భారీగా అభిమానులు ఉండడం విషాదం! విజయ్... పేరుతో ఉన్న ఓ యూట్యూబ్ చానల్‌లో రాయడానికి వీల్లేని విధంగా భాష వినియోగిస్తారు. కొందరు మహిళలు, యువతులను ఇంటర్వ్యూలు చేస్తూ.. అసభ్య మాటలతో సమాధానాలు చెప్పిస్తారు. ఈ చానల్‌లో ఇలాంటి బూతు వీడియోలు 1300 ఉండగా, 5 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అలాగే 'సూపర్ — స్టార్స్' పేరుతో ఉన్న యూట్యూబ్ చానల్లో ఓ మహిళ వాడే భాష, ఆమె చేసే ఇంటర్వ్యూల్లో వేసే ప్రశ్నలు, ఆమె వ్యక్తిగత అనుభవాలు.. అన్నింటినీ సెన్సార్ చేస్తే అరగంట వీడియోలో ప్రసారానికి అర్హమయ్యే నిడివి అరనిమిషం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు. ఈమె ఇప్పటివరకు 470 వీడియోలు అప్‌లోడ్ చేయగా.. 3.5 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. వీరే కాదు.. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి యూట్యూబ్ చానళ్లు, ఇన్‌స్టా ఆకౌంట్ల సంఖ్య వందల్లో ఉంటుంది. ఇప్పుడు స్మార్ట్ ఫోన్ వినియోగించే ప్రతి ఒక్కరూ యూట్యూబ్‌ను చూస్తారు. ఇలాంటి వీడియోలు నిత్యం అందరికీ తారసపడుతూనే ఉంటాయి. వీరంతా ఇంత విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నా.. ఎందుకు అడ్డుకోలేకపోతున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇలాంటి వీడియోలకు పెరుగుతున్న జనాదరణ చూసి.. ఇదే తరహాలో, అంతకుమించిన బూతులు, అశ్లీలతతో యూట్యూబ్ చానళ్లు పెట్టేవారి సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉంది.

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు..

వ్యక్తిగత గోప్యత, దేశ సమగ్రత, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషం రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసభ్య, అశ్లీలతకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పంచుకోకుండా కఠినమైన చట్టాలున్నాయి. ఈ విషయంలో యూట్యూబ్ కూడా ప్రత్యేక నిబంధనలు అమలుచేస్తోంది. వీటిని ఉల్లంఘించేవారిపై ఫిర్యాదు చేస్తే విచారించి తొలుత యూట్యూబ్ సంబంధిత ఛానల్‌కు హెచ్చరికలు జారీచేస్తుంది. రెండోసారి 'స్ట్రైక్' చేస్తే వారంపాటు వీడియోలు అప్‌లోడ్ చేయకుండా, లైవ్ స్ట్రీమ్‌లు ఇవ్వకుండా నిషేధిస్తుంది. మళ్లీ అదే పని చేస్తే రెండువారాల పాటు నిషేధం ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ చేస్తే చానల్‌ను శాశ్వతంగా తొలగిస్తుంది. అయితే రాష్ట్రంలోని అనేక యూట్యూబ్ చానళ్లపై నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నా.. స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఇంగ్లిష్, హిందీ భాషల్లోని వీడియో కంటెంట్‌పై యూట్యూబ్ స్పందిస్తున్నా.. తెలుగు, తమిళం, కన్నడ లాంటి ప్రాంతీయ భాషల వీడియోలపై పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో పలు చానళ్లు ఇష్టారాజ్యంగా వీడియోలు పెడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన వీడియోలు విపరీతంగా వైరల్ అయితే వాటిని మాత్రమే యూట్యూబ్ తొలగిస్తోంది. సదరు చానల్ మాత్రం కొనసాగుతోంది. బూతులు, అశ్లీలతే కాదు.. ఏఐ టూల్స్ సాయంతో.. సినీ నటులు, క్రీడాకారులు, ప్రముఖుల ముద్దులు, కౌగిళ్ల డీప్ ఫేక్ వీడియోలు రూపొందించి వైరల్ చేసేవారి సంఖ్య కూడా భారీగా ఉంటోంది. ఐటీ చట్టం ప్రకారం ఇది నేరం అయినప్పటికీ పోలీసులు, ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదు.

రాష్ట్ర ఐటీ శాఖ ఏం చేస్తోంది?

యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో దేశ సమగ్రత, మతాలు, ప్రాంతాలు మధ్య విద్వేషం, తప్పుడు వార్తలకు సంబంధించిన వీడియోలను ఆన్‌లైన్ నుంచి తొలగించే అధికారం కేంద్ర ఐటీ శాఖకు ఉంది. కేంద్రప్రభుత్వం సైతం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే చానళ్లపైనే చర్యలు తీసుకుంటోంది తప్ప బూతులు, అశ్లీల అంశాల జోలికి వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. ఓ రియాల్టీ షోలో ఇటీవల రణ్‌వీర్ అలహాబాదియా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రం తీరుపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఆన్‌లైన్ కంటెంట్‌ను నియంత్రించే హక్కు రాష్ట్రాలకూ ఉంది. ఏదైనా వీడియో అభ్యంతరకరంగా అనిపిస్తే వాటిని తొలగించమని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం లాంటి సంస్థలను కోరవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫిర్యాదు వస్తే వాటిని వెంటనే పరిశీలించి ఆ సంస్థలు నిర్ణయం తీసుకుంటాయి. అయితే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్రకే పరిమితం కావడం, అశ్లీల, బూతు వీడియోలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) శాఖ సైతం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విచ్చలవిడితనం కొనసాగుతోంది. తమ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించారంటూ గత మూడు నెలల్లో ఇద్దరు వ్యక్తులు నేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో యూట్యూబ్ సంబంధిత వీడియోలను తొలగించింది.

ఏసీబీ ఎదుటకు ఫార్ములా - ఈ ప్రతినిధులు

వర్చువల్‌గా విచారణకు హాజరు

» ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఏసీబీ ప్రశ్నలు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కారు రేసులో అక్రమాలకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అత్యంత ముఖ్యమైన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్‌ఈవో) సంస్థ ప్రతినిధులను ఏసీబీ ప్రత్యేక బృందం సోమవారం విచారించింది. అయితే నేరుగా కాకుండా వర్చువల్ (ఆన్‌లైన్) పద్ధతిలో విచారణకు వారు హాజరయ్యారు. ఈ కేసు విచారణకు సంబంధించి తమ ఎదుట హాజరు కావాల్సిందిగా ఎఫ్‌ఈవో సంస్థ ప్రతినిధులకు ఏసీబీ అధికారులు జనవరిలోనే ఈ-మెయిల్‌లో నోటీసులు పంపించారు. అయితే తమ సంస్థ లండన్ కేంద్రంగా పనిచేస్తున్నందున విచారణకు హాజరయ్యేందుకు కొంత గడువు కావాలని సంస్థ ప్రతినిధులు కోరడంతో.. దర్యాప్తు సంస్థ అందుకు అంగీకరించింది. కానీ, గడువు తీసుకున్నప్పటికీ సంస్థ ప్రతినిధులు నేరుగా అధికారుల ఎదుట విచారణకు హాజరు కాలేదు. దీంతో చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న దర్యాప్తు సంస్థ.. వర్చువల్ పద్ధతిలో వారిని విచారించింది. ఎఫ్‌ఈవో సీఈవో జెఫ్‌తోపాటు మరికొందరిని ప్రశ్నించింది. ఈ కేసు దర్యాప్తులో ఇప్పటివరకు లభించిన ఆధారాలు, నిందితులను విచారించిన సమయంలో వెల్లడించిన సమాచారం ఆధారంగా వారిని ఏసీబీ ప్రత్యేక బృందం ప్రశ్నించింది. ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణ కోసం సంస్థను ముందుగా ఎవరు సంప్రదించారు? తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎవరైనా అధికారులు, సంస్థ సంప్రదింపులు జరిపారా? కుదుర్చుకున్న ఒప్పందమేంటి? ఒప్పంద పత్రాల్లో పొందుపరుచుకున్న ప్రధానమైన అంశాలేవి? ముఖ్యంగా ఎంఏయూడీ నుంచి రూ.45.71 కోట్ల నిధులు ఎన్ని విడతల్లో బదిలీ అయ్యాయి? మధ్యలో వేరే సంస్థ ఒప్పందం ఎందుకు చేసుకోవాల్సి వచ్చింది? సంస్థకు భారతదేశంలో ఉన్న బ్రాంచ్‌లు ఎన్ని?.. వంటి ప్రశ్నలు వేశారు. ఇందుకు సంబంధించి కొన్ని పత్రాలను పీడీఎఫ్ రూపంలో వారితో షేర్ చేసుకుని వాటికి సంబంధించి కూడా ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది.

ఆన్‌లైన్‌లో పత్రాల అందజేత..

విచారణ సందర్భంగా ఫార్ములా ఈ-కారు రేసుకు సంబంధించి 2022 అక్టోబరు 25న ఎంఏయూడీ, ఎఫ్‌ఈవో, ఏస్ నెక్ట్స్‌జెన్ మధ్య జరిగిన ఒప్పంద పత్రాలను కొన్నింటిని ఎఫ్‌ఈవో ప్రతినిధులు ఆన్‌లైన్‌లోనే ఏసీబీకి అందజేశారు. దర్యాప్తు అధికారులు అడిగిన ప్రశ్నలకు సంబంధించి వారి వద్ద ఉన్న సమాచారాన్ని వెల్లడించారు. ఏస్ నెక్ట్స్ జెన్ ప్రతినిధులు కారు రేసింగ్‌కు సంబంధించి తమను సంప్రదించినట్లు తెలిపారు. సుమారు గంటన్నరపాటు కొనసాగిన విచారణ క్రమాన్ని ఆడియో, వీడియో రూపంలో అధికారులు రికార్డు చేశారు. కాగా, ప్రస్తుతానికి వర్చువల్ పద్ధతిలో విచారించిన దర్యాప్తు అధికారులు.. అత్యంత కీలకమైన కేసు కావడంతో వారిని నేరుగా విచారించడం ద్వారా మరింత సమాచారం రాబట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే ఎఫ్‌ఈవో సంస్థకు మరోసారి నోటీసులు జారీ చేసి నేరుగా విచారణకు హాజరు కావాలని కోరే అవకాశం ఉంది. అయితే న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఎఫ్‌ఈవోకు రెండోసారి నోటీసుల విషయంలో ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ప్రధాన నిందితులుగా పేర్కొన్న మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డి, ఏస్ నెక్ట్స్ జెన్ ఎండీని ఏసీబీ ఇదివరకే విచారించిన విషయం తెలిసిందే.

కాపు కుల భవన నిర్మాణం చేపట్టొద్దు

» హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు కేటాయించిన స్థలంలో ఎలాంటి కుల సంఘాల భవనాలు చేపట్టరాదని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఒకవేళ ఏవైనా నిర్మాణాలు చేపట్టినా వాటి భవిష్యత్తు తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని తెలిపింది. గతంలో ఇదే కోర్టు కమ్మ, వెలమ కుల సంఘాలకు కేటాయించిన స్థలం విషయంలో ఇచ్చిన ఆదేశాలను ఈ కేసులోనూ పాటించాలని పేర్కొంది. బలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు కుల సంఘం భవనం నిర్మించుకునేందుకు రూ.100కు ఎకరం చొప్పున రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వే నెంబర్ 41/14లో 6.35 ఎకరాల భూమి కేటాయిస్తూ 2023 ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం జీవో 87 జారీచేసింది. విలువైన భూమిని అతి తక్కువ ధరకు కేటాయించి ప్రజల ఆస్తులను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ సుంకర నరేశ్ అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతానికి ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ తదుపరి విచారణ మార్చి 7కు వాయిదా వేసింది.

ఫాల్కన్ నిందితులపై లుక్‌ఔట్

» విదేశాల్లో ముగ్గురు నిందితులు

» కేసు నేపథ్యంలో పరారీ

» వెనక్కి రప్పించేందుకు లుక్‌ఔట్ జారీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశ చూపి భారీ మొత్తంలో మోసానికి పాల్పడిన ఫాల్కన్ ఇన్వాయిస్ కంపెనీ కేసు దర్యాప్తును సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు ముమ్మరం చేశారు. ఈ కంపెనీ దేశ వ్యాప్తంగా 6,979 మంది బాధితుల నుంచి రూ.1,700 కోట్లు వసూలు చేసిన విషయం తెలిసిందే. అందులో రూ.850 కోట్లు తిరిగి చెల్లించగా, మరో రూ.850 కోట్ల మేర మోసం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఫాల్కన్‌కు అనుబంధంగా 14 సంస్థలను ఏర్పాటు చేసి, పెట్టుబడులను ఆయా కంపెనీల్లో పెట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో మొత్తం 19 మందిని నిందితులుగా చేర్చారు. వీరిలో పవన్‌కుమార్ ఓదెల, కావ్య నల్లూరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగతా 17 మంది పరారీలో ఉన్నారు. వీరిలో ఎఫ్ఐడీ చైర్మన్ అమర్‌దీప్ కుమార్(ఆర్మీ మాజీ అధికారి కుమారుడు), చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) ఆర్యన్‌సింగ్, సీఈవో సందీప్ ప్రధాన నిందితులు. ఈ ముగ్గురూ విదేశాలకు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో.. వీరిపై లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. వీరు గతంలోనూ బ్లూలైఫ్ ఇంటర్నేషనల్ పేరుతో ఇదే తరహాలో మోసాలకు పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై 2022లో చేవెళ్లలో కేసు ఉంది. ఈ కేసులో నిందితులు పలు కంపెనీలకు డైరెక్టర్లుగా ఉండడంతో.. పోలీసులు ఆ అంశంపైనా దృష్టి సారించారు. అమర్‌దీప్‌కుమార్ ఏకంగా 16 కంపెనీల్లో డైరెక్టర్‌గా.. అనితాకుమారి 12 కంపెనీల్లో, పవన్‌కుమార్ ఓదెల రెండు కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నట్లు గుర్తించారు. దీంతో.. ఆయా కంపెనీలపై ఆరా తీస్తున్నారు.

మోసం ఇలా వెలుగులోకి..

ఢిల్లీకి చెందిన ఓ యువతి ఫాల్కన్ కంపెనీలో ఒకేసారి రూ.6 కోట్లను డిపాజిట్ చేసినట్లు సమాచారం. జనవరి 15 వరకు ఆమెకు వడ్డీ రూపంలో డబ్బులు వచ్చాయి. ఆ తర్వాత నుంచి ఎలాంటి చెల్లింపులు జరగకపోవడంతో హైదరాబాద్‌కు వచ్చారు. హైటెక్‌సిటీ హుడా ఎన్‌క్లేవ్‌లోని ఫాల్కన్ కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో.. సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన సైబరాబాద్ ఈవోడబ్ల్యూ విభాగం పోలీసులు ఫాల్కన్ స్కామ్‌ను గుర్తించారు. ఈ దందా 2021లో కొవిడ్ కాలం నుంచే సాగుతున్నట్లు నిర్ధారించారు.

22 బ్యాంకు అకౌంట్లు గుర్తింపు: డీసీపీ

ఈ కేసులో నిందితులు కొల్లగొట్టిన మొత్తాన్ని ఐసీఐసీఐకి చెందిన 22 బ్యాంకు ఖాతాల ద్వారా నిర్వహించినట్లు గుర్తించామని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ తెలిపారు. బ్యాంకు అధికారులకు లేఖలు రాశామని చెప్పారు. ఫాల్కన్ ముఠా సృష్టించిన కంపెనీల్లో 90% ఫేక్ అని వివరించారు. నిందితులపై మూడు కేసులు నమోదు చేశామని, ఇప్పటివరకు 40 మంది ఫిర్యాదు చేశారని, 70 మంది బాధితులు దర్యాప్తు అధికారులను సంప్రదించారన్నారు. బాధితుల్లో తెలుగు రాష్ట్రాలతోపాటు.. ఉత్తరాది వారున్నారని, వారిలో డాక్టర్లు, ఆర్మీ ఉద్యోగులు, టెకీలున్నట్లు వెల్లడించారు. రూ.850 కోట్ల మేర మోసం జరగడం.. నిధులను విదేశాలకు తరలించడంతో ఫాల్కన్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి సారించినట్లు తెలిసింది. మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు జరపనున్నట్లు సమాచారం.

ఆర్‌ఎంపీలు వర్సెస్ వైద్యులు!

శిక్షణనిచ్చి పత్రాలివ్వాలంటున్న ఆర్‌ఎంపీలు

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రాష్ట్ర వైద్యమండలి

నేడు ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘాల ఆత్మగౌరవ సభ

హైదరాబాద్, నల్లకుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక చికిత్స రూపంలో ప్రజలకు మేమూ వైద్యసేవలిందిస్తున్నాం.. ఇంకా అవసరమైనంత మేరకు మాకు శిక్షణనిచ్చి.. వైద్యసేవలందించే వారిగా గుర్తింపు పత్రాలివ్వండి! ఇది.. ఆర్‌ఎంపీ, పీఎంపీల డిమాండ్! వద్దేవద్దు.. ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు శిక్షణనిచ్చి, ధ్రువీకరణపత్రాలిస్తే అర్హతలేనివారిని ప్రోత్సహించినట్లవుతుంది.. ఆర్‌ఎంపీలు, పీఎంపీల తెలిసీ తెలియని వైద్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది! ఇది.. తెలంగాణ రాష్ట్ర వైద్యమండలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ విభాగం, జూనియర్ డాక్టర్ల సంఘం వ్యక్తం చేస్తున్న అభ్యంతరం! ఆర్‌ఎంపీలు-పీఎంపీలు, మూడు వైద్య విభాగాల మధ్య నెలకొన్న పేచీ ఇది. వాస్తవానికి ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమను వైద్య సేవలించేవారి కింద గుర్తించాలని 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసింది. ఈ ఏడాది జనవరిలో సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసింది. గవర్నర్‌కు వినతి పత్రం అందించింది. ఇక మంగళవారం ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ఎమ్మెల్సీ కోదండరామ్ మద్దతు పలికారు. ఆర్‌ఎంపీ, పీఎంపీల డిమాండ్‌లో న్యాయం ఉందని.. తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతోనే వారు ఈ సభను ఏర్పాటు చేసుకుంటున్నారని, దీన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే ఆర్‌ఎంపీలు, పీఎంపీల డిమాండ్‌ను తెలంగాణ రాష్ట్ర వైద్యమండలి, ఐఎంఏ తెలంగాణ విభాగం, జూనియర్ డాక్టర్ల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మంగళవారం నిర్వహించనున్న సభను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఉమ్మడి రాష్ట్రంలో 13 వేలమందికి శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 వేలమంది వరకు ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఉంటారని అంచనా. ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత వైద్యులకు శిక్షణనిచ్చి, గుర్తింపు పత్రాలివ్వాలని నిర్ణయించింది. విధివిధానాల కోసం 14 మంది సభ్యులతో ఒక కమిటీ వేస్తూ జీవో 429ను జారీ చేసింది. ఈ కమిటీ విస్తృతంగా చర్చించి, వారికి శిక్షణ ఇచ్చి, గుర్తింపు పత్రాలివ్వాలని సర్కారుకు సూచించింది. కమ్యూనిటీ పారామెడిక్స్‌గా గుర్తించి, సుమారు 13 వేల మందికి దశలవారీగా వెయ్యి గంటలకు పైగా క్లినికల్, థియరీ, ఫీల్డ్ విభాగాల్లో శిక్షణనిచ్చారు. ట్రైనింగ్ పూర్తయి సర్టిఫికెట్ ఇచ్చే సమయానికి నాటి సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించడం, ఆ వెంటనే తెలంగాణ ఉద్యమం ఊపందుకోవడంతో ఆ విషయం మరుగునపడింది. అప్పటికే చాలా మంది రూ.250 చలానా కట్టి శిక్షణ తీసుకొని సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు కూడా చేసుకున్నారు. 2012లో కొందరు నేతలు... కనీస విద్యార్హత కూడా లేని తమ అనుయాయులకు శిక్షణకు పంపి.. సర్టిఫికెట్ల కోసం సర్కారుపై ఒత్తిడి తెచ్చారు. దీంతో మొత్తం ప్రక్రియను అప్పటి వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న వీవీ రమేశ్ నిలిపివేశారు. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వీరికి శిక్షణ ఇచ్చి, ధ్రువీకరణ పత్రాలివ్వాలని నిర్ణయించినా ప్రక్రియ ముందుకు సాగలేదు.

సుప్రీం ఆదేశాల మేరకు శిక్షణ, పత్రాలు చెల్లుబాటు కావు

గతంలో ఎంబీబీఎస్ వైద్యుల సంఖ్య తక్కువగా ఉండటంతో పల్లెల్లో వైద్య సేవలందేవి కావు. దాంతో ఆర్‌ఎంపీ వ్యవస్థ పుట్టుకొచ్చింది. జాతీయ వైద్యమండలి, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇవ్వడం, సర్టిఫికెట్లు ఇవ్వడం చెల్లుబాటు కాదు.

-డాక్టర్ రాజీవ్, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు.

నకిలీ వైద్యులతో చిన్న హాని జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత

» ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడి హెచ్చరిక

నకిలీ వైద్యులతో రోగులకు చిన్న హాని జరిగినా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ వి.అశోక్, యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ అశోక్‌రెడ్డి హెచ్చరించారు. కనీస విద్యార్హత లేకుండా.. మందుల పేర్లూ తెలియని కొందరు కడుపునొప్పి అని వస్తే పాతకాలంలో మాదిరిగా బ్లేడుతో పొట్ట కోసి చికిత్సలు చేస్తున్న కొందరికి ప్రభుత్వం గుర్తింపు పత్రాలు ఇవ్వడం శోచనీయం అన్నారు. హైదరాబాద్ ఐఎంఏ కార్యాలయంలో జరిగిన ఓ సదస్సులో వైద్య, ఆరోగ్య ప్రమాణాలను పాటించడం అనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ వైద్యంతో ఇప్పటికే ప్రజలు విసిగిపోయి ఉన్నారని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు ప్రజాహితం కోసం ఉద్యమాలను చేయాలే తప్ప గ్రామాల్లో అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న నకిలీ వైద్యులను వెనకేసుకుని వస్తూ వారికి అధికారిక ఉత్తర్వులు ఇప్పించాలని కోరుకోవడం తగదన్నారు. తెలంగాణ ప్రజల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రతియేడాది వైద్య విద్య పూర్తిచేసుకొని బయటకు వచ్చే 10వేల మంది డాక్టర్లకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి.. ప్రతి నాలుగైదు గ్రామాలకు ఓ వైద్యుడిని ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.